
# తెరవని తలుపులు



కాశీభట్ల వేణుగోపాల్

# తెరవని తలుపులు

కాశీభట్ల వేణుగోపాల్

**TERAVNI TALUPULU** *(Novel)*
by KASIBHATLA VENUGOPAL

First Edition : November 2004
Second Edition : May 2013

© Author

Title :
STILL LIFE BY E.K.KUMAAR

*Published by :*
**AKSHARAM PRACHURANALU**
87/1345-10, Nandyal Checkpost
Kurnool - 2
Cell : 95500 79473

*For Online Purchases & e Book*

Kinige *www.kinige.com*

*Printed at*
**Sri Sri Printers**
VIJAYAWADA - 520 002
Cell : 9490 634849

**Rs : 80**

ఈ నవల్లోని పాత్రలూ సంఘటనలూ కేవలం కల్పితాలు అని నేనెవ్వరిని భ్రమింపజేయపూనడం లేదు....పేరు ప్రస్తావించవద్దని కోరిన ఓ ఎన్నారై మిత్రుడు తనకు తెలిసిన ఓ వ్యక్తి కథను యధాలాపంగా చెబుతూ దీన్ని నవలగా రాస్తే బావుంటుంది కదా అని ఓ నాలుగు సంవత్సరాల క్రితం అంటే.....ఇదుగో ఇదన్నమాట....

ఇది ఎవర్నీ కించపరిచే ప్రక్రియ కాదు.....

దీనివల్ల ఎవరికీ ఏ ఖేదమూ కలగదని నా నమ్మకం.....ఒకవేళ కలిగితే క్షమార్హుడ

ఈ నవల ముగింపు నేను సూచించిన పరిష్కారం కాదు..... వాస్తవం.

కొద్దో గొప్పో దీనివల్ల మేలు (పాఠకులకు) జరుగుతుందనే నా విశ్వాసం.....అదే జరిగిన పక్షంలో ఈ నవల..... (పెద్ద కథ) ఏదో చిన్న విజయం సాధించిందనే ఓ ఊరట

– కాశీభట్ల వేణుగోపాల్

## తెరవని తలుపులు

హితుడూ సన్నిహితుడూ
మనసు గాయాలకు మాటల మల్హామ్ రాసే
వైద్యుడు
డాక్టర్ హోసూరు ఉమానాథరావుకు
ఈ నా చిరు నివేదన

–వేణు

## వలయాల్నించి విముక్తికి ప్రేరణ

నేనూ–చీకటి నవల ద్వారా తెలుగు పాఠక ప్రపంచాన్ని విస్మయపరిచిన కాశీభట్ల వేణుగోపాల్ తన రచనా పరంపరని అదే శైలిలో కొనసాగిస్తున్నారు. తపన, దిగంతం, మంచుపువ్వు ఇప్పుడు తాజాగా తెరవని తలుపులు.....ఇవన్నీ కూడా తెలుగు సాహిత్యంలో కొత్త కోణాల్ని రికార్డు చేసిన నవలలు. అప్పటి వరకు ఇతరులు స్పృశించని అంశాల్ని ఇతి వృత్తాలుగా తీసుకుని రాసిన నవలలు. పాఠకలోకాన్ని దిగ్భ్రమపరిచిన నవలలు. మర్యాదస్తుల మతి పోగొట్టిన నవలలు. ఇరవయ్యొకటో శతాబ్దంలో తెలుగు నవలకి మహర్దశని అందించిన నవలలు. ఈ నవలలన్నీ ఇంగ్లీషులోకి అనువాదం కావడం ఇవాళ ఎంతయినా అవసరం. తెలుగు నవల విశిష్టతని ప్రపంచానికి  చాటడానికి ఇది తప్పనిసరి. వాదాల గానుగకి తమను తాము కట్టేసుకుని ఆ చట్రంలో తిరుగాడేవాళ్ళకి కాశీభట్ల నవలలు అర్థం కావు. ఆయన రచనల్లోని తాత్వికాంశాల నిగూఢ రహస్యాల్ని వాళ్లు అవగతం చేసుకోలేరు. కానీ పాఠకులు వివేకులు. వారు ఆయన్ని స్వాగతించారు. మన కళ్ళముందు, మన ఎదుట ఒక విలక్షణ నవలాకారుడు జీవిస్తున్నాడన్న సత్యాన్ని వాళ్ళు గ్రహించారు.

నేను తొలి నుంచి కూడా తన నవల ఏదైనా చదవడం మొదలెట్టాక పూర్తి చేయకుండా ఉండలేకపోయాను. ఇప్పుడు ఈ నవల 'తెరవని తలుపులు' విషయంలోనూ అదే అనుభవం. అంటే ఈ రచయిత తాజాదనాన్ని కోల్పోలేదు. తన కలం వాడి తగ్గిపోలేదు. సృజనాత్మక రచయితగా తను మరింత ఉత్సాహాన్ని, నవ్యతని సంతరించుకున్నారు. దాని తాలూకు సొగసు ఈ నవలలో కనిపిస్తుంది.

☼ ☼ ☼

ఈ నవలలోని కథానాయకుడు ఆధునికత తెచ్చి పెట్టిన ఫలాన్ని అందుకున్నవాడు. బ్రాహ్మణుడు. కానీ అతనిది అబ్రాహ్మణజీవనశైలి. తాగుబోతు, చైన్ స్మోకర్. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా 'మంచి' సంపాదన. అడక్కుండానే వేలు, లక్షలు సమకూరుతుంటాయి. భార్య ఇంగ్లీషు లెక్చరర్. కొడుకు బాగా చదువుకున్నాడు. అమెరికాకి కూడా వెళతాడు. అంటే ఆర్థికంగా ఏ లోటూ లేదు. ఇది ప్రపంచానికి కనిపించే కథానాయకుడి భౌతిక స్థితి. కానీ అతడి మానసిక ప్రపంచం, అంతరంగజీవితం పరమ బీభత్సం, పెను విధ్వంసం. తనొక ఒంటరి. తను ఎవరినీ ప్రేమించలేదు. తనని ఎవరూ ప్రేమించరు. తన అస్తిత్వానికి అర్థం కనిపించదు. జీవితంలోని అసంగత్వం అర్థమవుతున్నకొద్దీ జీవితం పట్ల కసి పెరుగుతుంది. ఈ క్రమంలోనే తన స్మోకింగ్ తనను కాళ్ళు కదపలేని స్థితికి తీసుకొస్తుంది. స్మోకింగ్ మానకపోతే కాళ్ళు తీసేయాల్సి వస్తుందని డాక్టర్ చెప్పినా వినడు. చివరకు కాళ్ళు తీయక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. కుంటివానిగా, ఇతరులకు బరువుగా, లేదంటే గుదిబండగా

బతకడం కన్నా బతుకు నుంచి నిష్క్రమించడమే మేలని తలపోస్తాడు. తెల్లారి ఆపరేషన్ అనగా నిద్రమాత్రలు మింగి తన జీవితానికి ముగింపు పలుకుతాడు. ఇలా నవల ముగుస్తుంది. కానీ ఆ తర్వాత పాఠకుని మనఃప్రపంచంలో అంతర్మథనం మొదలవుతుంది. నవల చదువుతున్న క్రమంలోనే–అన్నీ ఉన్నట్టే ఉండి ఏమీ లేనితనాన్ని, ఎవరూ లేని తనాన్ని చూసి పాఠకుడిలో ఒక దిగులు, విషాదం గూడు కట్టుకుంటాయి. చివరి అధ్యాయం 'ప్రశాంత శూన్యం' దగ్గరకొచ్చేసరికి గుండెను బిగబట్టుకుని చదవాల్సి వస్తుంది. కానీ తప్పదు. ఆ విధంగా తప్ప మరో రకంగా ముగింపు చెప్పడం కుదరదు. నిజానికి ఇలా కొన్ని వాక్యాల్లో నవలలోని ఇతివృత్తం ఇదని, దాని సారాంశం ఇదని నేను చెప్పబోడం లేదు. అలా చెప్పడం కూడా నా పద్ధతి కాదు. ఎందుకంటే ఈ నవల కేవలం రచయిత ముగింపు దగ్గరే ఆగిపోదు. పాఠకుడి లోలోపలి ప్రపంచాల కల్లోలంతో కొనసాగుతుంది. చెప్పకుండానే చెప్పడం అనేదానికి ఇదొక ఉదాహరణ. ఇలాంటి క్రాఫ్ట్‌నవలా శిల్పం పట్ల ఎంతో అవగాహన ఉంటేగానీ సాధ్యం కాదు. ఈ నవలని చదవాలి. తమను తాము నిగ్గు తేల్చుకోవాలి. తమ అస్తిత్వం ఏమిటో తేల్చుకోవాలి. "నిన్ను నువ్వు తెలుసుకో" అంటాడు జిడ్డు కృష్ణమూర్తి. అలా నిన్ను నువ్వు తెలుసుకోవాలన్న తపనకు లోను చేసే నవల ఇది. గుడుగుడు గుంచం బతుకుల్లో కునారిల్లిపోయే వారి చెంప చెళ్ళు మనిపించి స్పృహలోకి తెచ్చి తాము ఏమిటో తామైనా బోధపరుచుకోవాలని చెప్పే నవల ఇది. ఈ క్రమంలో ఈ నవల అనేకానేక అంశాల్ని చర్చకు పెట్టింది. ఆధునికత తెచ్చిపెట్టిన మానవ విషాదాన్ని తాత్వికలోతుల్లోంచి అర్థం చేసుకోడానికి ప్రేరణగా నిలిచింది. సకలం సుభిక్షమన్నట్టే ఉన్నా భయానకమైన ఒంటరి ద్వీపాల్లా మిగిలిపోతున్న వారి బతుకులోని అసంగత్వాన్ని తెలియజెప్పింది.

* * *

ఈ అసంగతానికి మూలం మనిషి జీవితం సంక్లిష్టం కావడంలో ఉంది. మళ్లీ ఈ సంక్లిష్టతకి మూలం రెండు దొంతరల్లో కనిపిస్తోంది.

ఒకటి : చర్విత చర్వణంగా శతాబ్దాల విషాదభారాన్ని తలకెత్తుకోవడం.

రెండు : యంత్ర నాగరికత, పెట్టుబడి, నగర జీవితం సృష్టించే ప్రకంపనలు. శతాబ్దాలుగా మనిషి బతుకులో మార్పులేదు. పుట్టుక నుంచి మరణం వరకు హృదయ రాహిత్య బంధాలలో తేలియాడడమే తప్ప ఆర్ద్రత గల ఒక్క సంబంధం కూడా కనిపించదు. సముద్రంలో దప్పిగొన్న మనిషి అవస్థ ఎలాంటిదో చుట్టూ వున్న మనుషుల మధ్య తనదైన మనిషి కోసం వెంపర్లాట అలాంటిదే. అంతా మొక్కుబడి వ్యవహారమే. ఏ ఒక్క సంబంధంలోనూ ఆత్మీయత ఉట్టిపడదు.

మనిషి బతుకులోని ఈ దైన్యానికి పెట్టుబడి విశ్వరూపం ధరించడం మరో

కారణం. గత రెండు దశాబ్దాల పరిణామాల్ని గమనిస్తే మనుషులు దగ్గరవుతున్నట్టే కనిపిస్తారు. దూరాలు చెరిగిపోతున్నట్టుగానే కనిపిస్తాయి. కానీ మనిషి మరణించాడు. (బహుశా ఇది నీషే మాట అనుకుంటాను) లేదూ మనుషుల్ని చంపేశారు. ఇప్పుడు వినియోగదారులే ఉన్నారు. బేరసారాలాడటం వినియోగదారీ మనస్తత్వం. కుటుంబంలోనైనా, సమాజంలోనైనా, బతుకు క్రమంలో ఎక్కడయినా లాభాపేక్ష ప్రధానమైంది. తనకేమిటి ప్రయోజనమనే ధోరణి ప్రబలింది. మార్కెట్ మాంత్రికులే నిర్దేశకులయ్యారు. ఇక ఎవరు మాత్రం ఎవరికి మిగులుతారు. మనుషుల సున్నితమైన ప్రవృత్తుల్ని కూడా హరించివేసే ధోరణి పాతుకుపోయిన సంప్రదాయాలలోనూ, సరికొత్త జీవిత నమూనాల్లోనూ ఉంది.

ఇక్కడ కథానాయకుడు తన తమ్ముడి గురించి చెప్పిన మాటలు ఉటంకిస్తాను: “ఏం కావాలనుకున్నాడువాడు? ఆఖరికి ఏమయ్యాడు? ప్రొఫెషనల్ ఆర్టిస్టు కావాలనుకున్నాడు ….. ఇప్పుడు ఓ డిపార్ట్‌మెంటల్ స్టోరు నడుపుకుంటున్నాడు. వాడి ప్రవత్తి ఏమిటి? ఎంత సుకుమారం వాడి మనసు? చివరాఖరికి కొనుగోళ్లూ అమ్మకాలూ…..కూడికలూ తీసివేతలూ …. ఇవా వాడికి మిగిలేది? ఎందుకీ వైరుధ్యం?”.

నిజమే. కానీ దాదాపుగా ఈ వ్యవస్థలో దాదాపు అందరి జీవితాల్లోనూ ఇవే వైరుధ్యాలు కనిపిస్తాయి.

తను, తన భార్య గురించి ఇందులోని కథానాయకుడు ఒక మాట అంటాడు. “ఒకే చూరు కింద ఎక్కడ్నుంచో వచ్చి చేరి ఒకరికొకరు పరిచయం లేని కాందిశీకుల్లా వున్నాం”.

ఇది నిజంగా నిజం. మధ్య తరగతి కుటుంబాల్లో బతుకు ఇలానే గడిచిపోతుంది. ఎవరికి వాళ్లు యాంత్రికంగా, ఏదో తప్పదన్నట్లుగా తమ పాత్రల్ని పోషిస్తుంటారు. ఎవరి పట్ల ఎవరికీ ఎలాంటి ఆపేక్షలుండవు. ఏళ్ళ తరబడి కలిసి జీవించినా సమాంతరరేఖల్లానే మిగిలిపోతారు. తమను తాము తెలుసుకోలేని వ్యవస్థల మీద నెపాన్ని మోపి తప్పించుకోలేం. ముందే చెప్పినట్టు మనుషుల్ని వినియోగదారులుగా మారుస్తుందీ వ్యవస్థ. కానీ ఇంకా వెనక్కి వెళ్ళి పరికిస్తే గానీ అసలు కారణం అంతుబట్టదు.

ఈ లోకంలో మనిషి అత్యంత తెలివైన ప్రాణిగా చెబుతారు. అయితే తన కాళ్ళకు తానే సంకెళ్ళు వేసుకుని స్వేచ్ఛ కోసం అల్లాడుతున్నాడు. స్వయం నిర్మిత చట్రాల్లో కొట్టుకులాడుతున్నాడు. కొన్ని వలయాల్లో, మూసల్లో కునారిల్లిపోతున్నాడు. తెలియని ఏ ఆవేశాలో, ఉద్వేగాలో నడిపిస్తే నడుస్తున్నాడు. తన అస్తిత్వానికి సంబంధించినంత జ్ఞానం లేనందున మనిషికి ఈ దుస్థితి అంటాడు కీర్క్‌గార్డ్. అస్తిత్వరాహిత్యం ఆధునిక మానవుడికి అతి పెద్ద ఆటంకం.

ఈ నవలలోని కథానాయకుడిది కూడా అదే అస్తిత్వ రాహిత్యం. తను ఎవరినీ ప్రేమించలేడు. అదే సమయంలో "నాలో నా పట్ల తప్ప ఎవ్వరి మీదా ప్రేమ లేదు..." అంటాడు. కానీ అది కూడా నిజం కాదు. తన పట్ల తనకి ప్రేమ ఉంటే జీవితం మరో మార్గంలో ఉండేది. కుటుంబంలో భార్య, కొడుకు, అత్తలకి సంబంధించిన గొడవని పక్కన పెట్టేవాడు. తనదైన మార్గంలో జీవితానందాన్ని పొందటానికి ప్రయత్నించేవాడు. కానీ అతను కొన్ని రకాల భ్రమలకిలోనయ్యాడు. అవి భ్రమలని తెలిసే కాలానికి జీవితం మీదనే ఆసక్తిని కోల్పోయాడు. కనుకనే ఉద్యోగంలో, తాగుడులో తనని తాను తప్పించుకునే ప్రయత్నంచేశాడు. ఎక్కువమంది ఇలా తప్పించుకోడానికి చేసే ప్రయత్నంలో అసలు జీవితాన్నే కోల్పోతారు. ఇదంతా ఎందుకు జరుగుతుందంటే పైన చెప్పినట్టు తెలియని ఏ ఉద్వేగాలో, ఆవేశాలో నడిపిస్తే నడిచి ఏదో సాధించాలనుకుంటారు. ఏవో లక్ష్యాల్ని, ఆదర్శాల్ని పెట్టుకుంటారు. తద్వారా జీవిత వాస్తవికతకి అంధులవుతారు. ఇక్కడే ఒక సందర్భంలో జిడ్డు కృష్ణమూర్తి చెప్పిన మాటలు ప్రస్తావిస్తాను: "ఏదో ఒక ఆదర్శాన్నిపెట్టుకొని, దాన్నిసాధించటానికి ఏదో ఒక మార్గాన్ని అనుసరించటం మొదలుపెడితే, కొంత జీవితాన్ని మన అనుభవంలోకి రాకుండా చేసుకోవటమే అవుతుంది". ఇక్కడ కథానాయకుడి విషయంలో జరిగింది అదే. తండ్రి మీద కోపంతో ఇంట్లోంచి బయటికి వచ్చిన అతను తండ్రిని ఏదో సాధించాలనుకుంటాడు, తనకి తాను తండ్రికి ఏదో నిరూపించు కోవాలనుకుంటాడు. ఈ క్రమంలో అతడు మరి కొన్ని వలయాల్లో చిక్కుకుపోతాడు. జీవిత చైతన్యాన్నే కోల్పోతాడు.

కానీ అతడు ఒక్కడే కాదు. వయసులో వున్నప్పుడు అతగాడికి తన కూతురిని కట్టబెట్టిన తల్లి, ఇష్టం లేకున్నా అతడితో ఏళ్ల తరబడి కాపురం చేసిన భార్య కూడా శతాబ్దాల వలయాల బాధితులే.

ఇక్కడ నవలలో కనిపించే ఈ వ్యక్తుల జీవితాలే కాదు. దాదాపుగా అందరి జీవితాల్లోనూ ఈ దుఃఖం, విషాదం, సంక్షోభం,పెనుచీకటి దట్టంగా అలుముకొని వున్నాయి. వీటికి మూలాలు మనజీవిత నమూనాల్లో వున్నాయి. మన విశ్వాసాల్లో ఉన్నాయి. మన అనుభవం కన్నా పాతుకుపోయిన భావజాలాల్ని శిరోధార్యంగా భావించడంలో ఉంది. వీటినించి విముక్తి చెందకుండా మనిషి జీవితానికి విముక్తి లేదు. విముక్తిని కోరుకునే వాళ్లు తమ పట్ల తాము ఎరుకతో ఉండాలి. అందుకుగాను తమని తాము పరికించి చూసుకోవాలి. అలా మీలోకి మీరు తరచి చూసుకోగల ధైర్యం ఉందా? అని ఈ నవల పాఠకుల్ని సవాల్ చేస్తుంది.

ఎందుకంటే తమ అంతరాల్లోకి తాము ప్రయాణిస్తే తమ జీవితంలోని భయానకమైన బంటరితనం, కనిపించని భీభత్సం ఏమిటో తెలిసివస్తుంది .ఆ దిశగా

మీకు ఎవరూ తలుపులు తెరవరు. మీ తలుపులు మీరే తెరుచుకోవాలి. అలా తెరిచి చూడగల సాహసం ఉంటే ఈ నవల్ని చదవండి. లేదంటే పక్కనపెట్టి రొటీన్ గాడిలో కొట్టుకుపోండి. నవల చదవడం మొదలెడితే మాత్రం ఆగలేరు. ఆపడం మీ చేతుల్లో ఉండదు. నవలని కళాత్మకంగా మలచగలిగిన నేర్పుఉన్న రచయిత కాశీభట్ల. కనుక మొదలెట్టగలిగే చేవ మీకు వుంటే చదివించుకుపోతాయి తన అక్షరాలు. మరి సిద్ధంగా ఉన్నారో లేదో తేల్చుకోవటం మీ వంతు.

**– గుడిపాటి**

# తెరవని తలుపులు

మళ్లీ....మళ్లీ...ఎన్నోసారో తెలియదు...ఇది ఎన్నో ఏడో....ఎన్నో దివాంతపు చీకటి స్నేహమో తెలియదు నా ఈ చిన్ని గదిలో బంగారు వర్ణంలో....గది గోడకు బందీ అయిన బీరువాల్లో....రకారకాల ముఖాలతో, నాకెప్పటికీ వ్యక్తిగతంగా పరిచయంకాని వాళ్లే ఎక్కువయిన మేధావులూ, శాస్త్రవేత్తలూ, సంపాదకులూ, చిత్రకారులూ, సంగీతకారులూ, కాముకులూ, సాంప్రదాయ వ్యతిరేకులూ, సాంప్రదాయ సైద్ధాంతిక ప్రచారకులూ....వాళ్ల మౌన భాష్యాల మధ్య ఈ నా చిన్ని గదిలో ఈ నా చీకటి స్నేహం ఎన్నేళ్లదో......

కొక్కేనికి వేల్లాడ్తోన్న కుర్తాలో లేని నేను మడత కుర్చీలో...... పేస్టల్ని పట్టుకోని నా చేతివేళ్లు కుర్తాలో లేని నేను మడత కుర్చీలోని నా ఒళ్లో....

నా చూపులకతీతంగా పేస్టల్ పట్టుకోని నా చేతుల్లో ఎవరో ఓ అపరిచితంగా వొదిగిన రచయిత.

ఆ అపరిచిత రచయితను పలకరించని నా చూపులు కిటికీ ఊచల్లోంచి ఓ ప్రపంచ శకలాన్ని....నాకు కొన్నేళ్లుగా పరిచిత ప్రపంచ శకలాన్ని....ఆ కిటికీ ఫ్రేంలో యిరుక్కుపోయిన ప్రపంచపు చిత్రశకలాన్ని చూస్తో....

ఇది ఎన్నో దివాంతమో.....యెన్నో ప్రదోషమో......

నా నరాల సార్వభౌమాధికారాన్ని అంగీకరించి, వాటి ఆజ్ఞను అవధరించి....లేచా....

ఈ మధ్యన కాళ్ల నెప్పి ఎక్కువౌతోంది......

వయస్సా?

యెంతనీ ! ఏభైరెండేగా!

గోడకి కొట్టుకుని యెప్పుడో..... అప్పుడెప్పుడో అందులో దిగబడి ప్రతిరోజు నన్ను సాంఘిక ముసుగునించి తప్పించే కొక్కేన్ని చేరుకుని.....

అది నిరాసక్తంగా ధరించిన నా ఖాతా కుర్తాలోకి ప్రవేశించి నా చీకటి గది తలుపులు తెరిచి మరింత చీకట్లోకి....నాప్రస్థానం....

అసలు నాదేనా యీ ప్రస్థానం?

అయితే గియితే ఎందాకా?

Quo-vadis?

⁕ ⁕ ⁕

"ఈ రోజున ఇంకా దుకాణం తెరవలేదేమా అనాలోచిస్తున్నా చూసావా? వెళ్తున్నాడూ.... కనీసం వారానికో మూడు నాళ్లేనా ఆపమన్చెప్పవే....ఆనక వెనకాముందూ మనకెవ్వరున్నారని అతనికైనా ఎవరున్నారనీ...మనందరి బాగుకోసమేగా నేన్నా తలబాదుకు చచ్చేదీ..." మా అత్తగారు, నా భార్యగారి తల్లిగారు.....

"ఇప్పటి నరకమా యిదీ మనకు....ఇరవై రెండేళ్లుగా మనల్నీయన హింసించని రోజేదీ...ఒక్కటి ఒక్కటంటే ఒక్కరోజు చూపించవే అమ్మా, నన్నేరోజున యీయనగారికి కట్టబెట్టావో ఆరోజే నా సర్వమూ మంటగల్సింది. ఈయన గారి గురించింక నాకేమీ చెప్పకు. అసలు నా గురించీ యీ సంసారం గురించీ వీసమెత్తు బాధుందా....మనిషికైతే చెప్పగలం....నా నోటితో అప్రాచ్యపు కూతలు కూయించకు".

ఎప్పుడో అలవాటుపడిన ఛీత్కారాలవి...శ్యామల ఎమ్మే, లెక్చరరినింగ్లిష్, మై వైఫ్....నిర్వికారంగా ముఖద్వారం బయట ముఖంలేని నేను.....ప్రముఖ ఇంజనీయర్ అండ్ హాబిచ్యువల్ డ్రంక్ అడీసెంట్ మ్యాన్, ఆర్టిస్ట్, సింగర్, అగూడ్ కంపెనీ టు సిట్‌విత్....

ఆరుమెట్లు ఆరువందల మెట్లలాగా అనిపిస్తున్నాయీ మధ్య వెనకాల నాలుగు జతల కళ్లలో ఛీత్కారాన్నీ, రెండు నోళ్ల అపహాస్యాన్నీ అలవోకగా వదిలేసి.....

నేను....

కాలిపిక్కలు తీవ్రంగా బాధిస్తున్నాయి.... ఫర్లాంగ్ దూరం నడవడానికి నరాలు గుంజుకుపోతున్న యాతన....వెళ్లాలి, యిక ఆలస్యం చేయకుండా రేపు సాయంకాలం ఉమానాథ్‌ని కలవాలి.....

అసలు ఉమానాథుని కల్సి ఎన్ని రోజులైంది?!

రోజులా...? నెలలు....దాదాపు మూడు నెలలై వుంటుంది.

ఎప్పటి స్నేహం మాది!

రోజూ వెళ్లాలనుంటుంది.

వెళ్తే...! ఇక మానెయ్...యూ హ్యావ్ డ్రంకినఫ్  ఫార్యువర్ లైఫ్....దానికంటే ముందు సిగరెట్....యూ లుక్ లైక్ అ వాకింగ్ చిమ్నీ...ఏభై దాటి నువ్వున్నావు అంటే ఆశ్చర్యం అంటూ మొదలుపెడ్తాడు.

నన్ను నేను యింకా అసహ్యించుకునేలా చేస్తాడు...

లేదు లేదు...వెళ్లాలి, వెళ్లి కాళ్ల సంగతి తెల్సుకోవాలి నిర్ణయించుకున్నా....

హ్యాపీ వైన్స్....ఇంటికి ఓ రెండు ఫర్లాంగులుంటుంది.....

చిన్నగా కాళ్లీడుస్తూ నడుస్తున్నా.... ఈ మాత్రమేనా నడవకుంటే ఎలా? హ్యాపీ వైన్స్...ఎవ్వరికీ.....హ్యాపీనెస్?

అమ్మేవాడికా! తాగేవాడికా......

అమ్మేవాడికి ఎప్పుడూ హ్యాపీనెస్సే.....

కాని తాగేవాడికి మాత్రం క్షణికమే.....

ఎందుకు.....ఎందుకీ తాగుబోతులీవిషయం గమనించరు......

గమనించడం వదిలేస్తే అసలు అటువేపుకు ఆలోచన్నే వెళ్లనివ్వరు. ఇలా ప్రపంచంలో తాగే వాళ్లంతా ఆలోచిస్తూ వెళితే......ప్రభుత్వాలు కూలిపోవూ.....

అవును మరి.....ప్రభుత్వాలు నిలవడానికీ, అభ్యర్థులు గెలవడానికీ  కీలక సాధనం సారా.... ఉన్న ప్రభుత్వాల ఖజానాలు నడవడానికి సారా....సారా..... మనసారా.... మనసారానేనా? నోనో అందరిసారా... సారా! సారా! బెర్నార్... సారా! సారీ బెర్నార్! సారాబెర్నార్ ప్యారిస్... ప్యారీ సారీ సారాబెర్నార్ పేరులోనే సారా వుంది...పేరులోనేనా సారా..... సారా కళ్ళనిండా సారా...కన్నులు కావవి నిండిన మధువుల గిన్నెలవి.... సారాకళ్లసారా....హ్యూగో దూమాలను రంగమ్మీద ఆరేసిన సారా....పద్యాల సారా మద్యం..... శిల్పాల సారం సారా! 'జీవిత జ్ఞాపకాలను' నిక్కచ్చిగా, వెదజల్లిందా జనం మీదకు....?

జనం....జనం.....సిటీ బస్సులనిండా....కార్లనిండా ఆటోలనిండా సైకిళ్లమీదా.... కాళ్లమీదా....జనం జనం జనం......

నడుస్తూన్న జనాలు వడివడిగా......విడివిడిగా మళ్లీ కలివిడిగా జనం....అంత వేగంగానూ.....అంతే నెమ్మదిగానూ...నుంచునీ....ఫుట్‌పాత్ రేలింగుకానుకునీ...జనం జనం జనం....కాళ్లమీద.....వీళ్లకి కాళ్ల నెప్పులుండవా....

కాలిపిక్కలు విపరీతంగా నెప్పెడుతున్నాయ్.....

హాయిగా నడుచుకుంటూ వెళ్తోన్న జనాలని ఒక్కొక్కళ్లనీ దగ్గరకు పిల్చి కసితీరా తిట్టాలనిపిస్తోంది. కారు తెచ్చుకునుంటే బాపుణ్ణి లూజు పైజామాలో జనాలక్కనిపించ కుండా దాగుని నన్ను హింసస్తున్ననాకాళ్లు.

సింపుల్ ఆర్త్రైటిస్....ఏజింగ్.....అస్టియో ఆర్త్రైటిస్....

ముసలి కీళ్లు అరిగిపోయుంటాయ్....అంతే అంతే....

రేపు సాయంకాలం ఉమానాథ్‌ని కలుస్తా.....కలుస్తా...

హమ్మయ్య హ్యాపీ....! Happy Wines...వచ్చేసా....

రోడ్డు కటువేపునించీ చేతులు చాచి ఆహ్వానిస్తో....Happy Wines...గ్లోసైన్ బోర్డు మీద లో Wines యాక్రిలిక్ 'W' ముక్కపక్కకి వాలిపోయింది....Wines లో డబ్లూ సోలిపోయింది.... పేరునిండా మత్తే కదా....

రోడ్డు దాటాలి...కాళ్లు....

రోడ్డుమీద ప్రవహిస్తో కీకారణ్యం....

కాళ్లు దాటమని లూజు పైజామాలో దాక్కొని మొరాయిస్తున్నాయ్.

ప్లీజ్ మై ఓల్డ్ క్రిపుల్డ్ లెగ్స్....టేక్మీ టు మై హెవెన్స్.....కాళ్లల్లారా కాళ్లల్లారా... తీసుకెళ్లరూ...మోకాళ్లకు మందేయిస్తా......తెగిన రేలింగ్ మధ్య చిన్న సందు......

ఒక మనిషినొకసారి రోడ్డుమీద కేసేందుకు....

రేలింగ్ తెగిన సందులో నేను.....

థేంక్యూ మ్యాన్ హూ ఎవర్యూ ఆర్, ఫార్ బ్రేకింగ్ దరేలింగ్....

చట్ట వ్యతిరేక చర్యకూ అభివందనం...చిన్నగా కూనిరాగం...

ఇంతకీ 'కూని' అంటే ఏమిటో!

ఏమిటో ఏమిటీ 'నరహత్య'. శబ్దరత్నాకరం....ఘోష.....రాగానికి 'కూని' ఏమిటి మరి....? కూన అయ్యుంటుందేమో.....ఏమో!

నా యింట్లో మాత్రం రాగాలకూనీయే....సరిసరి.....

పగిలిన కుక్క కంపెనీ రికార్డులు....

ప్రవహిస్తూన్న అరణ్యంలోంచి చిన్నగా దారి చేసుకుంటూ....కుంటూ కుంటుకుంటూ....

హమ్మయ్య.....

ఏమిటో యిది అమ్మనూ అయ్యనూ కలిపి ఒకేమాటు తల్చుకోవడమేమో! లేదూ ఏ మరాఠీ మూలాల్లోంచొచ్చిందో!

షాపువాడు నన్ను చూడగానే ఓ పైంట్ తీసి బ్రౌన్ కవర్‌లో పెట్టిదాన్ని మళ్లీ ఓ నల్ల ప్లాస్టిక్ కవర్లో పడేసి నా చేతికిచ్చాడు....

జీవితంలో నేను మొట్టమొదటిసారి విస్కీ తాగిన సంఘటన గుర్తుకొచ్చింది.

బి.ఇ.చదువుతున్నప్పుడు హాస్టల్లో......

రంగారావు ఫైనలియర్ స్టూడెంట్....నా రూమ్మేట్ కూడానూ...చాలా బ్రిలియంట్.... ప్రొఫెసర్లకి కూడా బోధపడని విషయాల్ని అలవోకగా తేల్చేసేవాడు.... అతన్దగ్గిర డబ్బు కంపుకొట్టేది.... అతనువాడే వస్తువుల్ని అబ్బురంగా చూసేవాడ్ని.

గ్రండిగ్ టేప్ రికార్టరు

ఓ టెలిఫంకన్ రేడియో సెట్టూ

ఇంపోర్టెడ్ బటర్ ఫ్లై రేజరూ....

సెంట్లూ, సబ్బులూ.....రకరకాల డ్రెస్సులూ....

అన్నిటికీ మించి రకరకాల పుస్తకాలు...

నా మధ్య తరగతి తనాన్ని ఎత్తి చూపుతున్నట్టుండేవి అతను వాడే వస్తువులూ..... అతని డాబూ దర్పమూ.....

అలాగని నన్నేనాడూ కించపరచేవాడు కాదు....

మా గది హాస్టలూ వెనక్కి చివరగా వుండేది....వార్డెను క్వార్టర్స్ మెయిన్ గేటు పక్కగా హాస్టలు ముందు భాగానికుండేది.... అసలు వార్డెను కూడా రంగారావుని చూస్తే కాస్త భయపడేవాడు..... చదువులో ఏనాడూ స్థాయి తగ్గదు. రాజకీయాల్లోకి వెళ్లడు.....ఎవ్వర్నీ లెక్కపెట్టేవాడూ కాదు....

అప్పుడప్పుడూ నన్ను సెకండ్ షో సినిమాకెళ్లమనేవాడు....ఎందుకో నాకు తెలుసు....

రంగారావుకి అమ్మాయిలపిచ్చి...

అలా చెప్పడంకంటే అమ్మాయిలకి రంగారావు పిచ్చి అస్టం సబబేమో.....

ఓ రోజున అడ్మినస్ట్రేటివ్ డిపార్డ్‌మెంటు టైపిస్టు అబ్రహాంతోపాటు సాయంకాలం ఏడున్నరాప్రాంతంలో వచ్చాడు.

కాసేపు పిచ్చాపాటీ తర్వాత, నన్ను వరండా చీకట్లోకి పిలుచుకెళ్లాడు రంగారావు....

"నిన్నిలా పంపించడం బాలేదు నాకు తెల్సు....కానీ వాడినొక్కడ్నీపంపితే నా పనీ జరగదు .... ఏమనుకోకు...అబ్రహంగాడితో వెళ్లి కాస్తా విస్కీ అదీ పట్రావాలి.... వాచ్‌మన్గాడ్ని పంపుదామంటే వాడు రేపట్నించీ మనల్ని చిల్లరకి వాడుకుంటాడు... నీకు తెల్సు అబ్రహాం చెల్లి గురించే యీ ప్లానంతా ప్లీజ్" అన్నాడు రంగారావ్.....

రంగారావ్‌కు నో అన్చెప్పడం నాకు వీలుపడని విషయం.....

రంగారావిచ్చిన డబ్బుతో వెనకాలి రివాల్వింగ్ గేట్‌లోంచీ వెళ్లి మందూ మాకులూ బిర్యానీ పొట్లాలూ తెచ్చాం....నేను అబ్రహాం...అన్నీ గదిలో పెట్టి తర్వాత రంగారావ్తో అన్నాను....

"నే మెస్ కెళ్లొస్తా"

"నోమెస్.....నథింగ్ వియారీటింగ్ హియర్ టు నైట్" అన్నాడు.

"బిర్యా...నీ" జంకుతూ అన్నా.... అప్రయత్నంగా ఎడం భుజమ్మీది షర్టులో దాక్కున్న యజ్ఞోపవీతాన్ని తాకీతాకకుండా తడుముకుంటూ...."బాల్స్ టుయువర్ రెలిజస్ నార్మ్స్....నీకో సంగతి చెబుతా విను....మా అమ్మ, మైమమ్ యీజె బ్రాహ్మిన్....మైడాడ్ అ నాయ్డు....హూ ఆమై?! ఆ? రారా....డోన్ బీ సిల్లీ."

దాం తర్వాత ఓ అరగంట మతము మనిషీ మీద ఎడాపెడా మాట్లాడాడు....

పాపం అబ్రహాం...పాపం వాడిచెల్లి అనుకున్నా...

కానీ పాపం నేను అనుకోలేకపోయా....

ఏవో మంత్రనగరాలకు వాకిళ్లు తెరిచినట్టు

ఏవో పుట్టు సంకెళ్లు ఫట్‌న తెగినట్టు......

నా నగ్న దేహానికి అద్భుతమైన రెక్కలు మొలిచినట్టు.......

ఎగిరి ఎగిరి ఎగిరి....ఏవో తెలియని అపరిచిత ఆకాశాలను దాటుకుంటూ.... ఎగిరి ఎగిరెగిరి...దాటుకుంటూ...దాటుకుంటూ కుంటూ కుంటుకుంటూ....

అబ్బా....!

కాళ్లు.....

మళ్లీ వాస్తవం....వర్తమానం....

నిజంకదా...గతం వాస్తవమైనా లేనిదేకదా? ఈ మధ్య టీవీలో ఏదో ఛానెల్లో వేస్తున్నాడు.... లైఫ్‌హాజ్ గాట్ నో యాక్షన్ రీప్లే

నిజంగా రివైండ్ చేయగల్గితే.....

అప్పట్లో కెళ్లిపోయి....నే తీసుకున్న నిర్ణయాల్ని తిరగేసి....

ప్రస్తుత వర్తమానంలో నా ఆత్మను వేటాడే వేటగాళ్లను నేనే అప్పుడు....గతంలో చంపేసొస్తాను వేటాడి వేటాడి... అప్పడ్నించి మళ్లీ ఇప్పట్లోకి కొత్త నేనుగా రావచ్చు.

భ్రమ.....అ వాస్తవం....

నో చాన్స్....ఇంపాజిబుల్.....

ఇప్పట్లో......ఈ క్షణాన చేతిలో సంచీతో నల్ల ప్లాస్టిక్ సంచీతో నేను పుట్‌పాత్ మీద.....

రోడ్డుమీద ప్రవహిస్తూన్న కీకారణ్యం.....

తలలు తలలుగా అలలు...

అలలు అలలుగా.....ఒకదాని వెంటొకటి....

ఎందుకింత వేగం యీ ప్రవాహానికి....?

ఎక్కడికీ?

ఏమవడానికీ?

ఎందులో కలవడానికీ?

ఈ బస్సుల్లో, కార్లల్లో, టూ వీలర్లమీదా, ఆటోల్లో, నడుస్తూ.... పరిగెడ్తోన్నట్టు కదుల్తూ..... వీళ్లందరూ ..... అశాశ్వతమజిలీలైన వాళ్ల కొంపలకే....!?

ఏం బావుకుంటారూ యింత యిలా పరిగెడ్తో దూకుతూ వెళ్లి?

మళ్లీ ఇళ్లల్లో రుసరుసలు....లోట్లు...డబ్బు ఇబ్బందులూ.... కూతుళ్ల పెళ్లిళ్లూ.... పిల్లల చదువులూ.... భోజనాలూ....పెళ్లాంతో శృంగారమన్చెప్పే రెండు నిముషాల కదలికలూ.... పెద్దల అసహనపు నిట్టూర్పులు.

భయాలూ.....

రోగాలూ......

ఆవేశాలూ.....

కించిత్ తాత్కాలికానందాలు.....

వీటిన్నిటి కోసమేనా యీ పరుగులు ఉరుకులు?

కాదుకాదు అసహనం.....

ఆ అంతిమ మజిలీ చేరేందుకు అసహనం.....

త్వరత్వరగా యివన్నీ పూర్తి చేసేసుకుని.....

ఫ్యాక్టరీ సైరన్ మోగగానే యిక పనైపోయినట్టు భ్రమించి బైటపడే శ్రామికుల్లాగా....

యస్ ఆల్దిసీజ బిగ్....వెరీ బిగ్ ఫ్యాక్టరీ వేర్ హ్యూమన్ క్రైండీజె మ్యాన్యు ఫ్యాక్చర్డ్... వేర్ కలామిటీస్ అండెలిటిల్ హ్యాపీనెస్ ఆర్ బై ప్రొడక్ట్స్....

కన్నీళ్లు....ఎఫ్లుఎంట్

చీకటి...స్టోర్ హౌస్....స్....స్స్

ఎలాగో ఇల్లు చేరా.....

* * *

వరండాలోనే పేము కుర్చీలో ప్రత్యక్షం.... ముసలి మంత్రగత్తె....

ఏం మాయాలాడి నాయనా....

అసలు దీని బుట్టలో ఎట్లా పడ్డాను?

ఎన్ని నయగారపు మాటలు మాట్లాడిందీ!

ఎంతెంత వినయం వలకబోసిందీ!

అట్లాయిట్లా చేసి కూతుర్ని కట్టబెట్టి నన్ను కట్టిపడేసింది....

దయ్యంముండా యిదీ దీని భూతద్దాల్లోంచి కనబడే మిడిగుడ్లూ ఆ పెద్దకుర్చీలో చిన్నగా.....

దీనికి డెభై ఏళ్లొచ్చాయి చచ్చిపోవచ్చుగా....

ఇదెందుకు చస్తుందీ...

నా తండ్రి మీద నన్నెగదోసి.... నా తమ్ముడితో గొడవ పెట్టిచ్చింది. ఇప్పటికీ ఆస్తి పంపకాలు కాలేదని....నా పెళ్లాంతో వూదరగొట్టిస్తోంది....ముసలిముండ... ఓల్డ్‌విచ్

దీనికంటే నా సవిత్తల్లే ఎంతో మేలు....

నన్ను గేట్లోనే చూసి లోపలికి వెళ్లిపోయింది.....

లోపలికెళ్లి వూరుకుంటుందా? ఊహూఁ....నా పెళ్లాముండ చెవిలో ఏదో వదురుతుంది.... ఆ దెయ్యమొచ్చి నా తాత్కాలిక మనశ్శాంతిని హత్యచేసిపోతుంది....

తల్లీకూతుళ్లిద్దరూ పైశాచికానందంతో కడుపారా దొబ్బి తింటారు......

నేను నా చీకటి గదిలోకి జీర్ణమైపోయా......

నా మత్తు తోట వాకిళ్లకి వేసిన తాళాలు తీస్తున్నా....

నా లోపలి పాశవిక ఘ్రాణశక్తి శత్రువు వాసన తెలిపింది.

నాటెరిటొరీ లోకడుగు పెట్టింది నను వెంటాడే యింకో పాశవిక శక్తి..... శ్యామల నామధేయి మైవైఫ్ వచ్చి ఎదురుగా మంచం పట్టీమీద కూచుంది....

ఇక నేను టార్గెట్ బోర్డ్......ఆమె షూటింగ్ ప్రాక్టీస్ మొదలౌతుంది....

"భార్గవకి ఫోన్చేసారా?" మొదటి తూటా.....

తలడ్డంగా వూపాను

"ఎందుకని చేయలేదూ?"

"అనవసరమని"

"ఎవరికి అనవసరం? మీకా అతనికా? లేదూ మాకనవసరం అని అనుకుంటున్నారా?"

"అందరికీ అనవసరం" నేను కూడా ఎన్జాయ్ చేస్తూ అన్నా.....

"ఎట్లా అనవసరమవుతుందీ....ఆస్తిలో మీకూ హక్కుంది.....ఆ హక్కు మాకు వస్తుంది...బాబు స్టేట్స్‌కి వెళ్తానంటున్నాడు ఫర్దర్ స్టడీస్‌కోసం....ఏం వాడికి ఆస్తి మీద హక్కు లేదా...." ఆవేశంతో ఆగింది వేటకత్తె....

శ్యామల వైపు నిశితంగా చూసా....

కళ్ల చుట్టూ నల్లటి వలయాలు......కొద్దిగా పైకి వంకర తిరిగి ముక్కు పుటాలు పైకి కనబడుతూ ముక్కు ....చిన్న చీలికలాంటి నోరు..... డై చేసిన వెంట్రుకలు....

ఎవరీ ఆకారం....?

దీన్నా నేను మోహించి, అంగలార్చి ప్రేమ ప్రేమా అంటూ మోకాళ్ల మీద దేక్కుంటూ దేబరించి....ఛీచిఛీ.....

కళ్లు బైర్లు కమ్మిన సమయంలో ఆడగాలి తగిల్తేనే కామం బుసలు కొట్టే వయసులో.... యస్....ఈ దెయ్యమే కాదు....ఇంకో పిశాచం కనిపించినా....వెంపర్లాడి వుండే వాడినేమో....

"ఏం మాట్లాడరేం?" కసిగా అంది శ్యామల.

"ఏముంది మాట్లాడ్డానికి ....బాబు కావాలంటే వాణ్ణెక్కడకేనా పంపించి చదివించే స్తోమత నాకుంది....నేను సంపాదించింది చాలువాడు జీవితాంతం రికామీగా తిరగడానికి.... నేను ఆస్తిలో భాగం అడగను గాక అడగను " తెగేసి చెప్పా.....

"నువ్వడక్కపోతే మేం అడగాల్సొస్తుంది నాయినా....అయినా నిన్నేమీ తమ్ముడ్ని హత్య చేయమన్లేదు కదా....మనకు న్యాయంగా రావాల్సింది అడగమంటున్నాం... అయినా యిదేం చోద్యమే శ్యామూ... మొన్న యితని తమ్ముడొొచ్చినట్టు తెల్సింది....ఇతన్ని ఆఫీసులోనే కల్సెళ్లిపోయాట్ట.....అక్కడేం జరిగిందో ఆ తమ్ముడయ్య యీ అన్నయ్యకేం నూరిపోసాడో తెలీదు...."

ముసలి మంత్రగత్తె రంగప్రవేశం....

నా పెళ్లానికి తల్లి సపోర్ట్ దొరికే సరికి బలం చేకూరింది. లేచి విసవిసా నా టేబుల్ దగ్గరికెళ్లి కార్డ్‌లెస్ ఫోన్ తెచ్చి గబగబా డయల్‌చేసి...నాచేతికిచ్చింది....

"మాట్లాడండి" అర్డరేస్తున్నట్టు అరిచింది....

"అదీ" ముసల్ది తలూపింది ముసలిదైపోయిన తొండలాగా.... నాకు తెలుసు నా పెళ్లాం డయల్జేసిన నంబరు తమ్ముడు భార్గవదే అని....

అవతల్నించీ వాడు 'హెలో' అన్నాడు....

"ఏరా భార్గవా...నేనూ అన్నయ్యని ఊరికే ఫోన్జేశా..."

అని రెండు పలకరింపు మాటలు మాట్లాడి ఫోన్ కట్‌చేసా....

చేసి ముసల్దాని వేపు తిరిగి 'హిహ్హిహీ' అన్నట్టు ఓ వెక్కిరింపు యికిలింత చేసా....

నా పెళ్లాం గొంతుస్థాయి పెరిగింది....

ముసలినక్క ఆ స్థాయికి శ్రుతి పెడుతోంది....

నా పెళ్లాం ఏడుపూ ముక్కుచీదుళ్లూ.....గొడవా రభసా ఈ కంగాళీ మధ్యలో

మా పుత్రరత్నం పచ్చులకుదురు రాజారావుగారి ఎంట్రీ...

విసురుగా లోపలికొచ్చి నన్నో విషపుచూపు చూసి వాళ్లమ్మ దగ్గరికెళ్లి పక్కలో కూచుని...

"మమ్మీ మమ్మీ వూరుకో...ఎందుకు తెలిసీ ఈయనతో గొడవ....పద మమ్మీ" అంటూనే నన్నో భయంకరమైన చూపు చూసాడు...

"కాదురా రాజయ్యా మీ నాన్నని ఏమడిగాం చెప్పు నీ చదువు కోసం మీకు

రావాల్సిన ఆస్తి అడగమన్నాం.... అదీ న్యాయంగా వచ్చేదే గదా" ఉప్పు అద్దింది ముసల్ది....

"అవును నేను యు.ఎస్. వెళ్లాలనుకుంటున్నాను, అడగాల్సిందే" సంబోధన లేకుండా నాతో అన్నాడు వాడు కచ్చగా.....

"ఎంత కావాలి సర్ మీకు యు.ఎస్. వెళ్లడానికి....ఓ పది లక్షలు చాలా ...నేను నానా గడ్డీ కరిచీ  సంపాదించింది ఓ కోటి వరకూ వుంది.....చెప్పండ్సర్ రాసిస్తాను....." వాడి వేపు వ్యంగ్య బాణాన్ని వదిలా......

'ఛీ' అన్చీదరించుకుని వాళ్లమ్మ రెక్క పట్టి యీడ్చి లేపి బైటికి లాక్కెళ్లాడు వాడు.

గది గుమ్మం దాటుతూ వాడు ఉచ్చరించిన శబ్దం వినబడింది

'బా......స్ట......ర్డ్'

'ఏయ్' అని గట్టిగా కేక పెట్టి స్టూల్మీదున్న గాజుగ్లాసెత్తి వాడివేపు బలమంతా వినియోగించి విసిరా...........

గురి తప్పింది.....లేదూ! వాళ్లప్పటికే గుమ్మం దాటి విసురుగా తలూపేసారో గ్లాసు గుమ్మం పైదిమ్మకు కొట్టుకు భళ్లున పగిలింది.....

* * *

ఎందరితో ఎన్నిటితో రాజీ పట్టం జీవితం?

అసలు రాజీ ఎందుకు పడాలి?

వీళ్లు లేకపోతే నాకు గడవదా?

ఇంకా ఆరేళ్ల సర్వీసుంది..... నానా లంచాలూ నికృష్టప్పనులూ చేసి సంపాదించు కున్నది వుంది. రిటైరయితే పెన్షనూ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చాలా వస్తాయి.

నేనెందుకు కలిసున్నానో నాకు లీలగా తెలుసు....

నేను విడిపోతే వీళ్లకు దారి సుగమమవుతుంది... అట్లా కావడం నాకు యిష్టం లేదు.

కలిసుండాలి....వాళ్లని హింసించాలి....వాళ్లు సుఖాలనుకుంటున్న వాటి కడ్డం పడుతుండాలి.....

ఆ క్రమంలో నేను హింసబడ్డమూ కావాలి.... మాసకిసం కాదు.....నేను నా తండ్రిపట్ల ప్రవర్తించిన తీరుకు ప్రాయశ్చిత్తం యీ హింస....నిజంగా ప్రాయశ్చిత్తమేనా?

కాదేమో.....

నా తండ్రిపట్ల అంతశ్చేతనలో కూడా ఏ కోశానా గౌరవం లేదే నాకు ....మరి ఏమిటీ స్థితికి కారణం.......

నాకే తెలీని ఓ అభద్రతా భావనేమో......

తమ్ముడితో చెల్లెళ్లతో సవత్తల్లి అనే పిన్నితో నేను ప్రవర్తించిన తీరుకు వాళ్లల్లో నా పట్ల అభిమానం నశించి ద్వేషం పెంచుకుని వుంటారనీ.....ఒకవేళ భార్యనీ, సంసారాన్నీ వదిలేసి వాళ్ల దగ్గరికి వెళ్లినా అభిమానంగా చూడరనీ....

వేరే గత్యంతరం లేదుగనకా....

వయస్సు వచ్చేస్తుండడమ్మూలానా

తాగుడూ సిగరెట్టు కలిగించిన అనారోగ్యం మూలానా నా భార్యకింకా నాపట్ల ఒకప్పటి భావనేదో అవశేషప్రాయంగానైనా మిగిలుందేమోనన్న వెర్రి ఆశ మూలంగా.....

నేను వీళ్లతో కలిసున్నాను......

యస్......ఇదే సరైన వివరణ....

నేను వారసత్వపు ఆస్తిని కోరకపోవడానికి కారణం నాలో వున్న గొప్ప ఔదార్యం కానేకాదు. .....

నేను నా తండ్రితో చేసిన ప్రతిజ్ఞ నెరవేరి తీరవలిసిందేనన్న అహంకారం.....

యస్ అవును.....అదే ప్రతిజ్ఞ.....ఇంకా అదే అహంకారం.

* * *

వెనక్కి......రీవైండ్.......

ఇంజనీరింగ్ రిజల్ట్స్ వచ్చాయి.....

మామూలు పాసు.....బొటాబొటి మార్కులు.....ఇంటికెళ్తే ఆ మహానుభావుడో పేద్ద లెక్చరిస్తాడు.....

తను ఎంతకష్టపడి సంపాదించేదీ...వున్న పాతికెకరాల పొలాన్నీ ఇంటిని నిలబెట్టుకుని.... అయిదుగురు సంతానాన్నీ.... ఇద్దరు భార్యల్నీ ఎట్లాసాకి సంతరించిందీ మళ్లీ వినిపిస్తాడు.....

ఇప్పుడు నాకొచ్చిన మార్కులు చూసి అవహేళన చేస్తాడు.......

తప్పదు........

రైలెక్కా.........

ఇల్లు చేరా....

అందరి మొహాలమీద ఓ పలకరింపు నవ్వు తప్ప....నేనొచ్చానన్న సంబరం ఎవ్వర్లోనూ నాక్కనిపించలేదు....

భార్గవగాడి గదిలో బ్యాగుపారేసి మొహం కడుక్కోడానికెళ్లా పెరట్లోకి.....

అక్కడ పిత్రుదేవులు సాయం సంధ్య వారుస్తోన్నారు.....

నేను నూతిలో నీళ్లు తులసిచెట్లో పోస్తూ"రంగనాయుడు గారితో మాట్లాడాను... రేపుదయం పదిన్నరా ప్రాంతంలో వెళ్లి ఆయన ఇంట్లో కలువు.... ఏదో హాస్పిటల్ బిల్డింగ్ కాంట్రాక్టుకు తీసుకున్నారట.... ప్రస్తుతానికి ఓ అయిదొందలిస్తానని చెప్పారు...నీ వంకర చేష్టలు మానేసి ఇక తిన్నగా వుండు.... ఆయన దగ్గర వున్నావంటే ఓ అయిదేళ్లలో నిన్ను ఓ మంచి స్థానంలో పెట్టగలరాయన". ఓ పలకరింపు లేదు.... మొహమ్మీద ఓ చిరునవ్వేనా కనీసం....

అరికాలిమంట నడి నెత్తికెక్కింది.....

అయినా దిగీ దిడగానే గొడవెందుకని తలపక్కకు తిప్పుకు వెళ్లిపోయా.....

పిన్ని పలకరింపుగా నవ్వి కాఫీ గ్లాసు చేతికిచ్చి

"ఓ పది నిముషాలాగు నాయినా దోసెలు వేస్తాను....."

ఆహా దోసెలు తింటానికండీ నేను బీయీ డిగ్రీ చేత్తో పట్టుకుని ఈ వూరు దిగబడిందీ....

అయినా కడుపు కరకరలాడుతోంది... ఆ కడుపు ముండకి నా తలకాయితో పనిలేదు.....దొంగముండా కడుపు....

నిజమే కడుపు యెంత గొప్పదండీ.

సైజుకి జానెడే....దానికోసం ఎంత సృష్టి......యెన్నెన్ని నాగరికతలు, ఎంతెంత సాంకేతిక ప్రగతి...ఎన్నెన్ని యుద్ధాలు...

ఇప్పటికీక్షణానికి మాత్రం ఓ రెండు దోసెలు....

యస్ ఓన్లీ టూ దోసాస్...

దోదోసాస్.... నో దోషాస్ ....దోసాస్.....సుయ్యీ దోసాస్ దోషలెస్...

వితల్లం చెట్నీ అండ్ చిట్లంపొడీ....కమ్‌కమ్మటి దోసాస్. దోసెలాలోచించవ్

కదా.... నే దోసెన్ని్ంచు తూన్నపుడు దోసెలా ఆలోచిస్తుందీ.... సార్త్ర్ మెల్లకన్నుతో తులసి కోట పక్కన జందెం వేసుక్కూచుని ఉపదేశం చేస్తున్నాడు....

దోసె తనకు తాను అస్తిత్వంలేనిది.....

దోసె నీకు అస్తిత్వం కలిగివుంది....

ఆలోచన లేని దోసెని ఆలోచిస్తున్న నువ్వు ఆలోచిస్తూ చింపుతావ్......

యస్ దోసాస్ చింపుతాన్ ......నాటోన్లీ టూ అట్లీస్ట్ ఫోర్ దోసాస్....

"ఏంట్రా అన్నయ్యా ఎప్పుడూ, ఎంతసేపైందీ... ఇప్పుడే?"

భార్గవగాడి పలకరింపుతో లోకంలోకి వచ్చా.....

అమ్మయ్య వీడొక్కడైనా పలకరించాడు మహద్భాగ్యం.....

భార్గవ గదినిండా పూర్తైనవీ కానివీ రకరకాల స్కెచ్చులూ, వాటర్ కలర్ ఆయిల్ కలర్ ఫ్రేములూ...

మంచి ఆర్టిస్ట్‌వాడు.... ఫైనార్ట్స్‌లో చేరబోతాడీ సంవత్సరం.........వాడొక్కడు నాతోటి మనసు విప్పి ఆప్యాయంగా మాట్లాడ్తాడు. చీకట్లో చెరువు గట్టున కూచున్నప్పుడు చెప్పాడు వాడు.

"నీకు రంగనాయుడి దగ్గర ఉద్యోగం మాత్రమే కాదు....శివాలయం వీధి సుబ్బాశాస్త్రుల్లి మూడో కూతుర్తోటి ముడికూడానూ' అని....

'ఎవరూ ఆ చదువు సంధ్యల్లేని దుబ్బముండా.....దెయ్యం లాగుంటుంది కదరా భార్గవా.....అయినా నన్నడక్కుండా నా పెళ్లేమిట్రా"

"ఏమో మన తండ్రిగారైన పచ్చలకుదురు ఈశ్వరయ్యను అడగాల్సిందే" అని నవ్వాడు భార్గవ.

రాత్రంతా కునుకులేదు....

భవిష్యత్తేమిటి?

ఈ దిక్కుమాలినూళ్లో బొటాబొటి డబ్బుతో పెళ్లి చేసుకొని పిల్లల్ని కని తన్నుకుని తన్నుకుని బతకడం నా వల్ల కాదు.... నిర్ణయించేసుకున్నా.....

✳ ✳ ✳

ఉదయాన్నే పెరట్లో బ్రష్చేసుకుంటుంటే వెనకనించే పిడుగులా మోగింది తండ్రిగారి స్వరం.

"యజ్ఞోపవీతం ఏమైందిరా అప్రాచ్యుడా"

రంగారావు పరిచయంతోనే జందెం మొలతాడుపోయాయి....

ఇప్పిహీ్హా దారం పోగుకోసం అంతలా గొంతెందుకు చించుకుంటావ్ అనడగాలన్పించింది.....

"బనీను తీస్తూంటే దాంతోపాటే వచ్చేసింది"

"సరి సరి స్నానంచేసి దేముడి దగ్గర వత్తుల బుట్టలో వున్నాయి ఒకటి తీసి వేసుకో....మంత్రం గుర్తుంది కదా.... మూడుపోగుల్ది వేస్కో, తగలడు....సాన్నం అదీ చేసి కడుపుకింత పడేసి రంగనాయుడి గారింటికెళ్లు......"

ఇక సమయమాసన్నమైంది.....

చెప్పేయాలి

తప్పదు కాక తప్పదు....

భయంగా వుంది.....

కానీ చెప్పాలి..... ఇప్పుడు కాకపోతే యిక జీవితాంతం యింతే అన్నీ కూడగట్టుకున్నా....

"నేను పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తాను"

ఆయనకేం అర్థమయినట్టు లేదు...."ఏమిటి" అన్నాడు.....

"నేను ఎం.ఇ.చేయాలనుకుంటున్నాను"

యస్ చెప్పాసా....సెహబాష్.....

"ఏమి ఈ..?" 'ఈ' నిబాగా సాగదీస్తూ ఎడంకన్ను చిన్నగా చేసి నా వేపు కుడికంటితో తీక్షణంగా చూస్తూ వ్యంగ్యంగా అన్నాడు.

"ఎం.ఇ."

"ఇంతవరకూ సతికింది చాలూ.....ఆ నాయుడిగారి దగ్గర ఉజ్జోగానికి, తగలడు.... ఇప్పటికే నాకు భారమైపోయింది.... ఇక్క ఎమ్మీలూ, గిమ్మీలూ నా వల్ల కాదు... ఇక నీ సంపాదన నువ్వుచూసుకునే సమయమొచ్చేసింది....నువ్వరిచి గీపెట్టినా నా దగ్గర్నించి చిల్లిగవ్వరాలదు అర్థమైందా?"

ఆయనవేపు నిశితంగా చూసా....

అయిదడుగులెత్తూ .....ఎర్రగా పక్వానికొచ్చిన టోమేటోలా వున్నాడు ఆ ఊహకు నవ్వొచ్చింది....

నా పండిన టోమేటో తండ్రీ...అని పిలవాలన్పించింది

ఇంట్లో అందరూ అక్కడ గుమికూడి వున్నారు......

అందరి ముఖాల్లో ఆత్రుత ఏం జరుగుతుందోనని

నేను కూడా ధైర్యం చేయాలి లేకపోతే నా జీవితం తగలడిపోదూ? "నేనెట్టి పరిస్థితుల్లోనూ ఎం.ఇ. చేయాల్సిందే"

అనేసా....

"ఓహో తమరు నిర్ణయానికొచ్చేసి మరీ దిగబడ్డట్టున్నారు.... సరే ఎమ్మీకాకపోతే తమరిష్టమొచ్చిన చదువు సతకండి నానించీ ఎర్రఏగాణీ రాలదు...."

నౌ ఆర్ నెవర్.... చెప్పేయి అడిగేయి....సాహసము శాయరా చెప్పేస్తా చెప్పేస్తా అడిగేస్తా.....

"నా....నా భాగానికొచ్చే పొలం అమ్మేయండి"

కక్కేసా....

నా పండిన టోమేటో పండు తండ్రి ధనాలుమని ఢాం అని బద్దలై చితికిపో తాడేమోననిపించింది....

అటు వంటగది తలుపు వెనకాల్నించీ 'హో' అని సవిత్తల్లి ఏడుపు.... బిక్కచచ్చిన భార్గవగాడు...చెల్లి

మానట్టిల్లు కన్యాశుల్కం నాటకంలో అగ్నిహోత్రావధాన్ల యింటి రంగంలా మారింది...

నా టోమేటో పండు తండ్రి బుసలు కొడ్తూ భార్గవగాడి గదిలోకెళ్లి నా సూట్‌కేసు పట్టుకొచ్చి ధనాల్మని వీధిలోకి గిరాటేసాడు....

"ఫో ఛండాలుడా....ఇక నీ మొహం నాకు చూపించొద్దు.....భాగాలూ దౌర్భాగ్యుడా... నేను బెత్తెడు భూమి అమ్మను, నీకు ఎర్ర ఏగానీ యివ్వను... ఫో ఏంచేసుకొంటావో చేసుకో దొంగముండా కొడకా"

ఇప్పుడు నా టొమేటో తండ్రి తొడిమె తెగిన పండు మిరపకాయిలా వున్నాడని పించింది.

నాకూ ఆవేశమొస్తోంది....

మాటలు దొరకట్లేదు...కానీ నాక్కావాల్సింది నేను పొందాలి....ఎట్లా....

"ఎందుకివ్వరూ... అందరికిమల్లే నాకూ ఆ ఆస్తిలో వాటా వుంది....

నా కోసం ఓ రెండెకరాలమ్మితే మీరంతా పస్తుల్తో చస్తారా....

డబ్బు డబ్బు అని తన్నుకు చస్తారు....ఎంత ఓ పదేళ్లు చాలు లక్షలకు లక్షలు సంపాదించి మీ మొహన కొడ్తా”

ఏయ్ నా సామిరంగా నేనూ గెంతా....

“లక్షలు.....ఒక్క ఒక్క వెయ్యి రూపాయలు సంపాదించుకురారా వెధవా.... చూస్తాను.... నువ్వు సంపాదించిన బోడిపుచ్చా డిగ్రీకి ఎట్లాంటి ఉద్యోగం వస్తుందో మాకు తెలీదనుకోకు...అసలు నీలాంటి ముండా కొడుకుతో నాకు మాటలేంటి....నడువ్.”

ఆ మాటలకు తోడు నా సవిత్తల్లి ఏడుపు....

నాకు ఉక్రోషం

“ఏయ్ మా అమ్మను ముండా అంటావా? నీ రెండోపెళ్లాం ముండ నీ అమ్మ ముండ.... నువ్వు నువ్వు దొంగముండా కొడుకువి”

నేనే? నేనేనా అట్లా మాట్లాడింది... జారిపోయామే... ఎట్లా..... భార్గవగాడి మొహంలోనూ చెల్లి మొహంలోనూ అప్రసన్నత.....

టోమేటో మిరప్పండు గబగబ వీధి గుమ్మం మూలకెళ్లి చెప్పుతోటి తిరిగొచ్చింది....

సవిత్తల్లి హోమగుండంలోకి కన్నీళ్ల నెయ్యి పోస్తోంది....

“నన్ను పట్టుకొని ముండా అంటూంటే అందరూ చూస్తూ వున్నారే” అని హోరు’......

నా పండు మిరప టోమేటో తండ్రి విసిరిన చెప్పును తప్పించుకోడానికి నేను వీధిలోకి పరిగెత్తాను...

తొడిమె తెగిన నా తండ్రి నా వెనకాల కారాలు జల్లుతూ....

వీధిలోకి మారిన గృహాంతర కలహం......

కురుక్షేత్రం పద్యాల్లేవంతే నువ్వెంతంటే నువ్వెంత....

నువ్వేం చేస్తావంటే నువ్వేం చేస్తావ్.....

నీకు డబ్బు యావంటే నీకు అని........

“నీకు దమ్మిడీ ఇవ్వను ఫో.....”

మనం మాత్రం తక్కువా?

తొడగొట్టా....." ఇప్పటికి పది...పదంటే పదేళ్లలో డబ్బు సంపాదించి....నిన్ను నీ అస్తినీ....ఇదో ఈ వీధి వీధిని కొని చూపిస్తా చూసుకో నా తడాకా"

ప్రతిజ్ఞ....చేసేసా......

అదుగో ఆ ప్రతిజ్ఞ ఇంకా తీరలేదు.....

ఇన్నేళ్లలో ఆస్తి విలువలు రకరకాలుగా పెరిగిపోయినా.....

వీధి వీధినీ కొనేయడానకి నేను సిద్ధంగా వున్నా...

అమ్మేదెవరూ?

చేసిన ప్రతిజ్ఞ చేసినట్టుగానే మిగిలిపోయింది....నాలోపలి అహంకారము అట్లాగే మిగిలి వూరుకుంది....

❊ ❊ ❊

గతాన్ని తవ్వి పోసుకోవడం వల్ల ఖేదం కలిగిందే తప్ప ఒరిగిందేమీ లేదు...

గ్లాసు పగల గొట్టా...నేను పగలగొట్టానా! వాళ్లు ముగ్గురూ కలిసి నాతో గ్లాసు పగలగొట్టించారా.....

రెండోదే రైటు....

అవతలి గదిలోంచి అరకొరగా మాటలు వినబడుతున్నాయి.

ముగ్గురు సభ్యుల కమిటీ

ముగ్గురు దొంగల ముఠా

ముఠా మేస్త్రీ ముసిలిముండ....కామాక్షమ్మ.....రిటైర్డ్ నర్సింగ్ సూపర్‌వైజర్, సభ్యులు....పచ్చలకుదురు శ్యామల ఎమ్మే లెక్చరర్.... పచ్చల కుదురు రాజారావు ప్రాస్పెక్టివ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీయర్...

ఆహా ఏమి కవచాలండీ ఈ దొంగలవి.....

అవునూ దొంగలకు కవచాలేమిటి? ముసుగులు ముసుగులు....

"వెళ్లు వెళ్లు" గుసగుసలుగ అంటోంది మా అత్త ఆడశకుని....తలుపు తెరిచినప్పుడు....

ముఠా సభ్యురాలు పచ్చలకుదురు శ్యామలెమ్మే అలియాస్ మై వైఫ్ లోపలి కడుగు పెట్టీ పెట్టకనే 'కుయ్యో' మంది...

థ్యాంక్యూ బ్రోకెన్ గ్లాస్ పీస్...నీకు శతకోటి వందనములు...

గదిలో ట్యూబ్‌లైట్ వెలిగింది.....

నా భార్య  మళ్లీ లోపలికెళ్లి చీపురూ తడి బట్టా తీసుకువచ్చి.... పగిలిన గాజుగ్లాసు ముక్కల్ని జాగ్రత్తగా ఏరి తీసేసి తుడిచేసింది......

మళ్లీ నా భోజనం తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టి వెళ్తూ వెళ్తూ "మీరు వూరికే ఎగ్జైట్ అవుతున్నారు గానీ నేను చెప్పేది కాస్త ప్రశాంతంగా ఆలోచించండి. మీకు ఏభై దాటాయి, నాకు ఏభై వస్తున్నాయి....మీకా వింత కాళ్లనెప్పి దాపురించింది... నాకు బీపీ, షుగరూ చుట్టుకున్నాయి... వున్న ఒక్క నలుసువాడు.....డబ్బుకు అంతేముంది చెప్పండి, మన భాగానికొచ్చే డబ్బు కనీసం ఏడెనిమిది లక్షలుంటుంది కదా... అది వాడి యు.ఎస్.
స్టడీస్‌కి సరిపోతుంది....

ఇంటి గురించి మీరూ, నేను అస్సలు పట్టించుకోవటంలేదు... మీకు క్యాంపులూ, నాకు కాలేజీ....అమ్మ లేకపోతే మనకు దిక్కెవరు భారం కాదు.... అమ్మ కూడా మన బాగుకోసమే కదా తాపత్రయపడ్తోంది...అదీ కాక మీరీ మధ్య తాగడం ఎక్కువైపోయింది .... మనం ప్రశాంతంగా కూచుని మాట్లాడ్డం...కలిసి భోజనం చెయ్యడం చేసి ఎన్నేళ్లైంది చెప్పండి...." అంటూ ఏడవడం మొదలు పెట్టింది....

నాకు జాలి కలగడం లేదు....

ఇదే వ్యక్తి ఓ అరగంట ముందు ఇందుకు పూర్తిగా భిన్నమైన రూపంలో వుండింది...

రంగులు మార్చే ఊసరవెల్లి...

'వెళ్లు వెళ్లు' అని గుసగుసలుగా మా అత్త దీన్ని సాగనంపడం నాకు తెలీదనుకుంటోంది వెర్రిది... మెత్తగా మాట్లాడితే లొంగుతాననుకుంటోంది....

జాన్తానై హమ్మా....!

ఊరుకుంటే ఇంకో అరగంట వాయించేస్తుంది.....

"లెట్మి ఎలోన్" అన్నా.....

చీర చెంగులోకి చిర్రున చీదింది...

వేసుకున్న రంగు వెలిసి చింపిరిగా రేగిన తలా.... ఎత్తుముక్కు....హై చీక్ బోన్స్... నా వల్ల కాదు వెలిసిపోయిన ఈ బొమ్మను చూట్టం.........

"అయ్ వాంటుబీ లెఫ్ట్ ఎలోన్" దొహరాయించా......

ఇక వీలు కాదన్నట్టు లేచెళ్లిపోయింది.....

❊ ❊ ❊

ట్యూబ్ లైట్ ఆఫ్ చేసా.....

కాంతి హీనతలో శాంతి....

డెక్‌లోకి పన్నాలాల్ ఘోష్ తన బాసురీతో దూరిపోయాడు....

మియాకి మల్హార్ పరిమళాల్ని చీకటి గదినిండా నింపుతున్నాడు....

కోతల గాయాల అలంకరింపుతో గాజుగ్లాసు....

నా లోపలి కోతల వ్యధల గాయాలకు మల్హామ్ పూతగా కాదంబరి....

కాళ్లు ఎత్తి టీపాయ్ మీద పెట్టుకున్నా....

కాళ్లు చూపించుకోవాలి...సత్తార్ ఈ రకం నెప్పులకి మంచి హోమియో మందుందని చెప్పాడు...

సత్తార్ రేపుదయమే ప్రత్యక్షమవుతాడు....ఫైనల్ పేమెంటీరోజే కదా జరిగింది.... ఎనభై అరు లక్షలు.....నాకు దాంట్లో పర్సెంటేజ్...

దొంగ డబ్బు......

డబ్బెందుకు దొంగదౌతుందీ.....

నేన్దొంగని.....గెజిటెడ్ దొంగని...దొరకని దొంగని .....దొరికితే! ఆరండ్‌బీ ఈ ఈ ఇంటిపై ఏసీబీ దాడి లెక్కల్లో లేని నగదు నగలూ భారీ ఎత్తున స్వాధీనం...... బినామీ పేర్లపై నున్న స్థిరాస్తుల పత్రాలు ఛఛలేదులే ఏసీబీ ఇన్స్పెక్టరు మానోడే కదా....

పన్నాలాల్ ఘోష వినిపించడం మానేసింది....

రాజిగాడు నన్నెంత మాటన్నాడూ?

బా.......స్ట..........ర్డ్.........

నేను మా అబ్బనన్లే...పచ్చులకుదురు ఈశ్వరయ్యని పట్టుకుని ముండా కొడకా అన్లే... ఆ ముండా కొడుకు కొడుకుని వాడి కొడుకు ముండా కొడకా అన్నాడు భలేభలే....

ఆడియో డెక్‌మీద చేత్తోకొట్టా...ఊహూఁ....కెసెట్ ఓపెన్‌చేసా ఎలక్ట్రో మాగ్నెటిక్ పన్నాలాల్ ఘోష్ ముళ్లు ముళ్లుగా చిక్కుపడి పడిపోయాడు....

చిక్కుపడిపోయిన వేణుగానాన్ని వేళ్లతోపట్టి సాగదీసి బైటికి లాగా....

హమ్మయ్య మళ్లీ వేలితో కెసెట్ చుట్టి డెక్‌లోపెట్టి 'ఊదు పన్నాలాల్' అన్నా...

గదినిండా వేణుగాన పరిమళం....

నరాల్లోకి పాకుతున్న మత్తు......

చిన్నగా కమ్ముతున్న మగత....

తెలుస్తోంది రకరకాల హిప్నగాజిక్ చిత్రాలు కదులుతున్నాయి. ఒకదాని తర్వాతింకోటి... ఒకటి ఇంకోదానిలా మారుతూ.....

రకరకాల ముఖాలు....

నిన్న ఈశ్వరయ్య మొహం రాజిగాడి మొహంలా అయ్యింది... అత్త కామాక్షి.... సత్తార్... హేపీవైన్స్ బోర్డ్.....నీలం రంగు కారు....తెగిన రేలింగ్....సినిమా పోస్టర్... మెట్లు... గోడౌన్..... పీయే... చెక్కులు ....కాంక్రీట్ మిక్సర్....

వేళ్ల మధ్య సిగరెట్ చుర్రమని కాలింది....

పన్నాలాల్ అయిపోయాడు...తల దిమ్ముగా వుంది... టేబిల్‌మీద చల్లారిన భోజనం... రెండు ముద్దలు తిని పక్కమీద వాలిపోయా......

* * *

రాత్రి వూహించినట్టుగానే కాంట్రాక్టర్ సత్తార్ ఉదయాన్నే వచ్చాడు...బైట రాజిగాడితో మాట్లాడుతున్నాడు....మా ఆవిడ కాలేజీకి వెళ్లే హడావుడిలో వుంటుంది...ఇదేం పాఠాలు చెప్పేడుస్తుందో.....ఇంట్లో ఏనాడూ ఓ పుస్తకం పట్టుకుంది చూళ్లేదు....ఇంగ్లీషు మాత్రం బాగా మాట్లాడుతుంది...

ముసలి మంత్రగత్తె సత్తార్ వేసిన జోక్ విని పెద్దగా నువ్వుతోంది....దొంగముండ ఏం యాక్టరో నూటపదహారు ఆస్కర్లివచ్చు దీని యాక్టింగ్ క్యాపబిలిటీస్‌కి.

"టిఫిన్ చెయ్యి నాయినా" సత్తార్నడగుతోంది.....

"సార్ వచ్చింతర్వాత చేస్తానమ్మా" వినయంగా అంటున్నాడు సత్తార్.....

"నాయినా రాజయ్యా డ్యాడీకి సత్తారంకుల్ వచ్చాడని చెప్పయ్యా" ము.మం.

వాడు నా గది తలుపు దగ్గరికొచ్చి

"డ్యాడీ సత్తారంకుల్ వచ్చారూ" అని గట్టిగా అరిచాడు...

ఆహా ౘడ్యా......డీ.....ఈ ఈ.....ఈ..ఇ

రాత్రేమో బా....స్ట.....ర్డ్.....బైటి జనాల ముందు డ్యా....డీ

భలే.....బాస్టర్డ్.....లంజకొడుకు..... డ్యాడీ.....

లంజ + డ్యాడీ = లండీ

లండీ కొడుకు....వహ్వా....

దొంగలండీ దొంగలు....

మనశ్శాంతుల్నీ ...జీవితాల్నీ...ఆనందాల్నీ...సుఖాల్నీ దోచే ముసుగు దొంగలు....

దొంగలు బాబోయ్ దొంగలు....

బైటికొచ్చా

"గుడ్మార్నింగ్ సర్' సత్తార్.....

"మానింగ్ రండి టిఫిన్చేస్తూ మాట్లాడుకుందాం"

మాటలేముంటాయీ వాడు తెచ్చిన బ్యాగు డైనింగ్ టేబిల్ మీద పెట్టి టిఫిన్చేసి చాలా సులభంగా బ్యాగును టేబిల్మీద మరిచిపోయి వెళ్లిపోతాడు.....

నా అవినీతి ఇంకొంచెం పెరుగుతుంది....

ముసల్దాని డేగ చూపు సత్తార్ చేతిలోని బ్యాగ్మీదే వుండటం

గమనించా దీనికింకా యెందుకు డబ్బు....!

యావ అంతే.....

మూడు దోసెలు తిని సత్తార్ టేబిల్మీద లంచం మరిచి పోయాడు. సత్తార్ మాయమైన మరుక్షణం మంత్రగత్తె ప్రత్యక్షం, ఆ బ్యాగుమీద దాని చెయ్యిపడీపడకనే నేను తీసేసా....

ఆ ముసలి మొహంలో తీవ్రమైన నిరాశ....

హహ్హహా ఛావు అనుకుని గదిలో కొచ్చి బోల్ట్ వేసుకున్నా...

బ్యాగును మంచానికున్న సీక్రెట్ రీసెస్కి తోసేసా....

మళ్లీ బైటికొచ్చేసరికి పియ్యే బాలసుబ్రహ్మణ్యం వున్నాడు.

పద అని బైటికొచ్చేసరికి మా ఆవిడ ప్రత్యేక్షం.

"బాబు ఎటోవెళ్లిపోయాడు డ్రాప్మీ ఎట్మైకాలేజ్" అని దర్పంగా కారెక్కి కూచుంది.

బాలసుబ్రహ్మణ్యం భయంగా భక్తిగా వెనకసీట్లో పెట్టిన ఫైళ్ల దస్తాను ముందుసీట్లోకి మార్చాడు....

రియర్ వ్యూ మిర్రర్లోంచీ నా పెళ్లాన్ని చూసా......

చాలా జాగ్రత్తగా మేకప్ అయ్యింది....

ముడుతలుపడ్డ పాలిథీన్ కవర్లో ప్యాక్చేసిన మాంసంలా వుంది....

నా ఉత్ప్రేక్షకు నాకే నవ్వొచ్చింది....

అద్దం కొద్దిగా తిప్పి నన్ను నేను చూసుకున్నా....

హారర్ సినిమాల్లో బూడిద రంగు శవంలా అనిపించింది....

నా బొమ్మేనా అది పక్కన సుబ్బిగాడిది కాదు... నా శవం బొమ్మే అది...యస్ అయ్యాం లుకింగ్ కెడావరస్....

శవాన్ని కాక నేనేమిటి?

నేనింకా జీవించే వున్నానా?

వున్నా ఎక్కడో మిణుకుతోంది జీవం.... ఏదో పాతాళపు మూలల్లో నేను జీవించి వుండగా పాతిపెట్టబడిన శవాన్ని......

యస్ అయాం బరీడ్ అలైవ్

* * *

సీట్లో కూచున్న పదిహేన్నిముషాలకి భార్గవ ఫోన్ "అరేయ్ అన్నయ్యా నాన్న సీరియస్....ఇక రోజులే" అని

"రమ్మంటావా?" అడిగా

"మరి? వచ్చెళ్తే బావుంటుంది" అన్నాడు వాడు

"సరే మధ్యాహ్నం భోజనం చేసుకొని బయల్దేర్తా"

"వదిన్నీ, రాజుగాడినీ తీసుకువస్తే బావుంటుంది....మనకోసం కాకపోయినా చూసేవాళ్లకి బావుండదు, ఆలోచించు" అన్నాడు భార్గవ...

"మరి మా అత్త వద్దా" వికటంగా అడిగా...

ఫెళ్లున నవ్వాడు వాడు...నవ్వి

"ఆహా ఆ మహా తల్లిని కూడా తీసుకురా..ఇక్కడో కళింగయుద్ధం చేసి వస్తుంది." అన్నాడు...

ఒక్కరు ఒక్కరంటే ఒక్కరు ఈ ముసిలి ముండని ఇష్టపడరెందుకూ....

ఆఖరికి పక్కింటి వాళ్లుకూడా....

తల్లీ కుతురూ మనమడూ అదో లోకం అంతే....

"సరేసరే ఇంటికెళ్లి ఆలోచించి వాళ్లనడిగి చెప్తా.... ఎలాగైనా నేను ఈ మధ్యాహ్నం బయల్దేరతా" అని ఫోన్ పెట్టేసా....

బెల్ నొక్కగానే పియ్యే బాలసుబ్రహ్మణం వచ్చాడు..బాల సుబ్రహ్మణ్యం....

వయస్సెంతో కనుక్కోవడం చాలా కష్టం....తలకు రంగేసి నున్నగా దువ్వుతాడు, లావుపాటి అద్దాల్లోంచి మిడిగుడ్లతో చూస్తూంటాడు.. పొడుగ్గా సాగిన ముక్కు కింద నున్నగా గోకిన మూతి, చెవులు దొన్నెల్లావుంటాయి. సన్నగా గెడకర్రలా వుంటాడు... 'ఎస్సార్.... 'అవున్సార్...' 'ఇది దాంతాలుకు సార్' దీన్లో యింకా యింత రావాల్సర్...' 'ఫైల్స్ ఇంటికి తెమ్మంటారా సర్..' లాంటి పొడిపొడి మాటల్తప్ప దీర్ఘ సంభాషణలు చేయడు... పది నిముషాలకోమాటు సిగరెట్టు కాలుస్తాడు...వారానికి ఏడు రోజులూ పన్చేస్తాడు...రాత్రి ఒంటిగంటకి పిల్చినా అయిదు నిముషాల్లో వచ్చేస్తాడు.

ఎప్పుడూ తెల్ల చొక్కాని, తెల్ల ప్యాంట్లోకీ టక్‌చేసి బ్రౌన్ కలరు బెల్టు బిగించి ఇటుక రంగు కాన్వాస్ బూట్లేసుకుని వుంటాడు. నీలంకోటు తగిలిస్తే స్టేషన్ మాస్టరను కుంటారు జనాలు.....కాలేజి ముందు నిల్చుంటే పీఈటీ మాస్టరనుకుంటారు జనాలు.... హాస్పిటల్ ముందు నించుంటే కాంపౌండరనుకుంటారు.

"ఎస్సర్" అని కాస్తగట్టిగానే అన్నాడు

"కాలేజ్‌కి ఫోన్చేసి మ్యాడంను కాస్త కాంటాక్ట్ చెయ్యి" అన్నా...

ఓ మూడు నాలుగు నిముషాల్తర్వాత ఫోన్నాచేతికిచ్చాడు

"హేలో చెప్పండి" మా ఆవిడ ఆశ్చర్యం బాగా తెలుస్తోంది గొంతులో, నేను మామూలుగా మాటలే మాట్లాడనూ అదీ కాలేజికి ఫోన్చేసి మాట్లాడ్డమంటే ఆశ్చర్యపడదూ....

"మా నాన్నకు సీరియస్సట భార్గవ ఫోన్చేసాడు మధ్యాహ్నం బయల్దేరాలి" అని పెట్టేసా..... ఇంకా ఏమో మాట్లాడబోతోంది తను....

ఇప్పుడే ఇంటికెళ్లిపోతుంది... మా ముసలోడు డింగుమంటే ఆస్తి? ఇంటికెళ్లి ఆ ముసల్దాన్తో మంతనాలు చేయాలిగా...

అక్కడ ఏం మాట్లాడాలి, ఎట్లా మాట్టాడాలి అన్ని డైలాగులూ రాసుకుని బట్టీపట్టి, ఓ డ్రెస్ రిహార్సలు చేసుకుని మరీ బయల్దేరాలిగా...వెళ్తుందెళ్తుంది....ఇప్పటికే ఇంటిదార్లో వుంటుంది.

ముసల్దానికిది మంచి ఛాన్స్...టింగుమని అదీ బయల్దేరుతుంది ఖచ్చితంగా, ఆఫీస్ డ్రైవర్ని యింటికి రుమ్మన్చెప్పి ఇంటికెళ్లా.....

నే వూహించినట్టుగానే ముసల్ది తయారైకూచునుంది.... అక్కడ ఏం మంట పెడుతుందో.... ఏమ్మంటేమిటి అది పెట్టేమంట ఒకటే డబ్బు...డబ్బు....డబ్బు...నా

పెళ్లాన్ని పక్కకి పిలిచి చెప్పా...”  మీ అమ్మెందుకూ... నువ్వు నేనూ రాజుగాడు వెళ్లొద్దాం” అని

“వియ్యపురాలు రాకపోతే ఏంబావుంటుందీ....బాబు రావట్లేదు....” ఖరాఖండిగా మా అమ్మవచ్చి తీరుతుంది

అన్చెప్పేసింది..మైవైఫ్....నా భార్య మా ఆవిడ.....

వెనకనించీ జాడించి తన్నాలనిపించింది...చాలా కష్టమ్మీద నిగ్రహించుకున్నా...

ఎందుకో ఇప్పటి వరకూ ఈ ఆడపిశాచాన్ని చెయ్యెత్తి కొట్టలేదు... కొట్టివుంటే... ఎప్పుడో తెగుండేదేమో....నిజంగా చాలా పొరపాటు చేసానేమో....ఈ బంధాల్ని ఎప్పుడో తెంపుకొనుంటే ఈ జీవితం యింత ఘోరంగా వుండేది కాదేమో!

ఏమో!

“సర్సర్లే అక్కడ గొడవలు జరిగితే నేనూరుకోను...ఇప్పుడే చెబుతున్నా...మీ అమ్మ నోరు జాగ్రత్త....నువ్వుకూడా” వార్నింగిచ్చానని తృప్తిపడ్డా....నాకు తెలీదా అక్కడ ఖచ్చితంగా గొడవ జరిగి తీరుతుంది...

కం వాట్ మే....

రేపటి గురించి ఆలోచించేవాడికి మనశ్శాంతి శూన్యం... యస్... అనుకుని నా గదిలో కెళ్లి తలుపేసుకున్నా... సాయంకాలం నాలుగూ నాలుగున్నరకి బయల్దేరితే చాలు తొమ్మిదికంతా చేరుకుంటాం.. మళ్ళీ తలుపు తెరిచి... మా ఆవిణ్ణి పిలిచా... పిలిచి చెప్పా....

“బాషా వస్తాడు...మా ఆఫీస్ డ్రైవర్...సాయంకాలం నాలుగూ నాలుగున్నరకే బయల్దేరదాం...నాకు భోజనం గదిలోకి తెచ్చి పెట్టు”

“ఏం మళ్లీ తాగుతారా? అక్కడకెళ్లింతర్వాత ఎట్లాగూ మీ తమ్ముడితో కలిసి తాగుతారు కదా... అయినా... పగ....” మొదలుపెట్టింది...

“భోజనం తెచ్చిపెట్టు” అని తలుపు వేసేసా....

ఈ గది లేకపోతే నేనేమయ్యే వాణ్ణి....

ఎంత ఆదరం ఈ గదికి నేనంటే...

ఇదుగో ఈ కిటికీకి నాకు ఎంతస్నేహం.... ఎంత అద్భుత దృశ్యాలను చూపుతుందిదీ!

రోజుకో అద్భుత సాంధ్య చిత్రాన్ని కొన్నేళ్లుగా దర్శింపజేస్తోంది.....

అయ్ లవ్యూ మై డియర్ కిటికీ...

ఫోన్రింగై కట్టైంది....

అంతే బైట ఎత్తారెవరో...లాంగ్‌రింగ్.....ఎస్టీడీ మా ముసలోడు డింగ్‌మన్నాడా?

తలుపుమీద చప్పుడు...యస్ భార్గవగాడే అయ్యుంటాడు... తలుపు తీయకుండా కార్డ్‌లెస్ తీసా...భార్గవే....

“వరేయ్ అన్నయ్యా! ఈ రోజే బయల్దేరు నాన్న పరిస్థితి అస్సలు బాగాలేదు. నువ్వు నిర్లక్ష్యం చేస్తావేమోనని మళ్లీ ఫోన్చేస్తున్నా” అన్నాడు...

“లేదురా రాత్రికక్కడుంటా...” అని కాస్సేపాగా...మా ముసల్ది బైట ఫోన్నించే వింటోంది... తెలిసిపోయింది... సరే ముసలీ విను అని వికటంగా అనుకుని “వరేయ్ భార్గవ! ఈ ముసల్దికూడా వస్తోంది బీవేరాఫ్ దట్ విచ్” అని గట్టిగా నవ్వా...

వాడు నవ్వి....“ఇక్కడ పోట్లాటకు సిద్ధపడే వాళ్లెవ్వర్రా” అన్నాడు...

ముసల్దాని మొహం ఎలా వుంటుందా అని ఆలోచిస్తున్నా.....

“సరే లేరా నేను తొమ్మిదీ తొమ్మిందిన్నరా ప్రాంతానికి చేరుకుంటా...అన్నీ సిద్ధం చెయ్” అని పెట్టేసా...

ముసిలి మంత్రగత్తె మొహం కందిపోయుంటుంది ...ఛావనీ......

నా మడత కుర్చీలో పడిపోయి కాళ్లు చాచి టీపాయమీద పెట్టుకున్నా తీవ్రమైన బాధ పిక్కల్లో....

చూపించుకోవాలి చూపించుకోవాలి... ఉమానాథ్‌కి...వెళ్తే సిగరెట్లూ మందూ మానెయ్ ముందు” అంటాడు... అది నా వల్ల కాదు...సరే....సిగరేట్ వెలిగించి...గెంతి గ్లాసులోకి దూకి ఆత్మహత్య

చేసుకున్నా.......

భార్గవ మొహం ప్రత్యక్షమైంది.....నల్లటి చీకటిగాల్లో....

ఏం కావాలనుకున్నాడు వాడు? ఆఖరికి ఏమయ్యాడు.... ప్రొఫెషనల్ ఆర్టిస్ట్ కావాలనుకున్నాడు...ఇప్పుడు ఓ డిపార్ట్‌మెంటల్ స్టోరు నడుపుకుంటున్నాడు. వాడి ప్రవత్తి ఏమిటి? ఎంత సుకుమారం వాడి మనసు? చివరాఖరికి కొనుగోళ్లూ అమ్మకాలూ...కూడికలూ తీసివేతలూ....ఇవా వాడికి మిగిలేది? ఎందుకీ వైరుధ్యం?

వాడికిద్దరూ ఆడపిల్లలే....అక్కడికెళ్ళింతర్వాత ఏం చేయాలో ఓ నిర్ణయాని కొచ్చేసా....

పకడ్బందీగా అమలు చేయాలి ఆప్లాను...భార్గవగాడి గొంతుబట్టి ముసలాడు ఢాం అష్టం ఖాయం...సో...చేయాల్సింది చేసేస్తా...నిర్ణయానికొచ్చేసా.....

☼ ☼ ☼

నా తండ్రిని చూడగానే తెలిసిపోయింది యిక గంటల్లోనే అని... మాట పడిపోయింది... మనిషి పూర్తిగా మంచానికంటుకునున్నాడు. ఆ కళ్లల్లో నన్ను చూసిన గుర్తింపు కనబడింది.....

భార్గవ దగ్గరగా వెళ్లి..."నాన్నా....పెద్దాడొచ్చాడు చూడు" అని గట్టిగా అన్నాడు... పెదవులు కదుల్తున్నా ఏ శబ్దమూ రావట్లేదు.... అహంకారం...ఆ కోపం....ఆ అరూపూ.... ఆ చిందులు ఎక్కడికెళ్లాయి...మృత్యువు ముందు మన గుణాల్ని పీల్చేస్తుందేమో! అవును...అవును. అవునవును ముందు మన చుట్టూ వున్న వాతావరణాన్నీ ...దాం తర్వాత మన నైజాన్నీ పీల్చి...తర్వాత పిప్పిలా మిగిలివున్న మనల్ని కూడా మింగేస్తుంది...

నా తండ్రి పిప్పి మాత్రమే వుంది మంచంమీద....

ఇంట్లో అందరూ బహిరంగంగా ఆ క్షణం కోసం కాచుక్కూచున్నారు....

ఎవ్వరూ దాన్ని దాచే ప్రయత్నం చేయట్లేదు...

ముసలి మంత్రగత్తె....ముందు మా పిన్నిని ఓదార్చుదాని కెళ్లింది...ఓ మరణానికి సిద్ధపడిన వ్యక్తుల్ని ఏం ఓదారుస్తారో వీళ్లు....

ఇంట్లో రెండుమూడు అపరిచిత ముఖాలు కనబడ్డాయి ఇంటితో సంబంధాలు తెగిపోయిన నాకు కొత్తగా ఏర్పడ్డ సంబంధ బాంధవ్యాలు ఎలా తెలుస్తాయి.....

ము.మం. వచ్చి నాన్న మంచమ్మీద కూచుని

"అన్నగారూ.....నేనూ కామాక్షమ్మని....గుర్తు పట్టారా?" అనడుగుతోంది. నా పెళ్లాం నిశ్శబ్దంగా వచ్చి నాన్న కాళ్లకి దండం పెట్టి పక్కననించుంది....

ఆహా! ఏమి డ్రామాలండీ వీళ్లవి.....

ముసల్ది నాన్న పక్కన చేరగానే భార్గవ పక్కకొచ్చేసాడు...

నన్ను పక్కకు రమ్మని సైగ చేసాడు...నేనూ అక్కడినించీ కదిలా.......

"డాబా మీద కూచుందాం...ఇప్పటికే పదకొండున్నరైంది..... ఉదయానికి

నాన్న వుంటాడని నమ్మకం లేదు.... మనం సిద్ధపడాలి" అన్నాడు భార్గవ...డాబా మీద టీపాయి కుర్చీలూ మందూమాకులూ అన్నీ సిద్ధం చేసున్నాయి. పారాపెట్‌కు అనుకుని ఓ యువకుడు నుంచునున్నాడు.....

"నా దగ్గర పన్చేస్తాడు" అడక్కుండానే చెప్పాడు భార్గవ.... మళ్లీ "వెంకట్' అని పిలిచాడాయువకుడిని....

"సార్" అని వినయంగా వచ్చాడా అబ్బాయి...

"ఏం తెచ్చావ్" అడిగాడు భార్గవ....

"డ్రై చికెన్ రెండు.... తెచ్చాసార్...మీల్స్ ఓ క్యారియర్... సార్‌కు బిర్యాని కర్డ్‌రైస్ తెచ్చా సార్"

పాపం వాడు తినకున్నా నా కోసం అన్నీ తెప్పించాడు భార్గవ....

"థ్యాంక్స్‌రా భార్గవ!" మనస్ఫూర్తిగా అన్నా....

వాడు పట్టించుకోకుండా..."వెంకట్! నువ్విక్కడే పడుకో....అవసరం రావచ్చు" అని గ్లాసులు నింపాడు....

ఆ కుర్రాడు మాకు దూరంగా వెళ్లి ఓ మడత మంచం వాల్చుకుని దాని మీద పడుకున్నాడు..

సరే నా నిర్ణయం భార్గవకి చెప్పేయాలి. మళ్లీ ఈ ఏకాంతం దొరక్కపోవచ్చు....

"భార్గవా నా భాగానికెంత వస్తుందిరా ఆస్తి?" అడిగా

"అన్నయ్యా!" వాడి గొంతులో ఆశ్చర్యం ఆవేదన....

"చెప్పు" మళ్లీ అడిగా

"నీ ఇష్టమొచ్చినట్టుగా నువ్వే డివైడ్ చెయ్యరా నా కెలాంటి అభ్యంతరమూ లేదు... చెల్లెళ్లు, అక్కయ్యా మనల్ని ఏమీ అడగరు... నీకు నాకు మధ్య నేను భాగాలు పెట్టలేన్రా" వాడి గొంతులో తడి తెల్సిపోతోంది...

"ఛ ఛ నువ్వు నన్నపార్థం చేసుకుంటున్నావురా భార్గవా... నా ఉద్దేశ్యం నా భాగం నేను కావాల్సినంత సంపాదించాను... యింకా సంపాదిస్తాను కూడా.... నా దిగులు నీ గురించే... నేననడమేమిటంటే... ఆ భూమికి విలువ పెరిగేదేం లేదు...

ఊళ్లో పాత ఆ దరిద్రపు కొంప ఉండీ లేనట్టే అది అమ్మేద్దాం....పిన్నికి ఓ భాగమిచ్చేదాం.... మిగిలిన భాగంలో ఆడ పిల్లలికి కొద్దిగా ఇచ్చి మిగిలింది నీ కూతుళ్లిద్దరి పేరా వేసేద్దాం అని" భార్గవ తల అడ్డంగా ఆడించాడు......

"వద్దురా అన్నయ్యా....ఇంట్లో మళ్లీ వదినా మీ అత్తా కలిసి గొడవ పెడతారు... నా స్టోర్స్ బాగానే నడుస్తోంది.....పెద్దది ఎమ్మెస్సీ చేస్తోంది, చిన్నది మెడిసిన్ లో చేరింది...వాళ్ల చదువులూ, పెళ్లిళ్లు నాకేం ఇబ్బంది కాదు...ఇక పిన్ని అంటావా? ఈ యింటికి అమ్మ తర్వాత వచ్చింది ఏడిచో మొత్తుకునో మనందరికీ చాకిరీ చేసింది...మూడోదాన్ని మనమెప్పుడూ సవితి చెల్లిగా చూళ్లేదు....పిన్ని వున్నంత కాలం నా దగ్గరే వుంటుంది...పిన్నికి నేనెలాంటి లోటు రానివ్వను...వద్దు...నీ భాగం నువ్వు తీసుకో....అదే మేలు అందరికీ" అన్నాడు భార్గవ....

వీడికెలా చెప్పాలి....వీడు చెప్పినట్టు నా భాగం నేను తీసుకుంటే ఇంట్లో నా భార్యా కొడుకూ ఆ ముసల్దీ గెల్చినట్టవుతుంది....ఆ దుష్టత్రయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ నేనా అవకాశమివ్వను...అదీకాక నేను నా తండ్రితో చేసిన ప్రతిజ్ఞ అనుక్షణం నన్ను వెంటాడ్తోంది...ఆ ప్రతిజ్ఞ నా ప్రస్తుత జీవిత నరకానికి కారణమైంది....

నేనా ప్రతిజ్ఞ చేయబట్టే కదా...ఈ ముసల్దానికి బలైపోయాను...

వేడి మీద అజ్ఞానంతో వున్న నాకు డబ్బుసాయం చేసినట్టే చేసి కూతుర్ని నాకు కట్టబెట్టి....వద్దు వద్దు.....

"భార్గవా...నీకు చాలా చెప్పాలి కానీ ఆస్తి మాత్రం నేను చెప్పినట్టే భాగాలు కావాలి...ఎవ్వరికీ తెలీకుండా అమ్మకానికి పెట్టు...చాలా సీక్రెట్‌గా జరగాలి.." అన్నాను...

"వచ్చారు రెడీగా వున్నారు నువ్వెలాగూ వస్తావని వాళ్లకి కబురుపెట్టాను. మొత్తం ఇరవై ఆరుకి సెటిల్ కూడా చేసాను... కానీ?" అన్నాడు భార్గవ

"ఇంకేం చెప్పకు....నే చెప్పినట్టు చెయ్యి.....తర్వాత మాట్లాడదాం...మిగిలిన విషయాలు...వాళ్లని ఇంటి దగ్గరికి పిలవకు బైట ఏదైనా హోటల్ గది చూడు అక్కడ మాట్లాడుకుందాం... ఎవ్వరికి తెలీనివ్వకు అంతే" భోజనాల తర్వాత భార్గవ డాబా మీదే వేయించిన పక్కలమీద పడుకున్నాం...భార్గవ క్షణాల్లో నిద్రలోకి జారుకున్నాడు... నాకు నిద్రపట్టదు..మెల్లిగా లేచి నుంచున్నా...కాళ్లపిక్కలు..తీవ్రంగా నెప్పి....బాధ....

అట్లాగే మెల్లిగా కిందికి దిగా... నాన్న గదిలో ఎవ్వరూ లేరు చిన్నది లక్ష్మి తప్ప...అదికూడా కూచుని కుర్చీలో జోగుతోంది...నే వెళ్లిన చప్పుడుకి ఉలిక్కిపడి లేచింది... "అన్నయ్యా!" అంది....

"నువ్వెళ్లు నే కూచుంటా...వెళ్లి నడుం వాల్చు" ఆప్యాయంగా అన్నా....అది తలూపి వెళ్లిపోయింది....

నేవెళ్లి లక్ష్మిఖాళీ చేసిన కుర్చీలో కూచున్నా... నాన్న వేపుచూసా....ఆశ్చర్యం కళ్లు తెరిచేవున్నాయి... మేలుకునే వున్నాడాయన....

పచ్చలకుదురు ఈశ్వరయ్య ఆయన పెద్ద కొడుకైన నేనూ వీధినపడి తిట్టుకుని అరిచి వీరంగాలు చేసి శపథాలు చేసి శాపాలు పెట్టుకున్న ఆ దృశ్యం యింకా నా గుండెల్లో పచ్చిగా వుంది.

ఆయన వేపు చూసా....

ఆ కళ్లు నన్నే చూస్తున్నాయి....

"నాన్నా! డబ్బు.... డబ్బా సంపాదించా నాన్నా .... లక్షలు లక్షలు సంపాదించా తెలుసా దాదాపు కోటి రూపాయలు సంపాదించా" వంగి చెవిదగ్గర చెప్పా.....

ఆయన పెదవులు కదుల్తున్నాయి శబ్దం రావడంలేదు... తలూపాడు....

"కానీ కొందామంటే ఈ వీధిని నాకమ్మేవాళ్లు ఎవ్వరూ లేరు నాన్నా!"

మళ్లీ అన్నా.....

అదే నిశ్శబ్దంగా పెదవుల కదలికా.... తలూపాడు మళ్లీ....

"నేనోడిపోలేదు నాన్నా...ఎందుకంటే నీ ఆస్తిని నే తీసుకోడం లేదు తెలుసా?" మళ్లీ అన్నా....

ఈ సారి పెదవులు కదల్లేదు తలూపలేదు....

ఆ గాజు కళ్లలోంచీ కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి...

ఇప్పుడు ఆయనేం అనుకుంటున్నాడో నాకు తెలియాల్సినవసరం లేదు...

నే చెప్పాలనుకున్నది ఆయన విన్నాడంతే నాక్కావల్సింది అదే......

ఎవ్వరినీ లెక్కచేయక అహంకారంతో బతికిన ఈయన యిట్లా అసహాయంగా ... చెప్పాలనుకున్నది చెప్పలేక.....

మలమూత్రాలకు కూడా ఇంకొకళ్ళ మీద ఆధారపడ్తూ దీనంగా పడివుండడం బాగాలేదు.... మళ్లీ దగ్గరిగా వంగి......

"నాన్నా ....చచ్చిపో నాన్నా! ఇట్లా దీనంగా దయనీయంగా వద్దు వద్దు చచ్చిపో నాన్నా! ప్లీజ్ స్టాప్ బ్రీథింగ్....ఫర్వా వెన్స్‌సేకడై మై ఫాదర్ డై" అన్నాను....

వప్పుకున్నట్టుగా.... ఆయన కళ్లు నిశ్చలమైనాయి....ఊపిరి ఆగిపోయింది.... కళ్లు చేత్తోమూసి.....

"థ్యాంక్యూ వోల్డ్ మ్యాన్....." అని లేచి.... అతికష్టమ్మీద పైకెళ్లి భార్గవని లేపా.....

నన్ను చూడగానే అర్థంచేసుకున్నాడు వాడు...నిశ్శబ్దంగా ఇంట్లో అందరూ ఒక్కొక్కరూ ఆయన మంచం చుట్టూ చేరారు....

* * *

ఉదయాన్నే నా భార్య నా సుపుత్రుడికి ఫోన్చేసి విషయం చెప్పింది వాడు రాడు నాకు తెలుసు....కానీ వాడికి ఇక్కడి డబ్బు మాత్రం కావాలి... నో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ్నించీ నయాపైసా అక్కడికి చేరదంతే....

శ్మశానం వరకూ తడిగుడ్డలతో వట్టి కాళ్లతో నడవమన్నారు బ్రాహ్మణులు ....నా వల్ల కాదు అన్చెప్పి భార్గవనే అన్నీ చేయమన్నాను...కొద్దిపాటి వ్యతిరేకతతో భార్గవే అన్నీ చేసేట్టు ఒప్పుకున్నారు జనాలు....నేను మాత్రం నా కారులో వెళ్లాను శ్మశానానికి.....

నన్నో కట్టెపేడువేయమన్నారు...'నేను సైతం' అనుకుని ఓ కట్టెపేడు వేసా చితిపై....

కనీసం శిరోముండనం చేయించుకోమన్నారు...ససేమిరా అన్నాను....

నాలోని అబ్రాహ్మణ్ణి ఎన్ని బూతులు తిట్టుకోవాలో అన్నీ తిట్టుకునుంటారు బ్రాహ్మలనబడే వాళ్లు....లెట్‌దెమ్....

మధ్యాహ్నం మూడైంది కొంప చేరేప్పటికి .....వాతావరణం మారుతోంది నాకు తెలుసు నా భార్యా ముసలిదీ యిద్దరూ అవకాశం కోసం ఎదురు చూస్తుంటారు. భార్గవ నన్ను పక్కకు పిలిచి అడిగాడు

"ఏరా అన్నయ్య! రాజుగాడు రాలేదేం?" అని

చిన్నగా నవ్వి....."వాడికి అన్నీ ఆ ముసలిముండ బుద్ధులేరా....అది ఈ ఇంటిమీద వాడికి చిన్నప్పట్నించి విషం పోసింది.... వాడికి యిక్కడి వాళ్లూ ఎవ్వరూ అక్కర్లేదు, కానీ యిక్కడి డబ్బు మాత్రం కావాలి.....హి ఈజె టఫర్ రోగ్ ద్యాన్నీ" అన్నాను....

'వదిలేయ్ వదిలేయ్' అన్నాడు భార్గవ

ఇల్లంతా సందడిగా వుంది, ఎవరెవరో తెలీటం లేదు....

సాయంకాలం ఏడింటికే నేనూ భార్గవా, పిన్నీ డాబా మీద కూచునున్నాం...

పిన్ని కంటనీరు పెట్టుకొని "రాజు రానేలేదేమి నాయినా....మేమేమి ద్రోహం చేసాం చెప్పు....వున్న ఒకే ఒక పెద్ద దిక్కుకదా ఆయన? బతికున్నప్పుడు ఎలాగూ లేదు కనీసం కాలం చేసినప్పుడైనా...కనీసం చివరి చూపు కూడా చూడకుండా ఎక్కడి బాంధవ్యాలు నాయినా?" అంది...నేను వాణ్ణి రానీయకుండా చేసానన్నట్టు....

చెప్పాను "పిన్నీ! యిందులో నా ప్రమేయం ఏమీ లేదు... వాడిపెంపకమంతా నీ కోడలూ, వాళ్లమ్మాను...అందుకే భార్గవతో....." అన్చెప్పెబోయి ఆగిపోయా....

నా భార్య, ముసలి మంత్రగత్తే భార్గవ చిన్న కూతురు సునీతతో పైకొచ్చారు... సునీత ఎంబిబిఎస్ రెండో ఏడు అదొచ్చి నా పక్కన కూచుని.... "పెదనాన్నా! ఎన్నేళ్లైంది నిన్ను చూసి... రాజుగాడితో కలిసి నేను ఏడో తరగతిలో వున్నప్పుడొచ్చిందే మీరు వాడు రాలేదేం?" అంది....

దాని తల నిమిరి "ఎంత పెరిగిపోయావే... త్వరగా మెడిసిన్ పూర్తిచేసి నా కాళ్లకి మందియ్యవే అమ్మలూ" అన్నా...అంతలోనే

"చూడు నాయనా పెద్దదాన్ని ఇట్లా అడుగుతున్నానని ఏమీ అనుకోకు నీకు తెలియందేమీలేదు ఈ రోజుల్లో అమెరికా అంటే పిల్లలు ఎంత ఆసక్తి చూపిస్తున్నారో.... రాజయ్య అమెరికా వెళ్లి పై చదువులు చదువుతానంటున్నాడు దానికీ..." అంటూ మొదలు పెట్టింది ముసలిముండ...నాకు మండిపోయింది. శ్యామలవైపు తిరిగి... "నీకు వందసార్లు చెప్పా ...అక్కడ బయల్దేరే ముందునించీ దారి పొడుగునా చెబుతూనే వస్తున్నా...మనిషికో మాట గొడ్డుకో దెబ్బని....బుద్ధి లేదా? ఎప్పుడేం మాట్లాడాలో కూడా తెలీకుండా ఏళ్లొచ్చాయి లే.... గెటప్ అండ్ గెట్లాస్ట్ ఫ్రమ్‌హియర్" పెద్ద గొంతుతో అరిచా....

శ్యామల మొహం నల్లబారింది....

"లేవ్వే అమ్మా.....నే చెబుతున్నా వినకుండా వచ్చావు.... లేముందు లెమ్మంటుంటే" అని వాళ్లమ్మ జబ్బపట్టి ఈడుస్తూ లేపింది.... అవమానంతో కళ్లనిండా నీళ్లు నిండిపోయాయి...

అర్థమైంది ముసలి దాని సంభాషణలో శ్యామల ప్రమేయం ఏమీ లేదనీ

ఆవిడే కలగజేసుకుని మాట్లాడ్డానికొచ్చిందనీ....కానీ ఏంచేయను అందరి ముందూ పెద్దామె ఆమెను తిట్టలేను కదా....తప్పలేదు నాకు....

భార్గవ కూతురు సునీత హతాసురాలై చూస్తోంది....

శ్యామల వాళ్లమ్మను  దాదాపు యీడ్చుకుంటూ కిందికి తీసుకుపోయింది...

"ఎందుకురా అన్నయ్యా! వదిన్ని మా అందరెదుటా అట్లా అన్నావు చూడు ఏడుస్తూ వెళ్లింది...రాక రాక వచ్చింది కదా తనీయింటికి...అయినా అత్తయ్య కాని మాటలేం మాట్లాడలేదు కదా..." మందలించినట్టుగా అన్నాడు భార్గవ....

చెప్పా భార్గవకి...."ఆ పెద్దావిడ సంభాషణ ఎక్కడికి దారి తీస్తుందో నాకు తెలుసు మీ ముందు ఆమెను తిట్టలేను కదా....అందుకే ...ఏం చెయ్యమంటావు నన్ను చెప్పు...యిదుగో దీన్ని పట్టుకు తిట్టనా? పిన్నిని తిట్టనా...నన్ను నేను తిట్టుకోనా?"

"గొడవలొద్దు నాయినా" అని పిన్ని సునీతను తీసుకొని కిందికెళ్లిపోయింది. భార్గవా నేనూ...ఆ చీకటీ...నాన్నరాహిత్యమూ మిగులు.....

☀ ☀ ☀

నాన్న చనిపోవడం నిజానికి నాకిష్టం లేదు.... ఆయన మీది ప్రేమతో నేనీ మాటంటంలేదు... నాన్నకి నేనేమిటో నిరూపించుకునేంత లోపల హడావుడిగా... నన్నోడిస్తున్నట్టు ఆయన నిష్క్రమించడం నాకు కోపంగా వుంది....

కానీ.....ఏమీ చేయలేని అసహాయత...

నా కోప తాపాల్ని ఎవ్వరిమీద చూపించనూ...

మర్నాట్రోజు భార్గవని పిల్చి...రిజిస్ట్రార్ ఆఫీసుకు తీసుకెళ్లి పవరాఫ్ అటార్నీ రాయించి రిజిస్టర్ చేయించేంతవరకూ మనశ్శాంతి లేదు....

ఆస్థి సంచయనం...అదీయిదీ అన్నారు...

ట్రాష్ అన్నాన్నేను..

భార్గవే అన్నీ చూసుకుంటానన్చెప్పాడు..వాడికావిషయాల్లో నమ్మకం వుంది కూడానూ... నిజానికి భార్గవ లేకుంటే నేనీమాత్రం మనశ్శాంతితో బ్రతికేవాడినా?

☀ ☀ ☀

ఒకానొక నిషిద్ధ పథాన్నికోరి ఎంచుకుని ప్రస్థానాన్ని ప్రారంభించా..... ప్రారంభించానా? నిజానికిది నిషిద్ధమని నాకప్పుడు తెలుసా?

తెలుసుంటే ఆ యాత్ర...ఆ ఏమిటీ 'ఈ' యాత్ర మొదలుపెట్టుండేవాడినా? ఏ యాత్రో....

నాన్న శవయాత్ర నిర్వీర్యంగా సాగింది....

పట్టుమని పదిహేను మందికూడా లేరు...

అవసరమైందానికంటే ఎక్కువ బతికాడు నాన్న.....

అవసరం ఎవరికీ? ఆయనకా? సంఘానికా?

నాన్నబ్రతికాడా? జీవించాడా?

నా అభిప్రాయం ప్రకారం కేవలం చివరి పదిహేనిరవయ్యేళ్లు బతికాడు... అంతే .... యస్.... అంతే...

నిజానికి నాన్న జీవించాడా? ఎప్పుడేనా? తన తొంభై చిల్లర సంవత్సరాల కాలంలో.... నేననుకుంటున్న పదిహేనిరవయ్యేళ్లకి క్రితమైనా నాన్న జీవించాడా?

ఎవరి దృక్కోణంలోంచీ చూడాలి యీ విషయాన్ని?

బ్రతకడం...జీవించడం...రెండూ వేరు వేరన్న విషయాన్ని ఎవ్వరు ధృవీకరించాలి?

మనసుతోపాటు శరీరం కూడా వైకల్యానికి గురౌతోంది....

కాళ్లు దాదాపు సహకరించడం మానుకున్నాయి...

వెళ్లి ఉమానాథ్‌ని కలిసి చూపించుకోవాలి యిప్పటికే చాలా నిర్లక్ష్యం చేసాను...యిక పోస్ట్‌పోన్ చేయకూడదు.... నిర్ణయించుకున్నా....

☼ ☼ ☼

ఊరికి వచ్చీరాగానే ఉమానాథ్‌కు ఫోన్చేసి మాట్లాడా..."సాయంకాలమే వచ్చేయి" అన్నాడు.

వెళ్లా...

ఏవో పరీక్షలు చేసాడు...

"టి.ఏ.ఓ. అని నా అనుమానం...ఇట్స్ బికాసాఫ్ స్మోకింగ్.... యూ హ్యావ్ టు క్విట్ స్మోకింగ్...అర్జెంట్‌గా జేబులోని ప్యాక్ బైట పారేయ్...లేకపోతే కాళ్లు రెండూ పోగొట్టుకొంటావ్" అన్నాడు...

"టి.ఎ.ఓ. అంటే?" ప్రశ్నించా...

"నీకు చెప్పినా అర్థం కాదు, అయినా చెప్తున్నా Thrombo Angitis oblit-

erans అని జబ్బు పేరు...నీకర్థమయేలా చెప్పాలంటే బ్లడ్ వెసల్స్ మందమై రక్తప్రసరణ తగ్గిపోవడ మన్నమాట...దీనికి మందుల ట్రీట్మెంట్ దాదాపు లేనట్టే...సర్జికల్గా వెళ్లాల్సిందే... అదీ ఫెయిలైతే.... యాంప్యుటేషన్....కాళ్లు తెగనరకడమే... నిన్ను భయపెట్టాలన్చెప్పడం లేదు.... నిజానికి నేను భయపడ్తూ చెప్తున్నాను.... ఆగాడు.....

"నిజంగా సిగరెట్ల నించే అంటావా?" అడిగా....

"హండ్రెడ్ పర్సెంట్' అన్నాడు....

"సరే నైట్ రాజ్ధానికొస్తావా? చాల్రోజులైంది...మనం కల్సి" అడిగా..."నో యీ రోజు కాదు, రాత్రి పదిన్నరకి కల్యాణిలో హిప్ రీ ప్లేస్మెంట్ సర్జరీవుంది... ఎప్పుడో తెల్లవారుజామవుతుంది ముగిసేప్పటికి....సం అదర్టైం" అన్నాడు...

"సరే....మళ్లీ కలుద్దాం....అయితే సిగరెట్లేనంటావా?" మళ్లీ అడిగా... "టూ హండ్రెడ్ పర్సెంట్" తేల్చేసాడు.

☼ ☼ ☼

ఇప్పుడే యింతపాటి మర్యాదుంది...కాళ్లుపోతే! మంచానపడి మల మూత్రాలకు యింకొకళ్ల మీద ఆధారపడి...అమ్మో! నో! నెవర్....నన్ను నేను చంపుకుంటాగానీ....చక్రాల కుర్చీకి అంకితం కాను....

యస్ కానుగాక కాను.....

అప్రయత్నంగా జేబులోంచి సిగరెట్ తీసా... 'అర్జెంటుగా జేబులో ప్యాక్ బైట పారేయ్....' ఉమానాథ్....

ఒక్కటి....ఒక్కటంటే ఒక్కటే....

వ్యసనం.... వదల్లేను...కాదుకాదు అదే నన్ను వదలట్లేదు....మైడియర్ సిగరెట్.... ప్లీజ్ లీవ్మీ...ఒకవేళ నాతోటేవున్నా...నాకాళ్లు తినేయకు...

సిగరెట్కు వున్న అస్తిత్వం నీ ఆలోచన్లో వుంది...సిగరెట్కై సిగరెట్కు అస్తిత్వం లేదు...నీకు అదివుంది... దానికి నీవు లేవు...సార్త్ర్....మెల్లకన్ను సార్త్ర్..బీయింగ్ అండ్ నథింగ్నెస్..అస్తిత్వమూ అస్తిత్వరాహిత్యమూ.... రాహిత్యం... నారాహిత్యం.... నేన్లేకపోతే నాయీ ప్రపంచం నాకు లేదు... నాదైన యీనా చిన్న ప్రపంచం... నారాహిత్వంతో అంతమై పోతుంది... ఛిఛీ....నెగటివ్ థింకింగ్...సిగరెట్టు కోసమేనా యీ నా తప్పుడు ఆలోచన్లు....

వెధవ సిగరెట్ పారేయ్.....

లాస్ట్‌వన్...

వద్దు......

ఒక్కటీ.....

నిజంగా ఒక్కటి.....

యస్ నిజంగా ఒక్కటే...యిదే చివరాఖరు..

సిగరెట్ చివర ఎర్రగా నిప్పు గుండెల్నిండా వెచ్చటిపొగ....

'హ్యాపీ వైన్స్' ముందు కారాపి విండోలోంచీ తలబైట పెట్టి షాపు కుర్రాడికి సైగచేసా... వాడు నల్లటి క్యారీబ్యాగ్‌లో ఓ పైంట్ విస్కీ వేసి తీసుకొనివచ్చి డబ్బు తీసికెళ్లాడు....

కారు లోపలపెట్టి వరండా మెట్లెక్కుతున్నా....

పక్కింటి బెంజమిన్‌తో మాట్లాడ్తూ మా ముసలి మంత్రగత్తై....

అద్భుతమైన ఇంగ్లీష్ మాట్లాడుతుంది...బెంజమిన్గాడు వినమ్రంగా తలొంచి ముసల్దాన్తో మాట్లాడుతున్నాడు......

ముసల్దాని మాటల చాతుర్యమే చాతుర్యం...గొప్ప మాటలాడి..మాటలతోనే కదా నన్ను బురిడీకొట్టించిందీ....!

ఊరినించీ వచ్చినప్పట్నించీ నాకూ శ్యామలకూ మాటల్లేవు. మా ఊళ్లో అవమానం జరిగిందిగా తనకూ...నేను కూడా పలకరించట్లేదు.....

నా భోజనం మామూలుగా నా గదిలోకొస్తోంది.....

తల్లీకూతుళ్ల మధ్య రహస్య సంభాషణలు విన్పించట్లేదు.... మామూలుగా గుసగుసలుండేవి....అవి లేవు...

మా పుత్ర రత్నం మాత్రం ఓసారి నా ఎదుటపడ్డాడు... అప్పుడు వాడి వేపు ఛీత్కారంగా చూసి 'ద్ఫూ' అని ఉమ్మేసా... వాడేం తక్కువ తిన్లేదు... అన్ని వేళ్లూ మడిచి మధ్యవేలుని పైకెత్తి ఓ అసభ్యసూచిక చూపించివెళ్లాడు...

కానీ నేను మాత్రం లోపల్లోపల చాలా ఆనందించా...ఇట్లాంటి వెధవకి నా వేపు ఆస్తి చచ్చినా దక్కకూడదు...అది దక్కకుండా చేసొచ్చా అదీ ఆనందం....

లోపలికెళ్లి బట్టలూడదీసి స్నానంచేసి నా మామూలు లాల్చీ పైజామాల్లోకి ప్రయాణించా...

నాన్న మరణానంతరం ఇంట్లో ఏర్పడ్డ నిశ్శబ్ద అసహనానికి ఎవరో ఒకరు తెరతీయాలి....కదా....

నా మడతకుర్చీలో పునర్జన్మించిన మరుక్షణం....శ్యామల.... లోపలికొచ్చి తలుపు గొళ్లెమేసింది...

మళ్లీ ఓ ఉపన్యాసం వినాలా?....

ఓ మూడు నిముషాలు మౌనంగా ఎదురుగా కూచుంది....

నాకూ అసహనంగా వుంది...

"అయాం సారీ...అమ్మ ఆరోజు అట్లా మాట్లాట్టంలో నా పార్ట్ ఏమీ లేదు... అమ్మే..షీ హర్సెల్ఫ్..." అంటూ ఏడ్వసాగింది... నాక్కూడా జాలేసింది...నాకు తెల్సు తన ప్రమేయం ఆరోజున యీషన్మాత్రం లేదని....

"శ్యామలా! అయ్‌నోయిట్...కానీ అందరి ముందూ మీ అమ్మను తిట్టలేను కదా.... అందుకనీ.... అయ్ టూ యామ్ సారీ....ప్లీజ్ ఫర్గెటిట్" అన్నాను.

"ఓకే...లెట్స్ ఫర్గెటిట్...దయచేసి ఎక్కువ తాక్కండి" అని వెళ్లిపోయింది....

ఈ శ్యామల...దిస్ వెరీ శ్యామల ...నన్నో పిచ్చిపప్పన్చేసి ఆడించిందారోజుల్లో ఇన్నేళ్ల సాహచర్యం తర్వాత కూడా శ్యామలేమో నాకెందుకు తెలియట్లేదు నేనేమో శ్యామలకు తెలుసా?

ఎవరైనా ఎవరికైనా పూర్తిగా తెలుస్తారా?

అసలు నాకు నేను పూర్తిగా తెలుసా?

నో...

మన గురించి మనకి తెలుసనుకోడం పిచ్చితనం....

మరి మాయలాడిలా కనిపించే నా అత్త కామాక్షమ్మ ఒకప్పుడు నాకు దేవతలా కనిపించి...ఈ క్షణాన నాకు దుర్మార్గురాలిగా రామాయణంలో మంధరలాగా....భారతంలో శకుని జెండర్ మార్చుకుని స్త్రీ లింగంలో కనబడ్తూన్నట్టు కన్పడ్డానిక్కారణం ఆమె గురించి నాకు పూర్తిగా తెలియకపోవడమేనా?

ఏమో...!

కామాక్షమ్మ నిజంగా మంచిదేమో...!

ఏమో....!

కామాక్షమ్మ మంచిదానిలా కనిపించే దుర్మార్గురాలేమో...!

ఏమో....!

కామాక్షమ్మ....కామాక్షమ్మ....కామాక్షమ్మ....షిట్!

గ్లాసుకు సగానికున్న విస్కీ ఒక్క గుక్కతో మింగేసా...గొంతు చుర్రుమంది.

నిజానికీ కామాక్షమ్మే కదా నన్నారోజునాదుకుంది....

నాన్నతో తెగతెంపులు చేసుకుని ఇంట్లోంచి బైటపడ్డ రోజులు ఈ నాటికీ క్రిస్టల్ క్లియర్గా గుర్తున్నాయి... మెదడు నా ప్రమేయంలేకుండా కాలాన్ని రీవైండ్ చేసింది....

* * *

రైలెక్కి వచ్చేసా...రంగారావు వుండి వుంటే బాగుండేది... కానీ ఎక్కడో జర్మనీ లో వున్నాడు... వైకుంఠం ఒక్కడే నాకు బాగా తెల్సినవాడు, వాడు పాతగది వదల్లేదు... పోస్ట్ గ్రాడుఏషన్ కూడా అదేవూళ్లో కాబట్టి వాడు ఎమ్ఈ చేయడానికి అక్కడే వున్నాడు...

వాణ్ణి కలిసా....

"ముందు నువ్వు ఈ గదిలో వుండిపో తర్వాత్సంగతి తర్వాత" అన్నాడు... వాడుంటున్న గది ఈ కామాక్షమ్మ ఇంట్లో గది... అప్పట్లో యాభై అద్దె...పెరట్లో మూల కుండేది... అన్నిటికీ అనుకూలంగా..... డిగ్రీ చదూతున్నప్పట్నించీ ఆమెకు నేను పరిచయమే...

నా స్వంత విషయాలన్నీ వాకబు చేసింది....

"బ్రామ్మలింటోపుట్టి ఈ అలవాట్లేమిటి నాయనా" అని బుద్ధులు చెప్పేది... ఒకట్రెండుసార్లు నేవెళ్లినప్పుడు వైకుంఠం లేకపోతే...

"రా నాయినా కూచో వస్తాళ్లే" అని కూచోబెట్టి టిఫిన్లూ, కాఫీలూ యిచ్చేది... అదుగో అలాంటి సమయంలో శ్యామల పరిచయం....

ఆ వయస్సులో ఏ అమ్మాయి అయినా అందంగానే కనిపిస్తుంది.....

అప్పట్లో శ్యామల కూడా మెత్తమెత్తగా నవ్వుతూ మాట్లాడేది....

సరే నే వచ్చి చేరింతర్వాత...ఓ రోజున కూచోబెట్టి నా పరిస్థితి వాకబు చేసింది.....

జరిగింది జరిగినట్టు చెప్పేసా.....

“సరే గొడవ జరిగిపోయింది... మరిచిపో...మరి ఎం.ఇ. చేయాలనుంది అంటున్నావు డబ్బు ఎలా?” అనడిగింది....

‘అదే తెలీట్లేదండీ...ఎక్కడైనా పార్ట్‌టైం ఉజ్జోగం చేసుకుంటూ ఎం.ఇ. చేద్దామనుకుంటున్నాను...” అన్నాను....

అప్పటికే ఓ బ్రాహ్మాండమైన మంత్రాలోచనాబుర్రలో జరిగిపోయిందన్న సంగతి గ్రహించే స్థితిలో లేను....

‘చూడు నాయినా! నువ్వేమీ అనుకోకపోతే ఓ మాటడుగు తాను...నిన్ను ఎవరైనా స్పాన్సరు చేస్తామంటే అందుకు నువ్వొప్పుకుంటావా?” అనడిగింది...

“నన్ను ఎవరైనా ఎందుకైనా...ఎట్లా స్పాన్సరు చేస్తారండీ” అన్నాను

“చేసారే అనుకో నువ్వొప్పుకుంటావా?”

“ఉత్తినే ఎవరూ స్పాన్సరు చెయ్యరుకదండీ...వాళ్లు ఏమి కోరి స్పాన్సరు చేస్తారో తెలియాలికదా?” అన్నాను.....

“సరే వున్న విషయం చెప్తాను...విను విని బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి రా ... నేనే నీ ఎం.ఇ.చదువుకు సాయం చేస్తాను.... ఏమి కోరి చేస్తారో అన్నావు కదా? నేను కోరేది ఒకటే అదీ నీకు మంచి జరిగేది....మా అమ్మాయి శ్యామల్ని చూసావు కదా? నీకిష్టమయితే నువ్వు ఈ ఇంటికల్లుడుగా రావాలి...నాకు ఓ మంచి కుర్రాడికి అమ్మాయి నిచ్చానన్న తృప్తి మిగుల్తుంది. నీ అవసరమూ తీరుతుంది....ఏమంటావు?” అన్నది.....

కొద్దిగా ఇబ్బందిగా అనిపించింది....

“కాస్త ఆలోచించుకుని చెప్తానండీ” అన్నాను....

“బాగా ఆలోచించు నాయినా..మేమూ బ్రాహ్మలమే నీకు తెలుసు...అయితే శాఖలు వేరు మనవి...అయినా ఈ రోజుల్లో ఆ శాఖల గురించి ఎవరాలోచిస్తారు చెప్పు...చూడు బాగా ఆలోచించు.....” అందామె...

దాం తర్వాత వైకుంఠంతో ఆలోచించా ఈ విషయం....

“చాలా త్వరగా చాలా మంచి పరిష్కారం దొరికిందిరా నీకూ ఇక మీనమేషాలు లెక్క పెట్టక వొప్పేసుకో.....ఆ అమ్మాయి కూడా బావుంది...చదువుకుంది...మీ వాళ్లే అన్నీ కుదిరాయి ఈ అవకాశం వదలకు” అన్నాడు...

వెంటనే వొప్పేసుకుంటే వెర్రిపప్పనౌతానన్న ఇంగిత జ్ఞానం లేదు...పైగా అవసరం....నాన్నతో చేసిన ప్రతిజ్ఞ.......

వైకుంఠాన్ని వెళ్లి చెప్పిరమ్మన్నా.....

నేవొప్పుకున్నట్టు వైకుంఠం వెళ్లి చెప్పిన్రోజున చాలా పెద్ద పండగ చేసిందీ కామాక్షమ్మ....

దాదాపు నిశ్చితార్థం అన్నమాట.......

ఆ రోజుకి మర్నాట్రోజున నేనూ వైకుంఠం ఇంకో ముగ్గురు స్నేహితులు కలిసి నా పిచ్చి సక్సెస్‌ని సెలిబ్రేట్ చేసుకున్నాం...

పిచ్చపిచ్చగా తాగి గెంతులేసి పాటలుపాడి ఓ గోల గోల పెంట పెంట...

మర్నాట్రోజు మై ఉడ్‌బీ మిసెస్ శ్యామలగారు తల్లిగారితో గొడవ నేనీ తాగుబోతును పెళ్లి చేసుకోనని....

వైకుంఠం వెళ్లి సారీ చెప్పివచ్చాడు...

అయినా ఆవిడగారు అలకమానలే...

పెళ్లి లేకపోతే చదువు లేదు...

చదువులేకపోతే....గతిలేదు..

వెనక్కు వెళ్లి నాన్న చూపించిన ఉద్యోగంలో చేరి.....ఆ పూజారి కూతుర్ని చేసుకోడమా....జాన్తానై....

ఏముంది.... కాంప్రమైజ్...

చేతగాని తనం....అసహాయత...

నేనేవెళ్లా...

మీటింగు...

కామాక్షమ్మ...బిగదీసుకున్న నా చాన్స్....వెర్రిపప్ప నేనూ....

"చూణ్ణాయినా యిది....ఏదో కుర్రతనం ....సరదాగా సెలబ్రేట్ చేసుకున్నారు అంతే...ఏదో రోజున తాగితే తాగుబోతయిపోతాడా... ఏమిటి....పెళ్లి తర్వాత ఇవన్నీ వుండవు అన్చెపుతున్నా వింటంలేదీ పిచ్చిపిల్ల"

ఆహా ఏం తెలివిగా కొట్టిందండీ ఈవిడ, అంటే పెళ్లి తర్వాత మందూగిందూ అన్నీ బందు అని ఇండైరెక్టుగా సెలవిస్తోందన్నమాట. నేను కూడా హిహ్హిహీ అనికిలించా....

"హిమస్ట్ ప్రామిస్మీ" మై ఉడ్బీ వైఫ్ నౌ మై ఎక్సలెంట్ ఛాన్స్.....

"ప్రామిస్ అయివిల్నాట్ డ్రింకగేన్" మిస్టర్ వెర్రిపప్ప గాడు...

సో కాంప్రమైజ్....

ఓ వెర్రిపప్పగాడు దొరికాడు అన్న తృప్తివాళ్ల మొహాల్లో కనబడింది. అప్పుడు అనునయించి బుజ్జగించి నా తాగుడుని సమర్ధించిన ఈ ముసల్ది అసలు సిసలైన లేడీ చాణక్య....

అయినా ఈమె జీవితం ఈమెకీ ఆలోచనలు నేర్పింది....

చిన్న వయసులో వైధవ్యం.....

చంటిబిడ్డ....

చుట్టూ ముళ్ల కంపల్లాంటి చూపుల్తో లోకులు.......

ఎదురీదింది...చదూకుంది.... గవర్నమెంటు ఉద్యోగంలో చేరింది, సాధించింది....

తనకుమల్లే ఇన్సెక్యూర్డ్ జీవితం తన కుతూరుకుండకూడదని నా అసహాయతని అసరాగా చేసుకుని నన్నుకొని ఇంటి అల్లుడిగా చేసేసుకుంది...

ఆమె వైపునించీ ఆలోచిస్తే ఆమె సరైన దారిలోనే వెళ్తూందనిపిస్తుంది. నాకు ముసలి మంత్రగత్తె లాగానే అనిపిస్తుంది....

కానీ నా పరిస్థితి ఏమిటి?

అయిన వాళ్లతో సరైన సంబంధాల్లేవు...నాదైన జీవితం జీవించేందుకు వీలుకావడంలేదు...

రాజుగాడు పుట్టినప్పట్నుంచి ఆస్తి భాగాలు చేయించమని ముసల్దాని పోరు....

శ్యామల్ని నా మీదకి రేకెత్తించడం...

ఎప్పుడూ ఒకటి రెండు పెగ్గుల్తో ఆపేసేది కాస్తా

ఆరేడు పెగ్గులకి పెరగడం...దాన్తో పాటు

అదే నిష్పత్తిలో పెరిగిన సిగరెట్లు....

అసహనం...

అనారోగ్యం...

వంటరితనం....

మమూలుగా తాగేది వ్యవసనంలా పరిణమించడం

దూరమైన కళారాధన

చీకట్లో కూచుని .... పన్నాలాల్ బాసురీనో అస్లాంఖాన్ గళమో ఆమోంకర్ మధురగాత్రమో...వినడం.....

వింటుండగా....శ్యామలో ముసల్దో వచ్చి ఆయింత

ప్రశాంతతనూ విధ్వంసం చేయడం...

కసిరేగడం....

ఇంకా తాగడం...

ఛీఁ......

ఇట్లాంటి సమయంలో కాళ్లుపోతే!

వద్దు వద్దూ.....సిగరెట్లు మానేస్తా....

మానేయగల్నా?

అనుమానమే....

కాళ్లు నరికేస్తే!

చక్రాల కుర్చీ...ఒంటికీ దొడ్డికీ ఇంకోళ్లు సాయం చేయాల్సిందే...ఉద్యోగం? కుంటింజనీరు... తోసేస్తారు..సైట్ చెకింగ్‌కి వెళ్లలేదు, తీసేయండి కుంటి వెధవని....

కాంపెన్సేషన్....

లంచాలుండవ్....

వెళ్లి మందు తెచ్చుకోలేను...

హేపీ వైన్స్ వాడితో కాంట్రాక్టు పెట్టుకోవాలి...

కాళ్లుపోయిం తర్వాత మళ్లీ సిగరెట్లు మాత్రం కాల్చుకోవచ్చా....అప్పుడు పోడానికి కాళ్లుండవుగా....

భేష్.....

రిటైర్డ్ కుంటింజినీరుగా సెటిల్ కావడమే బెటరేమో....

ముడ్డి కడగటానికీ మూతి కడగడానికీ పని మనుషులు దొరుకుతారా?

నా భార్యామణి శ్యామలాదేవిగారు ఆ పన్లు చేస్తారా?

ఛీఁఅసహ్యం కదూ....

దానికంటే ఆత్మహత్య మేలు....

యస్ ఇఫెటాల్ దట్ హ్యాపెన్స్ అయ్‌విల్ కిల్ మై సెల్ఫ్.... ఎక్సిక్యుటివ్ ఇంజినీర్ ఆత్మహత్య...

తన అత్తా భార్యా తన కొడుకు తన ఆత్మహత్యకు కారకులని ఉత్తరం రాసిపెట్టి చనిపోయిన ఇంజనీరు.......

హహ్హాహా.... భలే అయిడియా.... ముసల్దాని ప్రమేయం ఎక్కువ అన్రాయాలా ఉత్తరంలో.....

తలుపు తెరుచుకుంది....

మనసుల మధ్య కట్టుకున్న గోడలకున్న తలుపులు తెరుచుకోనే.... ఎవరూ తెరవరే...

అని ఎప్పటికీ తెరవని తలుపులేనా?

శ్యామల భోజనం తెచ్చి టేబుల్ మీదపెట్టి మూత పెట్టింది.... వెళ్లబోతుండగా...

పిలిచా...

'శ్యామలా'

పేరుపెట్టి పిలిచింది ఎప్పుడో సరిగ్గా గుర్తు లేదు....

ఆశ్చర్యంగా చూస్తూ వచ్చి కూచుంది....

"శ్యామలా! వాట్ దూ యు డూ ఇఫై డై" యధాలాపంగా

అడిగా....

భయంగా నా వేపు చూసింది....

"చెప్పు....భయపడకు ఎక్కువ తాగనూ లేదూ నాకు పిచ్చీ పట్టలేదు.... వున్నట్టుండి నే చనిపోతే ఏం చేస్తావ్?" నెమ్మదిగా అడిగా....ఒక్కసారి బోరున ఏడవసాగింది....

"ఎందుకండీ అలా మాటాడ్తున్నారూ ఈ రోజున...నిజంగా ఆ రోజున అమ్మ అన్న మాటలకు నాకూ ఏ సంబంధమూ లేదు... నిజం చెబుతున్నా మీరు... మీరు...నన్ను నమ్మాలి అంతే" అని కళ్లు తుడుచుకుంది.

"ఛఛ అది కాదు నిజంగా సడన్‌గా నే చనిపోతే....అని"

"యూ హ్యావ్ లాస్ట్ యువర్ మైండ్" అని విసురుగా లేచి వెళ్లిపోయింది..

గట్టిగా నవ్వుకున్నా....

చనిపోతే మాత్రం నాన్నలాగా చనిపోకూడదు....

ఒకళ్ల చేతికి దొరక్కుండా చనిపోవాలి...

చావు... మృత్యువు....జిబ్రాన్ ప్రాఫెట్.... ఆల్‌మిత్రా అడిగిన చావు ప్రశ్నకు సమాధానం....

మరణ రహస్యం.... జీవితపుహృదయంలో కదా!

ఘూకానికి కాంతి రహస్యం తెలుస్తుందా!

నిజంగా మృత్యు రహస్యం తెలుసుకోవాలనుంటే...జీవితం లోలోపల హృదయాన్ని విశాలంచేసి విసిరేయ్....

మృత్యువు జీవమూ అద్వైతాలు....

నదీ సముద్రాల్లాంటివి....

కోరికలూ ఆశలూ అంతర్గర్భంలో అతీతాన్ని గురించిన నిశ్శబ్దం జ్ఞానముంది.....

కలలను నమ్ము, వాటిల్లో శాశ్వతత్వానికి వాకిళ్లున్నాయి.

For what is it to die but to stand naked in the wind and melt into the sun...And what is it to cease breathing but to free the breath from its restless tides, that it may rise and expand and seek God unencumbered.

నిశ్శబ్ద నదీ జాలాలను సేవిస్తేనే మధుర గానం నీ నోట...నిజానికి ఓ పర్వతాన్ని ఎక్కేసింతర్వాతే నీ అధిరోహణ మొదలవుతుంది. నీ కాలికింది మట్టి నీ శరీరాంగాలను కోరినప్పుడు నువ్వు నృత్యం చేయగలుగుతావు....

ఆల్‌మిత్రా అర్థమైందా?

అర్థమై అవకా వుంది ఖలీల్...జిబ్రాన్...ప్రోఫెట్...!

ఎన్ని రోజులైంది ఓ మంచి పుస్తకం చదివి...

ఖలీల్ జిబ్రాన్ ప్రేమలేఖలు మాత్రం లేవు నా దగ్గర తెప్పించాలి. అయినా చదివేడిచేదెప్పుడూ....

నెమ్మదిగా లేచి పుస్తకాల బీరువా గాజు తలుపు తెరిచా...

అప్రయత్నంగా చేయి కల్యాణమల్లుడి అనంగరంగమీద పడింది...

ప్రాకృతికంగా సహజాతమైన ప్రత్యుత్పత్తి క్రియకు యింత ప్రాధాన్యత ఎందుకిస్తున్నాడు మనిషి...?

రజనీష్ అన్నట్టు వీర్యస్ఖలనం జరిగే ఆ రెండు మూడు క్షణాల్లో మనిషిలోని 'నేను' నశిస్తుంది... అది బ్లిస్ దాన్ని శాశ్వతం చేసుకునే ప్రయత్నంలో మనిషి పదేపదే దానికై తపిస్తూ తపిస్తూ దాన్నే శాస్త్రం చేసి పారేసాడు....

నేను సెక్సులో పాల్గొని ఎన్ని రోజులైంది....?

రోజులా?

నెలలా?

ఏళ్లా?

ఒంట్లో ఏదో చిన్న కదలిక.....

శ్యామల తప్ప నా జీవితంలో మరో స్త్రీ లేదు...

శ్యామలకు మెనోపాజ్ వచ్చి నాలుగేళ్లైపోయింది.....

మేమిద్దరం కొత్తలో శారీరక వ్యామోహాలతో కలిసామే తప్ప... మా యిద్దరి మధ్యా ప్రేమ అనేది వుందా అసలు?

శ్యామల ఎలా ఫీలౌతోంటుంది?

శ్యామల్ని లోపలికి పిలిచి... 'అయ్‌ఫీల్లైక్ హ్యావింగ్ సెక్స్' అనడగనా? ఒప్పుకుంటుందేమో....

అయినా ఒప్పుకున్నా దాని వెనక ఏదైనా కుట్ర వుంటుందేమో...!

ఒప్పుకుని.....ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుందేమో...!

అసలు ఒప్పుకోక ఛీఃఈ వయసులో యిదేం చోద్యం అంటుందేమో..... ఏమిటసలు మా యిద్దరి మధ్యా వున్న సంబంధం?

తన నా భార్యే కదా...!

అయినా తన శరీరం మీద తనకు హక్కు వుంటుంది కదా!

ఛ...కల్యాణమల్లుడా లోపలికెళ్లి దాక్కో.....

ఆధ్యాత్మికత ఇట్లాంటి సమయాల్లో బాగా పనిచేస్తుందేమో....

దేముడిమీద నమ్మకం లేకపోవడం వల్ల నాకీ అవస్థ వచ్చిపడిందా? అసలు దేవుడు అన్న పదమే నాకు అవసరం రాలేదేమో....అందుకే నేనాలోచించలేదేమో!

ఏమో!

ఎవర్నైనా ఓ గురువునెదుక్కోవాలేమో!

ఆ గురువుగాడికి ఇట్లాంటి అవస్థ వుండదా?

లోపాయికారీగా లాగించేస్తుంటారా?

ఆకలినీ నిద్రనీ జయించలేనివాళ్లు అత్యంత బలీయమైన కామాతురలిప్సల్ని జయించగలరా?

గలరేమో...

కనీసం మాస్టర్బేట్ చేసుకోరా?

ఇప్పుడు నేను దాని ఆసరా తీసుకోవచ్చు కదా?

ఏ పేచీ వుండదు. శ్యామలవసరం లేదు..ఎవ్వరి అవసరం లేదు... ఏ కుట్రకుతంత్రాల భయమూ వుండదు...

ఒక్కసారిగా నవ్వొచ్చింది...

బిగ్గరగా నవ్వేసా...

బట్టలన్నీ విప్పి అద్దం ముందు నగ్నంగా నిలుచున్నా....

అద్దంలో ఎవడువాడు?

నేను కాదు...

తలమీద ఉంగరాల క్రాపు స్థానంలో నున్నటి ఎర్రటి చర్మం....

కళ్లు లోతుకుపోయి కళ్లచుట్టూ నల్లటి వలయాలు...

పెదవుల చివర్ల మడతలు...

సాగిన బుగ్గలు...

కళ్లు పక్క కాకికాళ్లు

మొహం ఏదో శవ పేటికలోని శవం సడన్‌గాకళ్లు తెరినట్టు....

ఎవడ్రా నువ్వూ?

ఈ.....ఈ....?

డ్యా....డీ...ఈ..ఈ?

పచ్చలకుదురు వంశాంకురం?

శ్యామలాస్ హబ్బీ?

ముసలి మంత్రగత్తె అల్లుడూ?

ఏవడ్రా నువ్వూ....

ముందుకు జారిన బొజ్జ....

పీలగా అయిన తొడలు.....

వాటి మధ్య మర్మాలేమీ తెలీనట్టు మర్మాంగం... అమాయకంగా. ..ఆయాసం వచ్చింది... పక్కనే పారేసిన లుంగీ చుట్టుకుని....యింకోస్టిఫ్ వేసుకున్నా....

నా లోపలి కల్యాణమల్లుడు పారిపోయాడు....

నన్ను నేను అద్దంలో నగ్నంగా చూసుకోడంతో నా మీద నాకే అసహ్యం కలిగింది ఈ శరీరం కోసమా పాకులాట?

ఓలాంటి నిర్లక్ష్యం వచ్చింది....

కసిగా సిగరెట్ వెలిగించి బలంగా దమ్ములాగి గుండెల్నిండా పీల్చి ఆనందించా.....

యామై కిలింగ్ మై సెల్ఫ్?

* * *

ఉదయాన్నే సత్తార్ ఎవర్నో పిలుచుకొచ్చాడు... “పిల్లి వెంకట్రావ్ ఆరైగా చేస్తున్నాడ్సార్....ఈయన హోమియోపతీ డాక్టరు కూడా.... మీ లెగ్స్ ప్రాబ్లెమ్ గురించి పిలుచుకొచ్చా” అన్నాడు...

పిల్లి వినయంగా నమస్కరించింది...

నల్లటి జిప్‌బ్యాగ్ నించీ ఏదో అప్లికేషన్ ఫాం లాంటిది బైటికితీసి “సార్ యిది ఫిల్ చేయాల్సార్... నేనడుగుతుంటాను మీరు చెపుతూండండి నేనే రాసుకుంటాను... ఎందుకంటే హోమియోలో అలవాట్లూ మానసిక స్థితీ అన్నీ చాలా అవసరం సార్...నేను గ్యారంటీగా చెప్పగలను త్రీమంత్స్‌లో మీ ప్రాబ్లెమ్ సెవెంటీఫైవ్ పర్సెంట్ తగ్గించేస్తాను” పిల్లి.....

ఏవేవో అడిగాడు... పులుపు యిష్టమా? ఉప్పెక్కువ తింటారా? ఆలోచనలు ఎలా వుంటాయీ లాంటివి...

ఓ అరగంట తలతిని “ఈవెనింగ్ మందులు తీసుకొస్తాసార్ మీరు లేకపోయినా ఇంట్లో యిచ్చి వెళ్తా, ఎట్లా వాడాలీ ఎప్పుడు అవన్నీ రాసీ మరీ యిస్తా సార్” అని వెళ్లిపోయాడు...

“చాలా చాలా క్రిటికల్ కేసులు కూడా బాగుచేసాడ్సార్” సత్తారన్నాడు...

“థాంక్యూ సత్తార్” అన్నాను....

“నేను వచ్చింది అసలు వేరే పనిమీద సర్” సందేహిస్తూ అన్నాడు సత్తార్ చెప్పమన్నట్టు తలూపాను....

"నిన్న కాంట్రాక్ట్ ఫైనల్ పేమెంటు కూడా వచ్చేసింది కదసార్. ఈ హ్యాపి అకేషన్ని పిక్‌నిక్‌లాగా అందరము సెలబ్రేట్ చేద్దామనుకుంటున్నాం... మీరు డీఈగారూ... పీఏగారూ...ఆఫీస్ స్టాఫ్‌లో కొందరూ నేను అందరం ఫ్యామిలీస్‌తో మా తోటకు వెళ్దాం సార్"....

నా రెస్పాన్స్ కోసమన్నట్టు ఆగాడు...

నవ్వుతూ చెప్పమన్నట్టు తలూపాను మళ్లీ...

"మీరు ఒకే అనరేమోనని డీ ఈ గారన్నారు సార్... అందుకని ముందు మీ దగ్గర ఒకే చేయించుకుని అందరికీ చెప్పేస్తానన్సార్" అన్నాడు...

"ఎప్పుడు?" అడిగా...

"ఈ సండేనేసార్ ...పిల్లలకీ వాళ్లకీ సండే ప్రోగ్రామ్స్ మిస్ కాకుండా రెండు టీవీ సెట్స్ కూడా పెట్టిస్తున్నా సార్...."

సరే ఇంట్లో ఈ బండనిశ్శబ్దంతో విసుగెత్తిపోయింది...సరదాగ ఓ పూట గడిపొస్తే బానే వుంటుంది కదా అనిపించింది...

నవ్వుతూ "ఒకే" అన్నా...

"థ్యాంక్యూసర్....పుడ్ ఏమివండించాలో చెబితే..." అన్నాడు సత్తార్....

"నా సంగతి తెలుసు కదండీ..మా యింట్లో ప్యూర్ వెజిటేరియన్....డ్రై పార్టీనా? అడిగా....

"ఇంతచేసి డ్రైగా ఎట్లా వుంటుంది సర్ షివాస్ రీగల్ ఓ సిక్స్ బాటిల్స్ తెప్పించా... ఇంకా బియర్ జిన్ లాంటివి కూడా వుంటాయ్ సర్"

"ఒకే ప్రొసీడ్" అన్నా

ఆనందంగా షేక్హాండిచ్చి వెళ్లిపోయాడు సత్తార్....

డైనింగ్ టేబులు దగ్గర టిఫిన్కి కూచున్నా పేపరు తీసుకుని....

శ్యామల వేడిగా పొగలుకక్కుతున్న పులగం అల్లపచ్చడీ చిట్లంపోడీ వెన్న తెచ్చి పెట్టింది....

కూచో అన్నట్టు సైగచేసా....

"కాలేజ్‌కి టైం అవుతోంది" అని కూచుంది...

"సండే సత్తార్ పార్టీ యిస్తున్నాడు ఫ్యామిలీస్ తోటి రమ్మని పిలుస్తున్నాడందర్నీ"

"సండే పిల్లలకి స్పెషల్ క్లాసు...తీసు....సర్లెండి మనం కూడా బైటికెళ్లి చాల్రోజులైంది కదా... అయ్‌విల్ క్యాన్సిల్డ క్లాస్ ....అమ్మా?"

నాకు తెలుసు మా ముసలి మంత్రగత్తె బైటికొచ్చిందంటే చాలచాల డిగ్నిఫైడ్‌గా బిహేవ్ చేస్తుంది...

"ఆవిడిష్టం....యిష్టమైతే రమ్మను" అన్నా

తలవూపుతూ వెళ్లింది శ్యామల...మొహం సీరియస్గా వుంది....

తల డై చేసుకున్నట్టుంది....నదుటికి డై మచ్చలు మచ్చలుగా అతుక్కునుంది... మొహానికేదో రాసుకునుంది.... ఏదో ట్రాన్స్‌పరెంట్ ఫేస్ ప్యాక్‌లావుంది...ఎన్ని మాయలు చేసి వయసుని దాచగలం?

నేను పులగంమీద వెన్న వేసుకుని అల్లప్పచ్చడి అద్దుకుని తింటున్నా....మా సుపుత్రుడి గదిలోంచీ చిన్నగా వాగ్వివాదం వినబడుతోంది...

శ్యామల వాడినేదో తీవ్రంగా మందలిస్తోంది...

వాడూ అంతే తీవ్రతతో సమాధానం చెబుతున్నాడు.

నా పులగం అయిపోయేంతలో... స్వరాల స్థాయి పెరిగింది....

"యూ డిడ్" అని శ్యామల పెద్దగా అరిచింది.....

సింక్ లో చెయ్యి కడుక్కొని వచ్చేంతలో..... శ్యామల కందిపోయిన మొహంతో ఏడుస్తూ వచ్చి డైనింగ్ టేబిల్మీద తలవాల్చికూచుంది....

మా సుపుత్రులుంగారు గదిలోంచి బైటకు రాలేదు....

శ్యామల వెక్కివెక్కి ఏడుస్తోంది....

దగ్గరికెళ్లి ""ఏమైంది?" అడిగా....

చెప్పాలా! వద్దా! అన్నట్టు సంశయిస్తూ..... "ఏమీ లేదులెండి" అని లోపలికి వెళ్లిపోయింది.

ఏదో వెధవ పన్చేసుంటాడా వెధవ అనుకొని నా రోజు వారీ ముసుగులో దూరడానికి నాగదిలోకెళ్లా.....

వాడికి ఇరవై రెండేళ్లు.....

స్నేహితులు చాలా మందే వున్నారు.... అందులో సత్తార్ కొడుక్కూడా....వాడు ఎంసీయే చేస్తున్నాడు.

మావాడు ఐటీలో యింకా చదవడానికి స్టేట్స్‌కు వెళ్లడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. ఈ కాలం యువకులకుండాల్సిన లక్షణాలన్నీ లక్షణంగా వున్నాయి... వాడు తాగొచ్చుంటాడు కొంపకి.

దాని గురించే గొడవ పడ్తోంటుంది శ్యామల.

ఊహించినట్టుగానే గదిలోకొచ్చింది శ్యామల......

చెప్పు అన్నట్టు చూసా.....

కాసేపు మౌనం వహించి యిక తప్పదన్నట్టు చెప్పింది....

"వాడు ఈ మధ్య తాగుతున్నాడు...రాత్రి హీ కేమ్ హోమ్ ఇనఫడల్డ్‌స్టేట్....

ఎవరు చెప్పాలి? వాడికి ఎవరన్నా లక్ష్యంలేకుండా వుంది" శ్యామల

"చూడు శ్యామలా వాడిప్పుడు పసివాడుకాదు.... అదీకాక అక్కడా యిక్కడా జాబ్ వర్క్ చేసుకుంటూ వాడి డబ్బు వాడు సంపాదించుకుంటున్నాడు...నా మీద వాడికెంత గౌరవం వుందో నాకు నీకు తెల్సు.....ఇక ఎవరైనా ఏమైనా చెప్పగల్రంటే అది మీ అమ్మవొక్కతే.... అయినా ఈ రోజుల్లో తాగడమేం పెద్ద నేరంకాదే?" అన్నాను....

"నిజమే లెండి....మీరంతకన్నా ఏం చెబుతారు మీ కొడుకే కదావాడు మీ లక్షణాలే వచ్చాయి" నిష్ఠూరంగా అంది.

నిజమే నేనూ నా తండ్రిని లక్ష్యపెట్టలేదు వాడూ వాడి తండ్రిని లక్ష్యపెట్టట్లేదు. నేనూ ఆ వయసుకే తాగడం మొదలుపెట్టాను వాడూ అంతే....పైగా వాడు ఖర్చు పెట్టడానికి మాత్రమే అయిన సంపాదనుంది...సుమారు నెలకు ఎనిమిది, పదివేల రూపాయలు సంపాదిస్తాడు...ఆప్టెక్‌లోనే ఇన్‌స్ట్రక్టరుగా వున్నందుకు అయిదు వేలిస్తారు.....

"చూడు శ్యామలా తల్లిగా బాధపడ్డం నీకు సహజమే కానీ చేసేదేమీలేదన్న సత్యాన్ని నువ్వు గ్రహించాలి..... చేయగలిగిందేమైనా వుంటే అది మీ అమ్మతో వాడికి నచ్చచెప్పించడం" అన్నాను....

నిరాశగా నిస్పృహగా నిట్టూర్చి లేచింది వెళ్తూవెళ్తూ

"అయ్‌ఈవెన్ సస్పెక్ట్ దట్ హీస్టార్టెడ్ విమనైజింగ్" అని వెళ్లిపోయింది....

వయసు! దాన్నదుపు చేయడమెవరితరం...?

* * *

ఆదివారం ఉదయాన్నే ఎనిమిదింటికంతా బయల్దేరాం, బ్రేక్‌ఫాస్ట్ కూడా తోటలోనే అని రాత్రే సత్తార్ చెప్పేసాడు...

నేను వాహనచోదకుణ్ణి, వెనకాల శ్యామల, మంధర కూచున్నారు, మా సుపుత్రుడు, సత్తార్ కొడుకూ బైక్‌లమీద........

పదిహేనెకరాల మామిడితోట సత్తార్ది...మంచి గెస్ట్‌హౌస్ కట్టించాడు అన్ని హంగులతో....

నాలుగైదు రకాల టిఫిన్లు చేయించాడు....

హాహాలూ హిహ్హిలూ నమస్తేలూ అయింతర్వాత ఎవరికి వారుగా జట్లుగా విడిపోయారు...

పదిన్నరాప్రాంతానికి గెస్ట్‌హౌస్ ఏసీగదిలో నేనూ, డీఈ, పీఎ, సత్తార్ ఇంకో ముగ్గురం సెటిల్ అయ్యాం.....

పేక మొదలు పెట్టాం...పాయింట్ పదిరూపాయలుగా రమ్మీ...

కాగితాలు చుట్టుకుని శ్రీ మహాలక్ష్మి మా మధ్య అటూ యిటూ గెంతుతోంది...

డ్రింక్స్ సర్వ్ చేయడానికి ఓ కుర్రాణ్ణి పెట్టాడు సత్తార్...

సత్తార్ అందర్నీ రిక్వెస్ట్ చేస్తూనే వున్నాడు...

“సార్ సార్ స్లోగా తీసుకోండి భోజనాల తర్వాత మనిష్టం” అంటూ......

షివాస్‌రీగల్ రీగల్‌గా గొంతు దిగుతోంది...

పన్నెండున్నరా ఒంటిగంట ప్రాంతానికి పేక బంద్ అన్నారు.

ఓ ఆరువేలు బొక్క...

నిర్లక్ష్యంగా మిగిల్న డబ్బున్న బ్యాగ్ని విసిరి టేబిల్మీద పారేసా.....

ఆరు పెగ్గులు తలలో గింగిరాలు పెడ్తున్నాయి....

“సార్ పాటలు బాగా పాడ్తారు” ఎవరో అంటున్నారు....

మందు సభ్యాసభ్యతల్ని భయాందోళనల్నీ తరిమేస్తుందికదా...

డీఈ రంగయ్య నా భుజమ్మీద చెయ్యేసి

“సార్ మాంచి పాటందుకోండి సార్ మళ్లీ ఎప్పుడో మనం యిట్లా కలిసేది” అన్నాడు....

మిగిల్న వాళ్లందరూ తందానా అన్నారు...

సత్తార్ కాస్త భయంగా చూస్తున్నట్టనిపించింది...

నాకూ హుషారొచ్చింది

“ఆఁ” అని గొంతు సర్దుకున్నా....

మధుమతిలో రఫీపాట 'ఝూటేహువెఖ్యాబోఁనే' అందుకున్నా....

విస్కీ గొంతును పట్టేసింది...

నాలుక మీద నా కంట్రోల్ పోయింది....

"అదొద్దుసార్ కొంచెం హుషారైన పాటపాడండి సార్" ఎవరన్నారో తెలీదు జంగ్లీపాట అందుకున్నా....'చాహెకొయిముఝె జంగ్లీ కహే'

ఎవరో దానికి గెంతడం మొదలుపెట్టారు....

నేనూ గెంతడం మొదలుపెట్టా....

గెస్ట్‌హౌస్ యింకో గదిలోంచి పెద్ద సౌండ్‌తో పాప్ వినబడ్తోంది....

జంగ్లీపాట ఆగిపోయింది...

ఎవరో ఆ పాప్ మ్యూజిక్కి గెంతడం మొదలుపెట్టారు....

నేనూ నడ్డి వూపసాగా....

కొద్దికొద్దిగా తెలుస్తోంది...చాలా తెలియట్లేదు...

ఏసీ గదిలోంచీ హాల్లోకి....

హాల్లోంచి పోర్టికోలోకి....

పోర్టికోలోంచి తోటలోకి

తోటలో గుంపులు గుంపులుగా వున్న ఆడవాళ్లు మమ్మల్ని చూసి నువ్వుతున్నట్టనిపించింది...

మనుషుల్ని గుర్తించడం కష్టమవుతోంది...

ఎవరో వచ్చి పళ్లెం చేతికందంచారు...

ఖాళీపళ్లెం...

బఫె...

అక్కడేమేమున్నాయో తెలీట్లేదు...

"సత్తార్" అరిచా....

భయంగా, వినయంగా వచ్చాడు సత్తార్

"అప్పుడే భోయినం ఏంటండీ ఇంకో రౌండ్ వేయండి" ముద్దముద్దగా అరిచా....

నా పక్కనచేరి నా ఎడమ చేయి లాగుతున్నారెవరో....

చూసా....శ్యామల...

"చాలు చాలు అందరూ మిమ్మల్నే చూస్తున్నారు నేను పెట్టుకొస్తా తినేయండి ఆ కార్నర్‌లో కూచోండి" రహస్యంగా అంది....

"సార్ యిప్పటికే ఆరు పెగ్స్ తీసుకున్నార్సార్" సత్తార్.

శ్యామల చేయి విదిలించా.....

"నో అయ్‌వాంట్ వన్‌మోర్" గట్టిగా అరిచా...

చుట్టూ ఒక్కసారిగా నిశ్శబ్దం....

"ఏయ్ బాలయ్యా బాలసుబ్బా రా.... యింకో లార్జ్ తీసుకురా" మళ్లీ అరిచా....

బాలసుబ్రహ్మణ్యం గెస్ట్‌హౌస్లోకెళ్లి గ్లాసుతో వచ్చాడు...

"వద్దండీ ఇవ్వకండి" బతిమాల్తోంది శ్యామల...

"కాదు మ్యాడమ్ ఇప్పుడివ్వకపోతే సారు యింకా గొడవ చేస్తారు మీకు తెలీదు" అని గ్లాసు నా చేతిలో పెట్టాడు..

ఎత్తి ఒక్కసారి తాగేసా....సగం చొక్కామీద పడింది....నేను వెళ్లి చికెన్ కూర్మా మీద పడ్డాను... అంతే.

❋ ❋ ❋

మెలకువ....

తల దిమ్ముగా వుంది....తలతడుముకోబోయా....

కట్టు....

తలకి దెబ్బతగిలిందా?

రివైండ్...రివైండ్....

మసక మసక జ్ఞాపకాలు...

లీలగా మనుషుల బొమ్మలు...

ఎక్కడున్నా నేనూ?

నా గదిలోనేనా?

నాలుక నోటినిండా వుంది....

దాహంగా వుంది...

లేవబోయా....

చేతకావట్లేదు...

చుట్టూ ఎవరూలేరు ఎందుకని?
కళ్లు చిట్లించి చూసా...నాగదే....
తలుపులు చేరవేసి వున్నాయి.....
చిన్నగా లేచా....కాళ్లు సహకరించట్లేదు...
'సిగరెట్ మానేయ్' ఉమానాథ్...
ఏదో రోగం...పేరు గుర్తులేదు...
కాళ్లు నరికేయాలి...
ఎక్కడున్నాయి నాకాళ్లు?
కిందికి చూసుకున్నా....
ఎడమ పాదానికీ ఓ కట్టు.....
పడ్డానా? ఎక్కడ? సత్తార్ తోటలో....పార్టీలో...?ఏమో గుర్తురావట్లేదు
ఈ రోజు ఏం తారీఖు...అసలిది పగలా?రాత్రా?
ఎవరక్కడ? రాజావారిలాగా పెద్ద గాంగ్ మోగించాలి...

గాంగ్ బాంగ్ యంగ్ లిబిడో ఎసెక్సువల్, ఫోర్స్డ్ స్ప్లిట్, ప్రైమరీ ఎనర్జీ...అలర్జీ... ఫ్రాయిడంటే అలర్జీ... అంతర్ముఖం... ఎక్స్ట్రావర్డ్, సామూహిక, అంతశ్చేతన.... అసలు చేతనే లేదే.. చేతేదో లేదు....ఏదో చేతకాదు...కాదుకాదు ఏదో చేతవుండి ఏదీ చేతకాదు... అదిఏది...ఏదో అది...అదియిది అని అన్నిరంగములా మగధీరులనే ఎదిరించారు..లేచింది.. ఆహాహా లేచింది..లేచింది... లేచి లేచి...చింది... చింది చుక్కల చుక్కల చారికలై... లైలా.... లాలాలా...

తలుపు తెరుచుకుంది...
చిన్నగా తెరుచుకుంది...లోపలి తలుపు తెర్చుకోదుగాక తెర్చుకోదు
వెల్తురు చారిక....మధ్యన శ్యామలనీడ...
"లేచారా?"
"ఏమైందినాకు?" అడిగా....
"ఏం కావాలి...తీసుకెళ్లి నలుగుర్లో నవ్వులపాలు చేసారు....
ఛిఛీ బజారు మనుషుల్లా...తలెత్తుకుని కాలేజికి ఎలా వెళ్లాలి....
"ఏమైందో చెప్పేడుముందు" అరిచాననుకున్నా గొంతు పెగలట్లేదు...
"ఏం చెప్పమంటారు....చేసింది మీకు గుర్తులేదా? మమ్మల్ని కావాలనే

ఆపార్టీకి తీసుకెళ్లారు మీరు....చాలా మర్యాద చేసారు చాలండీ చాలు... ఇక జీవితంలో మీతో ఎక్కడికీ రాము... అంతమంది తాగారే మీతో పాటు.. వాళ్లందరూ మీలా పీకల్దాకా తాగారా? చాలుచాలూ అని గొంతుపీక్కు ఛస్తున్నా...అయినా ఎప్పుడు విన్నారని నా మాట....ఇలా చిత్రహింసల పాలు చేయడం కంటే ఒక్కసారి చంపేయండి మమ్మల్ని ఛీఛీఛీ"

"స్టాపిట్... చాలు చాలు.... హెల్ప్‌మి టు క్లీన్ మై సెల్ఫ్.... బాత్రూంకి తీసుకు వెళ్లు"

చెయ్యిపట్టుకుని విసురుగా బాత్రూంలోకి లాక్కెళ్లింది....

కాళ్లు...కాళ్లు

రాళ్లు...రాళ్లు

ఆంప్యుటేషన్...

నరికేస్తారు...

కుంటింజనీరు...

వీల్చేరు..

మలమూత్రాలు....

సిగరెట్‌కావాలి...

'యూ లుక్‌లైకె వాకింగ్ చిమ్నీ' ఉమానాథ్....

ఉమానాథ్...ప్లీజ్ కం అండ్ కిల్మీ...

మెర్సీ కిలింగ్...

యూథనేషా....

"గెట్మీ మై సిగరెట్ ప్యాక్" అడిగా శ్యామల్ని

"నో....యూ విల్‌నాట్ స్మోక్ అండ్ డ్రింకగేన్"

"నువ్వెవరా మాట చెప్పటానికి యిది నా జీవితం నా యిష్టం....

నువ్వసలు బైటికెళ్లు...పోగెటౌట్" గొంతు బొంగురు పోతోంది...

తలలో ఎవరో నగారాలు మోగిస్తున్నారు...

యుద్ధనగారా అది....

అవునవును...యుద్ధం....

నాతోనేనే యుద్ధం....

ఈ శ్యామల్తోటి యుద్ధం.....

దీనితల్లి ఆ ముసల్దాన్తోటి యుద్ధం....

నాకొడుకనబడే వాడితో యుద్ధం....

నాకాళ్లతోనా యుద్ధం....

సిగరెట్తో....

విస్కీతో....

జీవితంతో....

మనసుతో......

అయ్యో....ఈ యుద్ధవేదన భరించలేకున్నా....

యుద్ధం ప్రారంభంకాకముందే ఓడిపోతున్నానా?

నో...అయ్‌హ్యావ్‌టు కాంకర్‌మైసెల్ఫ్......

నా మీద నేను గెలుపు సాధించాలి....

సాధించి తీరుతా....

నా???

శ్యామల్ని బాత్రూం బైటికి తోయబోయా....

గ్రహించా.....శరీరంలో శక్తి అస్సలు లేదు...అణువణువూ వణవూవణుకుతోంది... నాకు తెలుసు...నాకు సాయంగా ఎవ్వరూ రారు....

నాకు నేనే ఆసరా...

కమాన్ బ్రేసప్ మ్యాన్!

యూకెన్ డూయిట్...బ్రేసప్! బీ బ్రేవ్!

మళ్లీ గదిలోకొచ్చి మంచమ్మీద కూలబడ్డా....

వంగి పక్కన క్యాబినెట్ మీదున్న కార్డ్లెస్ ఫోన్ తీసి బాలసుబ్రహ్మణ్యం నంబరు డయల్చేసా....

పదినిముషాల్లో నాగదిలో ఉంటానన్నాడు బాలసుబ్రహ్మణ్యం......మై పీఏ.

ఏడుస్తూ గదిలోంచి వెళ్లిపోయింది శ్యామల...

ఎవరీ శ్యామల?

నేను దీన్ని ప్రేమించానా?

అది నన్ను ప్రేమించిందా అసలు?

నా అవసరార్థం దీన్ని పెళ్లి చేసుకున్నానా నేను?

లేదు అవసరం మాత్రమేనా? కాదు కాదు....

ఆరోజుల్లో అందంగా కనిపించిందే!

ఇప్పుడేమిటిలా అసహ్యంగా అనాకారిలా... దెయ్యంలా కనబడ్తోంది?

అప్పుడు యవ్వనం...నాకూ దీనికీనూ....

మంచి శరీరసౌష్ఠవంతో వుండేది....

నా ఎమ్మీ అయ్యేంత వరకూ ప్రేమికులమే....

నెకింగ్ పెకింగ్‌లతో సరిపెట్టుకునేట్టు ఒప్పందం...

పెళ్లి తర్వాతే...ఫుల్‌మీల్....

పెళ్లి...!

నాతండ్రి రాలేదు... పెళ్లికి ....పిన్నిని రానివ్వలేదు... చెల్లెళ్ళనూ రానివ్వలేదు.. భార్గవగాడు మాత్రం దొంగతనంగా వచ్చివెళ్లాడు...

పెళ్లి తర్వాత శ్యామల వ్యక్తిగత అలవాట్లు దగ్గర్నించీ చూసే అవకాశం వచ్చింది.....

భోజనం చేసే విషయం.....అసలు శ్యామల తిండితినే పద్ధతి నాకు నచ్చలేదు. చారు కంచంనిండా పోసుకుని సర్రసర్రమని శబ్దాలు చేస్తూ జుర్రుతుంది...

వేళ్లు నోట్లోపెట్టుకుని చీకుతుంది....

"ఏవిటది అసయ్యంగా' అనడిగితే...

'నా కిట్లాగే ఇష్టం....మీ ఇష్టమొచ్చినట్టుమీరు తినండి అంతే... నా పద్ధతి నాది' అనేది...

'మొహం కడుక్కునేప్పుడు పెద్ద శబ్దం చేస్తూ నాలుగ్గీచుకుంటుంది' శరీరాల వ్యామోహం తర్వాత.....

శ్యామల్లో అన్నీ నెగటివ్ విషయాలే నాకు కనిపించసాగాయి...

నాలో తనకూ అంతేనేమో....

ఏమో!

ఇప్పుడుమాత్రం ఇద్దరికిద్దరం పడము....

ఇక్కడ ముసలిముండ గురించి చెప్పాలి....

దాని అలవాట్లు మాత్రం అన్నీ పకడ్బందీనే... చాలా చాలా వ్యక్తిగత శుభ్రత....

మా పెళ్లి జరిగినప్పుడు.......

ఒక వంకర టింకరగాడు అన్నమాట ఇప్పటికీ గర్తుంది....

"నీ పెళ్లాంకంటే మీ అత్త భలేగా వుందిరా" అని

నిజమే అప్పటికి నలభై అయిదేళ్లైనా...పచ్చని వంటిఛాయతో చెదరని శరీర సౌష్ఠవంతో నిజంగా చాలా బాగావుండేది....

ఇప్పటికీ డెబ్బై చిల్లర వయస్సైనా..అందం చెడిపోలేదు....

ఆ చిన్న తలకాయలో మెదడుమాత్రం....ఇంకా ఇంకా వక్రంగా మార్తోంది...

చచ్చే ముందుక్షణం కూడా ఏదో కుతంత్రపుటాలోచన చేస్తూనే చస్తుంది...

తలుపుమీద చప్పుడు....

"సార్" బాలసుబ్రహ్మణ్యం....

ఎప్పట్లానే తెల్లప్యాంటు తెల్లచొక్కా టక్‌చేసి... తలనున్నగా దువ్వి లావుపాటి అద్దాల్తో నున్నగా గోకిన ముఖంతో దొన్నెల్లాంటి చెవుల్తో అదే వినమ్రతతో...కాన్వాస్ షూ బైటవదిలి వచ్చినట్టున్నాడు.....

చేతిలో ఫైళ్ల దస్తా.....

"ఎట్లావుంది సార్?"

"కూచో" అన్నా చేయి నా రీడింగ్ చెయిర్ వైపు చూపించి

"పర్లేదుసా"

విసుగ్గా చూసా అతనివేపు

భూతద్దాల్లోని మిడిగుడ్లలో ఏభావమూలేదు....

"ఇది ఆఫీసుకాదు...కూచో"

కూచున్నాడు చెయిర్‌లో కాదు పక్కనున్న స్టూల్ లాక్కుని కూచున్నాడు.....

మళ్లీ అడిగాడు "ఎలావుంది సార్"

"ఆరోజేం జరిగింది?" అడిగా.....

"పెద్దగా ఏం జరగ లేద్సార్....కొద్దిగా ఎక్కువైంది మీకు.... పడిపోయారు...ఆ పడడం వంట పాత్రలమీద పడ్డారు...దేగిశా అంచుకు తగిలి నుదుటికి గాయం అయ్యింది... రెండు కుట్లు పడ్డాయి... కాలు మెలి తిరిగింది చిటికెన వేలు ఫ్రాక్చర్

అయ్యిందన్నారు ఉమానాథ్‌గారు... కట్టువేసారు... మీకు మెలకువ రాగానే ఫోన్చేయమన్నారు" అన్నాడు బాలసుబ్రహ్మణ్యం...

"ఈ రోజు ఏం వారం?" అడిగా....

"అదేంటిసార్ నిన్ననేకదా పార్టీ?" ఆశ్చర్యంగా అన్నాడు బా.సు.

"హా అయితే సోంవారమన్నమాట...సరే బాలూ నువ్వేమీ అనుకోకపోతే వెళ్లి ఓ మూడుబాటిల్స్ తెచ్చిపెట్టు అలాగే సిగరెట్స్‌కూడా...ముందు నీ సిగరెట్ ప్యాకిలాగివ్వు" అన్నాను...

"ఈ బ్రాండెందుకుసార్ వెళ్లి అయిదు నిముషాల్లో తెస్తాను"

"ముందివ్వవయ్యా" కసిరాను...

భయంభయంగా తీసిచ్చాడు...

సిగరెట్ వెలిగించి ఓ బలమైన దమ్ములాగాను...తల గిర్రున తిరిగింది ఉమానాథ్‌కు ఫోన్చేసా. బా.సు నెమ్మదిగా లేచి బైటికెళ్లిపోయాడు.

"ఎలావుంది" అనడిగాడు...

"నీర్సంగా వుంది" చెప్పా...

"తిండిలేదుకదా...ఏమైనా తిను...పెయిన్ కిల్లర్స్ యాంటిబయోటిక్ ఇచ్చాను. వేసుకో...పెయిన్ కిల్లర్ ఏమైనా తిన్న తర్వాతేసుకో సాయంకాలం వచ్చి చూస్తా...నో స్మోక్ నో డ్రింక్" పెట్టేసాడు...

మందులెక్కడవున్నాయో....

నెమ్మదిగా లేచి తలుపు తెరిచి తొంగిచూసా... డైనింగ్ టేబిల్‌దగ్గర తల్లీ కూతుళ్ళు ఏమో చర్చించుకుంటున్నారు... కాలేజ్‌కి సెలవు పెట్టినట్టుంది నన్నుచూసి లేచొచ్చింది శ్యామల....

"ఉమానాథ్ మందులిచ్చాట్టకదా ఎక్కడున్నై" అడిగా...

"అద్దం ముందు....స్నానం చెయ్యండి ఏమైనా తిందురుగానీ" అందులో ప్రేమా ఆత్మీయత కూడా కనిపించలేదు....నిర్బంధ భావనేదో....

నాకు దీనిమీద ప్రేమేడిచ్చస్తేకదా దీనికి నా మీదుండటానికి.....

లోపలికొచ్చి తలుపు చేరేసా....

తలుపులు....

కనబడని తలుపులు....

కనబడని గోడల మధ్య కనబడని తలుపులు....

వికటపు తలపుల తెరవని తలుపులు

వికటపు తలపుల తలుపుల గడియలు..గడియల తాళాలు తాళాల గుత్తులు... ఏ తాళం చెవీ తెరవని తలుపులు చిక్కులు వీడని వికటపు తలపులు....తలపుల గోడల తలుపులు....

తలపులు మూసిన తలుపుల కానుకొని వీడని తెగని తలపుల్తో నేను.....

కాలింగ్ బెల్ మోగింది...

"నమస్తే మ్యాడం" సత్తార్ గొంతు...

"రండి" ముసల్ది....ఒక్కోసారి ఒక్కోవిధంగా సంబోధిస్తుంది సత్తార్ని

"సార్కెలా వుంది మ్యాడం" సత్తార్.

శ్యామల భోరుమంది....

"ఏం చెప్పమంటారండీ మాబ్రతుకుల్ని నరకం చేస్తున్నా రాయన...మేము చేయలవలసిందంతా చేస్తున్నాం కదా చెప్పండి మీరు...ఆయకేం లోటు చేస్తున్నాం చెప్పండి... మీరు మాత్రం ఏం చేస్తార్లెండి మాకర్మయిలా ఏడిచింది.

డాక్టరుగారు ఆ తాగుడూ స్మోకింగ్ మాని తీరాలని చెబుతూనే వున్నారు. ఆయన చూస్తే యిలా.... ఎదురుగా చూస్తూ ఇరవై నాలుగ్గంటలు ఈ నరకాన్ని ఎలాభరించాలి చెప్పండి" మళ్లీ హో అనేడుపు.....

"మ్యాడం ప్లీజ్ నేను మాట్లాడ్తా సార్తో...అమ్మా మీరు చెప్పండి మ్యాడంకు ఏడ్వవద్దని" వినమ్రంగా సత్తార్......

"నేను మాత్రం ఏమని చెప్పన్నాయనా...నాకున్న ఒక్కగానొక్క కూతురిది... అతనిక్కట్టబెట్టి దీని జీవితాన్ని నాశనం చేసిన్నేను ఎట్లా చెప్పనయ్యా" ముసలిముండ....

వీళ్లబతుకులేం నరకం చేసాన్నేను. నా తాగుడు నేను తాగుతున్నా, నా శారీరక బాధలు నేను పడుతున్నా.... వీళ్లని తాగి తంతున్నానా... తిడుతున్నానా..... ఏమిటి వీళ్లు నానించి పడుతున్న కష్టం.... వీళ్లబాధ ఒక్కటే నా భాగానికొచ్చే డబ్బు పదో పదిహేనో లక్షలు తెచ్చి ఆ దొంగకొడుకు రాజిగాడి యూఎస్ చదువుకివ్వట్లేదు నేను... అది తప్ప నేను వీళ్లని బాధపెట్టడమేమిటి....

అసలీ సత్తార్గాడెవడూ వాడికేకరువుపెట్టి ఏడిచ్చుస్తున్నారీ దొంగముండలు పబ్లిక్ చేస్తున్నారు నా ఆంతరంగికతను......డర్టీ క్రీచర్స్.....

"సార్ లేచారా మ్యాడం" సత్తారడుగుతున్నారు...

"బాత్రూంలో వున్నట్టున్నారు.... కాఫీ తాగండి అంతలోపల రెడీ అవుతారు" శ్యామల....

"ఆ హోమియో మందులేసుకుంటున్నారా మ్యాడం సారు"

"లేదు నేను మరిచిపోయా ఇవ్వడం ఆయనెవరోవచ్చి ఇచ్చివెళ్లారు మొన్న...ఈ చీకాకుల్లో ఏవీ గుర్తుండట్లేదండి"

"నిజమే మ్యాడం"

ఏమిత్రా నిజం బాఢ్ఖావ్ వాళ్ల అసలు చికాకు నీకేం తెలుసురా పిచ్చనాకొడకా.....

ఇక వినే  ఓపిక లేక బాత్రూంలో దూరి షవర్కింద నించున్నా... తల తడిసింతర్వాత గుర్తొచ్చింది తలకుగాయమైంది కుట్లు కూడా వేసారని....తలపక్కకు లాక్కొని ఒళ్లు కడుక్కున్నా ...బ్రష్చేసి నాలుగ్గీసుకున్నప్పుడు నుదుటిమీద గాయం చుర్రుమంది.... కాలివేళ్ళు చివర్రెండూ కలిపి ప్లాస్టర్ వేసుంది...

బాత్రూంలోంచి బైటికొచ్చేసరికి బాలు వచ్చివున్నాడు....

"బాలూ మళ్లీ బైటికెళ్లాలయ్యా" అన్నాను....

"చెప్పండ్సర్" అన్నాడు..

"తలకట్టు తడిసిపోయింది...వెళ్లి డ్రెసింగ్ కొనుక్కురావాలి" అన్నాను.... ఇంతలో సత్తార్ లోపలికొచ్చి

"నమస్తేసార్...సారీసర్ పార్టీకి పిలవకుండావుంటే యిలా జరిగుండేదికాదు" అన్నాడు...

"ఫర్గెటిట్...బాలూ నువ్వెళ్లు" అన్నా...

"మ్యాడం వాళ్లు చాలా అప్సెట్ అయివున్నార్సార్.....చాలా బాధపడ్తున్నారు"

"ఏం చేయమంటారు...మీరు కూడా నాకు బుద్ధిచెబుతారా?" సీరియస్గా అడిగా....

"ఛఛ మీకు చెప్పేంతటి వాణ్ణా సార్ నేను ...జస్ట్ వూరికే" తడబడ్డాడు

"ఒకే ఓకే నేను సారీ చెప్పాలి పార్టీ నానించీ చెడిపోయినందుకు" అన్నా

"అబ్బే పార్టీ మీకంటే ఎక్కువేం కాద్సర్" దొంగనా కొడుకు..... వీడు వీడి

వినయం... ఇప్పుడుకూడా పరామర్శకొచ్చింది హాస్పిటల్ సూపర్ స్పెషాలిటి బ్లాకు బిల్డింగ్ కాంట్రాక్టు గురించి...నాకు తెలీదనుకుంటున్నాడు.

"ఓ టెన్డేస్ రెస్ట్ తీసుకోండి సార్... మా స్టాఫ్ కుర్రాణ్ణి యిక్కడే పెడతా ఆ టెన్డేస్ మీకేం కావాలన్నా చూసుకుంటాడు" మస్కామస్కా

"థ్యాంక్యూ అంతవసరమొస్తే నేనే చెబుతానులెండి.... బాలువున్నాడు కదా"

బాలు వచ్చాడు...అతన్తోపాటు యిద్దరు దొంగలు...ము.ముం. శ్యామల...

"అయ్యో కట్టంతా తడిపేసారు కదండీ పస్ఫాం అవుతే" అంటూ ఓ ప్రేమ నటిస్తూ కట్టువిప్పి నుదుటిగాయం క్లీన్చేసి....బాలు తెచ్చిన డ్రెసింగ్ ప్యాడ్పెట్టి కట్టులేకుండా ప్లాస్టర్ వేసింది శ్యామల....

ఆమె చెయ్యి తగుల్తోంటే గాయంమంట ఎక్కువైనట్టుంది.

"ఏమైనా తింటారా? భోజనం? దోసె వేసినా తిని ట్యాబ్లెట్స్ వేసుకోండి" వహ్వా ఏం ప్రేమ ఏంప్రేమా.....

"ఓ అరగంటాగి దోసెలు వెయ్యి బాలుకీ సత్తార్కీ కూడా అన్నా....అచ్చం ఇంటి అధికారిలా నటిస్తూ.....

తలూపి వెళ్లిపోయింది.... తోకలా ము. ముం...

వాళ్లు బైటికెళ్లగానే

"బాలూ తలుపుగొళ్లెం వేసేయ్... వేసి ఆ గ్లాసులు తియ్యి" అన్నా...

"ఇంకా పదకొండున్నరే అప్పుడే ఎందుకుసార్ అదీగాక నేను కమీషనర్ని కలవాలి.... అపార్ట్మెంట్స్ ప్రపోజల్ తెల్సుకదా... ఆల్యాండ్ చిన్న డిస్ప్యూట్లో ఇరుక్కుంది... అందుకనీ..." సత్తార్ ఏదో చెప్పబోయాడు.

"సర్లెండి అవన్ని ఎప్పుడూ వున్నవే...బాలూ గ్లాసులుతీ"

రెండు గ్లాసులు నీళ్లు టీపాయి మీదుంచాడు బాలు...

"నువ్వూ ఓ గ్లాసు తీసుకో" ఆర్డర్....

"ఆఫీ...?" సంశయిస్తూ బాలు...

"నేనిక్కడుంటే నీకక్కడేం పని...ఫోనుంది యిక్కడికే ఫోన్చేయమని చెప్పు ఆఫీసులో... గ్లాసైచ్చుక్కూచో" ఆర్డర్ ఫినిష్

"ముందు ఫైల్స్ సంతకాలు పెట్టేయండి సర్....తర్వాత చూడ్డం కష్టం" అని ఫైల్స్ దస్తావిప్పి సంతకాలు పెట్టించుకుని ఆదస్తా మళ్లీ భద్రంగా కట్టి ఆఫీసుకి

ఫోన్చేసి సూపరింటెండెంట్‌ని ఇక్కడికి ఫోన్చేయమన్చెప్పి గ్లాసు తెచ్చుకుని కూచున్నాడు బాలు...

దటీజ్ పీఏ బాలసుబ్రహ్మణ్యం...

సత్తార్ ఎలాగూ కులం చెడ్డాడు కాబట్టి ఫలం దక్కించుకోడానికి సిద్ధపడ్డాడు. విషయం డైరెక్ట్‌గా ప్రస్తావించాడు...

"సార్ హాస్పిటల్ టెండర్స్ ఎప్పుడ్సార్"

"నెక్స్ట్ మంతేసార్" బాలు చెప్పాడు....

డీల్ కుదుర్చుకున్నాం...

రెండేసి పెగ్గులు తాగి మూడేసి దోసెల్తిని....బాలూ సత్తార్ వెళ్లిపోయారు. బాలూ ఫైళ్లు తీసుకుని వెళ్తూ 'సాయంకాలం వస్తాన్సర్" అని వెళ్లాడు...

వాడు తెచ్చిన మందుకు నేడబ్బివ్వలే...ఇవ్వనుకూడా........

వ్యవస్థీకృత అవినీతి...

* * *

రోజులు గడుస్తున్నాయి....

ఏదో తెలియని అశాంతి

ఏమో తెలియని అసంతృప్తి

ఒక విధమైన నిర్లిప్తత

ఎందుకు బ్రతికున్నావో తెలియదు

ముందు ముందు జీవితంలో నాకోసం యింకేమీ మిగల్లేదు అన్న ఓ స్థిర నిర్ణయం.....

స్నేహంతో కూడిన ఓ మాట కావాలి...

అలసిపోతూన్న మనసుకో సాంత్వనకావాలి...

నిస్సారంగా....నిర్వీర్యంగా....నిస్తేజంగా కనబడుతోంది జీవితం...

శరీరానికైన గాయాలు మానాయి...

మనసునిండా కనిపించని గాయాలు...

ఓ రోజు సాయంకాలం....

నా మామూలు సంధ్యావందన కార్యక్రమం మొదలు పెట్టబోతున్నాను...

శ్యామల ముసల్ది యిద్దరూ గదిలోకొచ్చారు...

ఏదో ప్లానేసుకునేవచ్చారన్నది తెలిసిపోతోంది...

శ్యామలమొహం పారదర్శకం...

కానీ ముసల్దో...అమ్మో అసలు ఏభావమూ కనిపించనీయదు బయటికి....

వాళ్ళు గొంతులు సర్దుకొనే లోపలే అన్నాను.

"చెప్పండి ఏమిటి విషయం?"

"రాజయ్యకి యూఎస్‌లో చదువుకునేందుకు అన్నీ సిద్ధం అయిపోయాయి నాయినా నువ్వు వాడి అకౌంట్లో ఓ పన్నెండు లక్షలువేస్తే వాడు మనల్ని యింకేమీ అడక్కుండా చదువుపూర్తి చేసుకుంటాడు...అక్కడే సెటిల్ అయిపోతానని కూడా అంటున్నాడు... ఎలాగు మీరు రిటైరైపోయింతర్వాత అందరం కలిసి మనం కూడా యూ.ఎస్.వెళ్లిపోవచ్చు"

ఈ ముసల్ది యింకా ఎన్నేళ్లు బ్రతకాలను కుంటుందో అర్ధమయిఛావదు...

నేను రిటైర్ కావడానికింకా ఆరేళ్లుంది... దీనికిప్పటికే డెభైమూడో డెభైఅయిదో

"అవునండీ అన్నీ క్లియరైపోయాయి" మైవైఫ్ శ్యామలా దేవిగారు...

"ఎప్పటిక్కావాలి డబ్బు?" అడిగా...

"ఎంత త్వరగా సాధ్యపడితే అంతత్వరగా... మీ తమ్ముడికో మాటు ఫోను చెయ్యి నాయినా" ముసలిముండ

"డబ్బు కావాలని అడిగారు అంతవరకే...నేనెట్లా తెస్తానూ అన్నది నేను నిర్ణయించుకునే విషయం.... ఎవ్వరి ప్రమేయమూ అఖ్ఖర్లేదు....ఒక్క వారంలో యిచ్చేస్తా"

గ్లాసులో మందు పోసుకుంటూ అన్నా....

"అదేం నాయినా అంత కరకుగా మాట్లాడతావు...నేను కాని విషయం ఏం మాట్లాడాను మనకెప్పటికైనా రావాల్సినదేకదా.... అందునా పెద్దయనకూడా కాలం చేసారు మాట్లాడవేమే " శ్యామల్ని మోచేత్తో పొడుస్తూ అంది...

శ్యామల నా ముఖంలోకి చూసి..."పదవే అమ్మా...తెచ్చిస్తా అన్చెప్పారుగా ఆయన" అని ముసల్దాన్ని చెయ్యి పట్టుకు బైటికి తీసుకెళ్లింది....

ఆశ్చర్యమేసింది...

శ్యామలలో మార్పొచ్చిందా?

మార్పా నాబొందా....వీడు మారడు అన్న నిర్ణయానికొచ్చేసుంటుందంతే..

చెప్పినట్టుగానే ఓ వారంలో డబ్బు సిద్ధంచేసా....

ఉదయం డైనింగ్ టేబిలుముందు టిఫిన్కి కూచున్నప్పుడు చెప్పాను...

"డబ్బు సిద్ధంగా వుంది" అని

శ్యామల ఏ భావమూ కనిపించకుండా

"బాబూ" అని పిలిచింది

బయటికొచ్చాడు బాబు...బా...బు

"డ్యాడీ హ్యాజ్ ఆరేంజ్డ్ మనీ ఫర్యూ"

వాడు నావేపు చూసి చూడనట్టు చూసి...తలపక్కకు తిప్పుకొని

"థ్యాం...క్స్.....థ్యాంక్యూ డ్యాడ్"

"కబోర్డ్‌లో బ్రీఫ్ వుంది తెచ్చివ్వు" అన్నా శ్యామల్తో....

వెళ్లి బ్రీఫ్‌తో తిరిగొచ్చి వాడిచేతికిచ్చింది...

"ఎంత?" అనడిగింది.

"మీరే కదా పన్నెండు కావాలన్నారు...పన్నెండున్నా యందులో" అన్నాను....

"ఓహ్ అంత ఒకేసారి ఎందుకులెండి...సరే నే చూసుకుంటాలెండి" అంది శ్యామల.

వాడింకో థ్యాంక్స్ నా మోహాన పారేసి వాడి గదిలో కెళ్లిపోయాడు...

ప్రత్యక్షించిన ముసల్దాని మొహం కళకళలాడిపోతోంది....

వాడు వెళ్లేరోజుకూడ హై లెవెల్ డ్రామానే....

మద్రాసులో వాడి ఫ్లైట్....

తల్లీకూతుళ్లు యిద్దరూ వెళుతున్నారు సెండాఫ్‌కి...నన్నెవ్వరూ రమ్మనీ అనలేదూ... ఒకవేళ రమ్మని పిలిచుండినా వెళ్లుడేవాణ్ణీ కాదు...

సాయంకాలం మద్రాసు మెయిలుకి వెళ్తున్నారు...

ఇంటికి పరిచయస్తుల్ని చిన్నపార్టీకి పిలిచొచ్చారు తల్లీకూతుళ్లు అందరూ పండుగ వాతావరణంలో మునిగిపోయారు....

ఒక్క నేను తప్ప.....

బయల్దేరే ముందు శ్యామల వాణ్ణి గదిలోకి పిలుచుకెళ్లింది...కాసేపటి తర్వాత బైటకొచ్చారిద్దరూ..

శ్యామల కళ్లు తడితేరి వున్నాయి...తల్లి తల్లే కదా...నాకేమీ అన్పించట్లే.... ఎందుకనీ...

హృదయం బదులు బండరాయుందేమో లోపల....
వాడొచ్చినాకాళ్లకి నమస్కరించాడు...వాళ్లమ్మ చెప్పుంటుంది....
“ఒకే ఒకే ఆల్ద బెస్ట్” అన్నాను....
వెళ్లిపోయారు అందరూ
అందరూ వెళ్లిపోయినా ఏ మాత్రం శూన్యం కన్పించలేదు నాకు...
బాలసుబ్రహ్మణం మాత్రం నిలుచుని వున్నాడు...
బాలు మై పీఏ....
వీడికి జీవితంలో సుఖ సంతోషాలున్నాయా?!
వీడికి ఎవర్తోనైనా అనుబంధాలున్నాయా?
వీడికసలు అనుభూతులున్నాయా?
వీడెవర్నైనా ప్రేమించాడా?
వీణ్ణి ఎవరైనా ప్రేమించారా? ప్రేమించగల్రా? ప్రేమిస్తున్నారా?
భార్యా, బిడ్డలూ, అన్నదమ్ములూ,
నాలాగా వీడూ ఒంటరేనా?
ఒంటరే అయి వుంటాడు....
లేకపోతే ఇరవైనాలుగ్గంటలూ ఆఫీసుకే ఎలా అంకితమవుతాడూ?
భూతద్దాల్లోంచీ నన్నే చూస్తున్నాడు...
నన్ను చూస్తున్నాడా? తదుపరి నా స్టేట్‌మెంట్ కోసం చూస్తున్నాడా?
చూసేది నిజమా?
నిజంగా చూసేది వాస్తవమా?
వాడూ, నేనూ నిజంగా వున్నామా...వుండి లేమా?
మామా అస్తిత్వాలని సవాలు చేసే శక్తి ఎవరికుంది?
నన్ను నేను ప్రేమించుకోడం వల్ల నేనెవర్నీ ప్రేమించలేకున్నానా?
అందరూ క్రమేణా దూరం అవుతున్నారు...
దూరం అవుతున్నారా? నేను చేసుకుంటున్నానా?

రెండోదే రైటు...నేను ఒంటరిగా నుంచుని అందర్నీ దూరంగా గెంటేస్తున్నాను..

పోనుపోనూ ఈ ఒంటరితనం నరకంగా పరిణమిస్తుంది...

నరకాన్ని భరించే శక్తి నాకుందా?

శారీరకంగా పూర్తిగా పతనమవుతున్నానన్న వాస్తవం నాకు బాగా తెలిసిపోతోంది....

ఇక మిగిలిన చిల్లర ఏళ్లని నాకు నచ్చినట్టుగానే గడపాలి...

నాపాత తీయని గత స్వప్నలోకాలకు తిరిగి ప్రయాణించాలి....

నా సంగీతం...

నా సాహిత్యం...

నా రంగులు...

యస్ ఆమూడింటి కాక్‌టైల్ మధువు మత్తును హత్తుకోవాలి...

సుబ్రహ్మణ్యం...బాలసుబ్రహ్మణం...బాలు నా వేపే చూస్తున్నాడు..

ఇలారా అన్నట్టు తలూపా...

వచ్చాడు...'సర్' అన్నాడు వినయంగా...

"బాలూ నీవెవర్నైనా ప్రేమించగలవా?" అనడిగి గట్టిగా నవ్వా....

ఏ భావము ద్యోతకం కాని ముఖంతో బాలు....

పోనీ యిచ్చెప్పు "నిన్నెవరైనా ప్రేమిస్తున్నారని నమ్మగలవా?"

"అదేమిట్సార్ పెళ్లాం బిడ్డలున్నారు కదా" బాలు....

"అదే...నేనడుగుతోంది..నువ్వు వాళ్లను ప్రేమిస్తున్నావా... వాళ్లు నిన్ను ప్రేమిస్తున్నట్టు నమ్ముతున్నావా?" మళ్లీ గట్టిగా నవ్వా.....

బాలుకర్థమైంది...

బాలుకు నా వైవాహిక జీవితం చాలా బాగా తెల్సు.... బాగా దగ్గరగా చాలా ఏళ్ళుగా నాతోటే వున్నాడు కాబట్టి...

"సర్ మీరు అడిగిన ప్రశ్నకు నిజంగా జవాబు చెప్పడం చాలా కష్టం సర్ .... నిజానికి ప్రేమంటే ఏమిట్లో సరైన ఎక్స్‌ప్లనేషన్ ఎవ్వరికీ తెలియదు... ఇష్టాన్నే ప్రేమ అని అన్లేం కద సర్.....నిజం చెప్పాలంటే నాకు నా ఇల్లన్నా నా భార్యన్నా నా పిల్లలన్నా పెద్ద అనుబంధం ఏమీలేదు...నా భార్యనూ పిల్లల్నీ సాకి సంతరించాల్సిన సోషల్ ఆబ్లిగేషన్ నాకుంది కాబట్టి సాకి సంతరిస్తున్నా...అంతే...వాళ్లకూ నా పట్ల అంతకంటే పెద్ద అభిప్రాయం వుంటుందని అనుకోను... మీరు ఇప్పుడు నన్ను ఆ

ప్రశ్నేందుకడిగారో నాకు తెల్సు.... చిన్నబాబు స్టేట్స్‌కు వెళ్తుంటే మీకేం పెద్ద బాధగా అనిపించలేదు...బాబు క్కూడా మిమ్మల్నొదిలి వెళ్తున్న బాధ పెద్దగా లేదు..."

బాలు ఇంత లోతుగా ఆలోచించగల్డని నాకు నిజంగా తెలియదు.... నాతోటి మొదటి సారిలా మాట్లాట్టం... బహుశః సత్తార్ పార్టీ తర్వాత కాస్త మానసికంగా కూడా దగ్గరయ్యాడు కాబట్టి కూడా అయ్యుండవచ్చు....

కానీ బాలు ఈ రోజున నా ముందు దిగంబరంగా వున్నాడు...

బాలులో ఏదో తెగింపు చూస్తున్నా....

తెగింపు అన్న పదం సవ్యం కాదు కానీ....బాలులో ఏదో

చైతన్యం కనిపిస్తోంది.....

చైతన్యం కూడా కాదు నిజాయితీ...

యస్ సిన్సియారిటీ....

బాలు కూడా నాలాంటి వ్యక్తే...

అందుకే నాకు దగ్గరగా వున్నాడు..

నేను నా జీవితం బాలూ బాలూ జీవితం ఒక్కలాగున వున్నవే

అని నమ్మకం కలుగుతోంది....

నాలో నాపట్ల తప్ప ఎవ్వరిమీదా ప్రేమలేదు....

తండ్రి తండ్రి సరే....వాడిని ప్రేమించటం కాదుకదా తీవ్రంగా ద్వేషిస్తా....

నా గెలుపును చూడటానికిష్టంలేనట్టు....చచ్చిపోయాడు...

ముసలి ముండ ఆస్తి అడగమంటుందని నే వెళ్లడం మానడం...అట్లా నా గెలుపును నా తండ్రి అనబడే పచ్చులకుదురు ఈశ్వరయ్యకు చూపించడం జరగలేదు...

ఆఖరికి చచ్చేముందన్నా చూపుదాం అనుకుంటే దాదాపు స్పృహలో లేదు.... దుర్మార్గుడు...

తల్లి ఓ మసక జ్ఞాపకం...

పిన్ని పిన్ని సరే....

చెల్లెళ్ళు...ఊహూ....

భార్గవగాడు...వాడి మీదెక్కడో ఏదో మైత్రీభావం....అందుకే నా ఆస్తి రాసిచ్చాను?

లోతుల్లోకెళ్తే వూహూఁలేదు...మైత్రీభావంతో కాదు....

పచ్చలకుదురు ఈశ్వరయ్య ఆస్తి నా ఆస్తిలో కలవడానికి వీల్లేదు....

యస్...పంతం....

అందుకే ఆస్తి వాడికి చాలా ఉదారంగా యిచ్చేసా.....

నా పెళ్లాన్ని ప్రేమించగల్నా.....?

వయసులో వున్నప్పుడు ప్రాకృతిక లాలసతో శ్యామలనబడే స్త్రీ శరీరంతో ఆడుకున్నా.... ఫలితం...పుత్రరత్నం...

వాడా నన్ను బద్ద శత్రువును చూసినట్టు చూస్తాడు...

అసలు నన్నెవరైనా ప్రేమించాలని నాకు కోరికుందా?

వూహూఁ....లేదు...మనుషులంతా ఎవళ్లని వాళ్లు ప్రేమించుకుంటారన్న భావన నాలో తీవ్రంగా వుంది....

నేనూ అంతేకదా....నన్ను నేను నార్సిసిస్టిక్‌గా ప్రేమించుకుంటాను...

అందుకనే అందరూ నాలానే వుంటారని ఖచ్చితంగ నమ్ముతాను....

ఇదుగో సరిగ్గా ఈ భావన తోటే నేను ఒక్కరొక్కరిగా అందరికీ దూరమౌతూ వస్తున్నాను...

చచ్చే సమయానికెలా వుంటానో?

కనీసం ఈ నాభార్యనబడే శ్యామలముండేనా నా పక్కనుంటుందా?

ఎవరేనా నే చనిపోయేముందు నా పక్క నుండీ లాభమేంటి?

అసలు చనిపోటం అంటే ఏమిటీ?

మృత్యు రహస్యం ఎప్పటికైనా ఛేదించబడుతుందా?

మృత్యువును జయించింతర్వాత మనిషి శాశ్వతత్వాన్ని పొందుతాడా?

విల్ హీ లివ్ ఫరెవర్?

చావు లేకపోతే బ్రతుక్కర్థముంటుందా?

బతికీ...బతికీ...చావురాక విసుగెత్తి ఛస్తాడు...

భలే భలే....

ఇప్పుడందరూ డాక్టర్లని నన్ను బతికించండి నన్ను బతికించండని దేబరించినట్టు అప్పుడు...

అయ్యా డాక్టరుగారూ దయచేసి నన్ను చంపండి బాబూ... నాకు చావు ప్రసాదించండని అడుక్కు ఛస్తారేమో....అహ్హహ్హా....

బైటికి నవ్వేసా...

బాలు నిర్వికారంగా నన్నే చూస్తున్నాడు...

ఈ బాలుగాడూ నాలాగే ఆలోచిస్తూంటాడా?

వీడు నా పట్ల యింత ఒబీడియంట్‌గా వుండటానికి కారణమేమిటి?

ఏముందీ నేను తినే గడ్డితో వాడికీ వాటా వుందికదా...ఆ ముడుపుల కోసమే... అంతే

కాకపోతే నే రిటైరయ్యాక కూడా యిలాగే వుండమనూ అంటే వుంటాడా?

నో....

"బాలూ రాత్రి ఏంచేద్దాం? ఆ గదిలో కూచుని కూచుని విసుగెత్తిపోయింది. మన గెస్టౌసుల్లో బాగున్నదాంట్లో దేనికైనా వెళ్దామా?" బాలునడిగా...

"సర్" అన్నాడు...అంటే మీ ఇష్టం సర్ అన్నేనర్థం చేసుకోవాలన్నమాట... చేసుకొన్నా....

"మన మారంపూడి గెస్టౌస్ చాలా ప్లెజెంట్గా వుంటుంది సర్...అరేంజ్ చేయించమంటారా? ఓ గంట ప్రయాణం...ఏఈ ప్రహ్లాద్‌కు ఫోన్చేస్తే అన్నీ అరేంజ్ చేసేస్తాడు... అసలు మీరెప్పుడూ అక్కడ గడపలేద్సర్....నిజంగా చాలా ప్లెజెంట్గా వుంటుంది" బాలు అన్నాడు..

"అవున్నిజమే కదా.....మనమెప్పుడూ అక్కడ స్టే యెందుకు చెయ్యలేదో.... బహుశా దగ్గరే కాబట్టి విజిట్ తర్వాత వెనక్కొచ్చేయడం వల్ల కావచ్చు.... సరే ఆ ఏ ఈ కి ఫోన్చేయ్యి"

క్షణం ఆలస్యం చేయకుండా టకటకా డయల్ చేసాడు బాలు... వీడి బుర్రలో లక్షాతొంబైయారు ఫోన్నెంబర్లు రిజిస్టరై వుంటాయి...

డబ్బు లెక్కలు కూడా....

అన్నీ టకటకా చెప్పేస్తాడు....పాదరసం బుర్ర వీడిది....

వీడి ఆకారానికీ బుర్రకీ అస్సలు లింకు కుదర్దు...

అంటే పాదరసపు బుర్ర వుంటే మనిషి చూట్టానిక్కూడా బాగా వుండాలా?

బాలు ఫోన్లో అరుస్తున్నాడు..

"అవును...సారొక్కరే...నేనుంటాను పక్కన గెస్టౌస్ మొత్తం ఖాళీగా వుంచు... ఆ...ఆ.... అన్నీ అరేంజ్ చేయించు...ఇంకో గంటలో అక్కడ వుంటారు సారు...

వాచ్‌మన్ మాత్రముండాలక్కడ ఇంకెవ్వరూ...అవునవును....సరే సార్ బయల్దేరు తున్నారు"

నా వేపు తిరిగి "రెడీ సార్" అన్నాడు...

లేచి నిలుచున్నా.......

"మన డ్రింక్ బ్రాండ్ తెలుసా ఆ ఏఈ కి?" అడిగా...

"తెలుస్సర్...డ్రైవర్ని పిలవమంటారా? నేనే డ్రైవ్ చెయ్యనా" అడిగాడు. బాలు డ్రైవింగ్ మీద నాకు నమ్మకంలేదన్న సంగతి తెలుసు బాలుకి....నవ్వొచ్చింది "నువ్వే డ్రైవ్ చేద్దువుగానీ నీకీ రోజు ఛాన్సిస్తున్నా" నవ్వుతూ అన్నాను....

బాలు మొహమ్మీద ఆనందం...దిగంబరంగా కనిపించింది...

"నైట్ స్టే అక్కడే ...చెప్పావా ఆ ఏ ఈకి...."

చెప్పానన్నట్టు తలూపాడు బాలు...

రాత్రికి కావాల్సిన లుంగీ టవల్ పేస్టుబ్రష్షు షేవింగ్‌కిట్టూ తీసి ఇంకో ఇస్త్రీ బట్టల జత బ్రీఫ్‌లో ప్యాక్చేసుకొని బయల్దేరా...

పాపం బాగానే డ్రైవ్ చేస్తాడు బాలు.... అయితే నీలుక్కు పోయి.... తలపక్కకు తిప్పకుండా... వెనకసీటుకానుకోకుండా నడుపుతాడు...

గెస్టౌస్ ఓపెనింకి రాడమే మళ్లీ రాలేదు..గార్డెన్ అదీ చాలా బాగా డెవలప్ చేసారు....

కారాగ్గానే ఏ ఈ ప్రహ్లాద్ డోరోపన్చేస్తూ....

"నమస్తే సర్" అన్నాడు వినయంగా....

ఆర్కే లక్ష్మణ్ క్యారికేచర్లా వుంటాడు...నల్లగా పొట్టిగా చాలా భాగం నెరిసిన్జుట్టుతో...

తలూపాను..నమస్తేకి జవాబుగా...

ఏసీ గదిలో డియోడరెంట్ స్ప్రే చేసుంది...ఘాటుగావుంది...

వాచ్‌మన్ బెడ్‌స్ప్రెడ్ టక్ చేస్తున్నవాడు..నీలుక్కుపోయి సెలూట్ చేసాడు...

బాలు బాత్రూం అదీ చెక్ చేసొచ్చాడు...

నేను సోఫాలో రిలాక్స్‌డ్‌గా చేరగిల్లాను...

బాలూ ఏ ఈ బైటికెళ్లి ఏవో రహస్యాలు మాట్లాకుంటున్నారు..

వాచ్‌మన్ చేతులు కట్టుకొని తలుపు పక్కగా నుంచునున్నాడు...

"ఊళ్లోకి ఎంత దూరంరా?" వాణ్ణడిగా....

"అయిదు నిమిషాల్దొరా....పొయిరావల్నాదొరా" భక్తిగా భయంగా వినయంగా అడిగాడు వాడు....

అక్కర్లేదన్నట్టు తలూపాను అడ్డంగా....

వాడు వినయంగా తలూపి మళ్లీ అలాగేనించున్నాడు...

వాడి అస్తిత్వం ఈ గదికి యిర్రిలవెంట్గా వుంది.... వాడి బొమ్మ ఈ గదికి సరిపళ్లేదు...

తెల్లటి బల్లమీద వాలిన ఈగలా వున్నాడు...

తోలాలి...

"వెళ్లు బైటుండు అవసరమైతే పిలుస్తా"

తోలేసా ఈగని..ఈ గది క్యాన్వాస్మీది అసంబద్ధ రంగు మరకని చెరిపేసా...

ఏదో తెలీని తృప్తి...

గది శుభ్రమైనట్టు ఫీలింగ్....

ఇంతకీ ఈ గదిని క్లీన్చేసింది వాడే కదూ....?

ఈ బెడ్మీది లేతనీలపురంగు బెడ్స్ప్రెడ్ వాడి చేతుల్లోనే కదా సవరించబడ్డదీ...

అంతే అంతే...వాళ్లు మాలాంటి వాళ్లని శుభ్రంచేసి మాకు అశుభ్రంగా కనిపిస్తారు....

చేయించుకునేప్పుడు కనిపించరు...

బాలూ ప్రహ్లాద్ యిద్దరూ లోపలికొచ్చారు...

"సార్ రెఫ్రెష్ అయితే ..." ప్రహ్లాద్ వినయంగా...

బాత్రూంలోకెళ్లి మొహం కడుక్కొని లుంగిలోకి మారేంత లోపల టీపాయ్ మీద సరంజామా సర్దేసారు బాలూ ప్రహ్లాద్....

"సార్ ఆ బ్రాండ్ దొరకలేద్సార్ అందుకనీ.....యిదీ..." నసుగుతూ అన్నాడు ప్రహ్లాద్....

మంచి ప్రీమియం బ్రాండే...అయినా నా టెక్కు చూపించాలి కదా...

"ఏమిటి బాలూ నీకు అక్కడే చెప్పా....సర్లే" ఏదో సర్దుకు పోయేవాడిలాగా...

ప్రహ్లాద్ మొహం చిన్నబోయింది...

చిన్నబోదూమరి ...వాడు తెచ్చిన్సరుకు నాసిదేంకాదు ఏ ఎనిమిదొందలో వెయ్యో వుంటుంది....

ఏ ఈ ని నాతో పాటు కూచోమనడగలేను... హోదా....అట్లాగని బాలూని కూచోమందామా అంటే ఏఈగాడి ముందు పీఏతో తాగడం బాగుండదు...ఎలా...?

నా ఆలోచన గ్రహించినట్టు ఏఈ....

“సార్ కొద్దిగా ఇంటికెళ్లి ఇంట్లోవాళ్లకి చెప్పి వస్తాసర్... వచ్చిం తర్వాత రాత్రంతా యిక్కడే వుంటా సర్” అన్నాడు వినయంగా...

కావల్సిన కార్యం...ఈ పొట్టి నల్ల గంధర్వుడే నెరవేర్చాడు....

“ఆఁఆఁ”అన్నా....

మళ్లీ బాలూ ఏఈలు యిద్దరూ బైటికెళ్లారు.....

ఏఈ బాలుకు ఏవో వొప్పగింతలు చెబుతున్నాడు....

కాసేపటికి బాలూ వచ్చాడు...

“రారా గ్లాసుల్లో పోయి...నాలుక పీకుతోంది” అన్నా

“నాకొద్దుసర్ ఏఈ ముందు బావుండదు” సంకోచిస్తూ అన్నాడు బాలు....

“వాడి సిగ్గోసిరి కూచో” గట్టిగా అన్నా....

బాటిలోపన్నేసిరెండు లార్జిలు వేసాడు  బాలు....

సిప్‌చేసి సిగరెట్ వెలిగించా...

గుండెల్నిండా పొగపీల్చా...

పీల్చి వదిలా...

నోట్లోంచీ ముక్కులోంచీ సిగరెట్ పొగలు...

యూ లుక్ లైకె వాకింగ్ చిమ్నీ...ఉమానాథ్.....

టి...ఎ..ఒ...

కాళ్లుండవ్....

కుంటిఈఈ...

కుంటి ఒంటరి ఈ ఈఈ....

చక్రాల కుర్చీ....

తర్వాత?

గ్యాంగ్రీన్......

కుళ్లిన కాళ్ళు....

ఢాం

తల విదిలించి ఆ ఆలోచనల్ని పక్కకి తోసేసా....

ఎదురుగా బాలు భూతద్దాలోంచీ చూస్తున్నాడు...

నేను మ్యాగ్నిఫై అయి కనబడుతూంటానా?....

నేను మ్యాగ్నిఫై అయితే నా రూపమెలా వుంటుంది....

ఫిషై లెన్స్‌తో తీసిన ఫోటోలా వుంటుందేమో!

బాలు సిగరెట్ కాల్చుకోడానికి సంకోచిస్తున్నట్టు అర్థమైంది....

"బాలూ! సిగరెట్ కాల్చుకో" అన్నా

తన బ్రాండ్ సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు బాలు... నా సిగరెట్ ఘాట్ పొగ బాలు ఘాటు సిగరెట్ పొగ.... రూంలో స్ప్రే చేసిన డియోడరెంట్ కలగలిసి యింకో కొత్తవాసన అలుముకుంది గదిలో "ఊఁచెప్పు బాలూ మనం బయల్దేరే ముందు మాట్లాడు కున్నాం చూడు ప్రేమించడం గురించి...నువ్వు నిజంగా నీ భార్యాపిల్లల్ని ప్రేమించగలవా? ప్రేమిస్తున్నావా?" అడిగా....

బాలు కాసేపు మౌనంగా వుండిపోయాడు....

గ్లాసు ఖాళీచేసి.....సిగరెట్ ఆఖరి దమ్ములాగి... యాష్ట్రేలో

నొక్కి...నావేపు నిశితంగా చూస్తూ....

"నిజమే సార్ మనందరం మనల్ని మనం ప్రేమించుకుంటాం... అంటే మన ఎగ్సిస్టెంస్ మనకు ముఖ్యం.... మన ఎగ్సిస్టెంస్‌లో మనకు ఆనందాలూ దుఃఖాలూ రెండూ వుంటాయి....

మనకు ఆనందం కలిగించే సరుకు ఏదైనాసరే... సంగీతమో సాహిత్యమో లేదూ మందుకొట్టడమో... వ్యభిచరించడమో... ఆఖరికి ఖూనీలు చేయడమో మనకు... మన ఎగ్సిస్టెంస్‌లో ఆనందం కలిగిస్తున్నప్పుడు ఆయా వాటిని మనం తప్పని సరిగా ప్రేమిస్తాం....

మనకు సుఖాన్నిచ్చే భార్యైతే ప్రేమిస్తాం.... రోజూ నరకం చూపేదైతే ద్వేషిస్తాం....

అట్లాగే ఏదైనా...కాబట్టి ప్రేమించడమన్నది వుండి తీరుతుంది సర్" కరాఖండిగా తేల్చి చెప్పాడు.....

ఈ బాలు నేనెరిగిన బాలూయేనా...నా పీఏ

బాలసుబ్రహ్మణ్యం యింత ఎనలిటికల్గా మాట్లాడగల్డా...

"బాలూ నువ్వేం చదివావ్?" సిన్సియర్గా అడిగా....

గట్టిగా నవ్వాడు బాలు....బాలసుబ్రహ్మణ్యం...

"నిజం చెప్పమంటారా సర్...అయ్హ్యావె పోస్ట్ గ్రాజేట్ డిగ్రీ యిన్ ఫిలాసొఫీ"

ఒక్కసారి సర్దుకు కూచున్నాను...

"బిఏ సర్టిఫికట్తో క్లర్క్గా జాయినయ్యా సర్.... అప్పటికి ఎమ్మే ఫిలోసఫీలో చేరా... ఉజ్జోగం ముఖ్యం కాబట్టి చేరిపోయా.........

తర్వాత అయిదేళ్లకి ఎమ్మే కరస్పాండెన్స్ కోర్స్ చేసా..." బాలు

"పోని బాలూ యిదేనా చెప్పు నువ్వు సుఖంగా వున్నావా"

"సర్ ఇంగ్లీష్ సేయింగ్ అన్నట్టు If you can't get what you like... you must like what you get అనీ....

నాకు దొరికించే సుఖమనుకోడంలో సుఖముందిసర్"

"మనమిన్ని రోజులిలా ఎందుకు మాట్లాడుకోలేదు బాలూ?"

"సమాధానం లేని ప్రశ్న సర్ అది.....మనకు చాలా చాలా ప్రశ్నలకు సమాధానాలు దొరకవ్....అసంతృప్తితోటే చాలా మంది మరణిస్తుంటారు...మీరు సాహిత్యం బాగా చదివారుకదా...పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథ 'ఇంగువ' చదివారా? ఇంగువ అంటే ఏమిటో అది ఎట్లా తయారు చేస్తారో...లేదూ అది సహజంగా పుడుతుందో.... దాని మూలమేమిటో తెలుసుకోవాలని జీవితాంతం తపించిన వ్యక్తి ఆ ప్రశ్నకి సమాధానం తెలుసుకోకుండానే చనిపోతాడు... చాలా మంచి కథ సర్ అది..."

"బాలూ ఈ క్షణాన నీలో యింకో వ్యక్తిని చూస్తున్నాను బాలూ....

నీ మెదడులో అన్నన్ని అంకెలు ఎలా పదిలంగా వుంటావో అని ఆశ్చర్యపోతూ ఆలోచించిన వ్యక్తిని...ఇప్పుడర్థమవుతోంది నాకు ...అయ్హ్యావ్ మిస్డ్ అలాట్ ఫ్రం యూ బాలూ" నిజాయితీగా అన్నాను....

"జీవితం సర్"

రెండు రౌండ్లైపోయాయి.....

బాలు ఏదో చెప్పడానికి సంశయిస్తున్నాడు... మొహంలో ఆ ఇబ్బంది తెల్సిపోతోంది...

"బాలూ ఏమిటి చెప్పు?"అడిగా.....

"మీతో ఈ విషయం ఎలా ప్రస్తావించాలో తెలీట్లేదు సర్.......వదిలేయండి నేనో హోఫెనవర్ ఊళ్లోకెళ్లిరావాలి...మీరు పర్మిట్చేస్తే....." అన్నాడు

"నేనొక్కణ్ణే అయిపోతానే"

"లేదులెండి సర్ యూవిల్ హావ్ కంపనీ" అని సడ్న్గా లేచి వెళ్లిపోయాడు.

అర్థం కాలేదు...

బాలూ అన్నమాటా.....

బాలూ కూడానూ.......

సిగరెట్ వెలిగించి గదిలోంచీ బైటికొచ్చా.....

మెట్లమీద వాచ్మన్ దిగ్గునలేచి సెలూట్చేసాడు...

దాన్ని నిర్లక్ష్యం చేసి ...లాన్లోకి వెళ్లాను...కార్పెట్ గ్రాస్ కాళ్లకింద మెత్తగా నలుగుతోంది...

దీపం చుట్టూ గడ్డి పురుగులు....

నీళ్లు రాని ఫౌంటేన్....

ఫౌంటేన్?

ఫౌంటేన్హెడ్....ర్యాండ్...వియ్దలవింగ్...లివింగ్...జీవితం...తంత్రం.. కుతంత్రం... మంత్రం...పుష్పమంత్రం....మంత్రపుష్పం... పుష్పం? శష్పం....... సుసరభేత్..... కామనిలయాఘూటరోమాటవీ సముత్పాటనా పరిపాటికై పాటల గంధులు దీనిని పాటింతురు... వీధి... వీధివీధికో వీధి... వీధి... అంతర్వేది... పాయలైచీలిన్నది మజ్జన దీవి...మజ్జనదీవి....నిమజ్జన దీవి...నిమజ్జన....మజ్జారే...రేరే...రాణి... మత్తు పరిమళం....నిమ్మళం...సమ్మేళనం,...సమ్మేళన సమ్మోహం...మోహం...దాహం నేహం... మేహం...హం..మనమే...మేమే అని మనమే అనుకునే మేకల గుంపుల మేమే... ఫ్లవర్ ఫైర్బాల్.... గుండ్రటి అగ్గిబంతి... నాముంగిలి తోట కుంపట్లో... కుంపట్లో వికసించే అగ్గిబంతి బంతిఅగ్గి.... అగ్గి....అగ్గిబంతుల ఇంతులబంతుల్లో అగ్గి కూపోదకం వటచ్ఛాయా తాంబూలం తరుణీకుచం శీతకాలేభవేద్యుష్ణం ఉష్ణకాలేతుశీతలం..... మర్మరాల ఢిల్లీబాబు... తాపీగా తాపీరాసిన వ్యాసాలు.. సాలుసరిచందా.... విందారగించొద్దా..... వద్దారే...దొరే దొరే... దొర దొరే.... దొరాదొరా! దొరే...దొర...దొర...దొరా.........

మెలకువలోని సుషుప్తిలోంచీ మెలకువ

“దొరా! దొరా!” అని వాచ్మెన్ పిలుస్తున్నాడు...

“ఏరా?” అరిచినట్టుగా అడిగా...

“ఫోన్దొరా...” భయంగా అన్నాడు వాడు...

తలూపి....మళ్లీ గెస్టౌస్లోకెళ్లా....

ఫోన్తీయంగానే ప్రహ్లాద్.......

“నమస్తే సార్ రావడం యింకొద్దిగా ఆలస్యమవుతుంది సార్...పిఏసారు మీకు చెప్పుంటార్సార్.... టైంపాస్ చేస్తూండండి సార్....నేనుతొందర్గా వచ్చేస్తా ఎక్స్ట్రీంలీ సారీ సర్...”అన్నాడు..

బాలు నాకేం చెప్పలేదే....

“బాలు లేడయ్యా యిక్కడ” అన్నా...

“సార్ కూడా త్వరగా వచ్చేస్తార్సార్....” అని ఫోన్ కట్చేసేసాడు....

మండింది....

“రేయ్ యిట్రారా” అని వాచ్మెన్ని కేకేసా....

క్షణంలో నాపక్కనున్నాడు వాడు...

“లోపల ఆ టీపాయ్ కుర్చీలు లాన్లోవెయ్యి” హుకుమ్నామా చదివా...

రెణ్ణిమిషాల్లో అన్నీ బైట సర్దేసాడువాడు...సర్దేసి....

“దొరా....మీకు సిగరెట్లు తెమ్మని సారు చెప్పినాడు....పోయొద్దునా?” అడిగాడు...

“ఆఁ” అన్నా...

క్షణంలో వాడు సైకిల్మీద మాయం.....

అంత పెద్ద గెస్టౌస్ ముందు లాన్లో నేనొక్కణ్ణే......

విచిత్రమైన నిశ్శబ్దం...

పైకి తలెత్తి చూసా....

చీకటి ఆకాశం...చుక్కలు...

మఖ్మల్ మీద ఎవ్వరో నిర్లక్ష్యంగా చల్లిన రవ్వల్లా....

మనసు రోమాంటిసైజ్ అవుతోంది....

బావుంది...ఈ ఏకాంతం...ఈ చీకటి ఆకాశం...రెండురౌండ్ల మత్తూ.... కాలికింద మెత్తగా ఆకుపచ్చగా వొదుగుతూన్న కార్పెట్ గడ్డి....

"నమెస్తే సార్" ఆడగొంతు....

ఉలికిపడి అటూయిటూ చూసా....

క్రోటన్స్ పక్కనుంచీ ఓ స్త్రీ ఆకారం...

తెల్లగా లావుగా...

"నమస్తే సార్" ఎదుటికొచ్చి మళ్లీ అంది...

"నువ్వు...? మీరూ?...."

"నేన్సార్ సరోజని....సర్కిల్ ఆఫీస్లో టైపిస్ట్ని..." కొద్దిగా బొంగురుగా వున్న గొంతుతో అంది....

లీలగా గుర్తొచ్చింది...

"యిక్కడా?!..."

"మీరొచ్చినారన్తెల్సి వచ్చాసార్....మ్యాడం బాగున్నారా?"

ఏకాంతం...! కంపెనీ...! బాలు...! ప్రహ్లాద్....టైంపాస్....! చిన్నగా అర్థమవుతోంది...

కోపం రావట్లేదు...

ఏదో ఎక్సైటెడ్ ఫీలింగ్.......

కల్యాణమల్లుడు....కామ్గా.....నా పుస్తకాల బీరువాలోంచీ మారంపూడి ఆరండ్బీ గస్టౌస్ గార్డెన్లోకి...

"ఆc....ఆc...రా సరోజా! బావున్నావా? కాస్త ఒళ్లు చేసావ్ గుర్తుపట్టలా... రాకూచో"

నా సబ్ స్టాఫ్కి నా జీవితంలో కుర్చీ ఆఫర్ చేయలే...

ఇక్కడేమిటీ...?

కల్యాణమల్లా....ఆన్సర్దక్వొశ్చన్....

చెవులు వెచ్చబారుతోన్నాయి....

"ఏంసార్ బైటకూచున్నారు... లోపల బావుంటుందికదా... పదండి...అన్నీ లోపలికి నేను చేరుస్తా..." వచ్చి దాదాపు అనుకుని నిల్చుంది...

మృగంమీద పరిమళం.....

అనంగ శృంగార...అంగారకీల....

నా వయస్సా? యాభైరెండే....లేచేప్పుడు తడబడ్డా....

కావాలనా? అయివుండవచ్చు....

"జాగ్రత్త సర్" అగ్గిబంతుల వెచ్చదనం....

అన్నీ ఒక్కతే ఏసీ రూంలోకి చేరేసింది సరోజ.....

గ్లాస్లోకి మత్తునిపోసి నాకేసి చాచింది...

కావాలని వేళ్లు తాకించింది....

ఉద్వేగం....

"బాగున్నావా సరోజా?"

ఎందుకు బాలేవ్ బాగా బలిసి పిటపిటలాడ్తోన్నావ్....

"మా బాగు లెక్కడ లెండి సార్"

పైట జారింది....

"సరే....వక్కణ్ణే వున్నా పీయే ఏఈ యిద్దరూ జారుకున్నారు...

కొంచెం కంపెనీ యిస్తావా?"

"పెద్దగా అలవాటులేద్సార్....మీరొచ్చారు కాబట్టి...మీకు కంపెనీకి అంతే..." ఓ లార్జి వేసుకుంది...వేసుకోడంలో....అలవాటు తెలుస్తోంది...సోడావేసుకునివచ్చి సోఫాలో అనుకుని కూచుని....

"చీర్స్‌సార్" అంది...

నా గ్లాసులో మందు రెండు గుక్కల్లో మాయమైంది....

సరోజ పైటను వదిలేసింది...బలంగా బలిసిన స్త్రైణం రెచ్చగొడ్తోంది.... శ్యామల్తప్ప నా జీవితంలో మరో స్త్రీ నెరుగను....

ఈ సరోజెవ్వరు......?

గ్లాసులోకి మరింత మత్తు....

"బాత్రూంకెళ్లొస్తాసార్"

తిరిగొచ్చిన సరోజ రవిక సగం తెగుంది...

కల్యాణమల్లుడా...కాపాడు.....

"మీరింకా యింత వయసొచ్చినా బాగున్నార్సార్...."

మృగమదం...

ఏం చేయాలి...?

"అబ్బమందు ఎక్కిపోతోందిసార్"

మంచమ్మీద విస్తరించిన మాంసంముద్దలు...

"ఏం సార్? వూరికే చూసేదేనా....దా!" రెచ్చగింపు

విడిగిన కుబుసం...

చలనం?

నహీ...నహీ...

"దా!"

రెండువూరువుల మధ్య మానవాస్తిత్వ హేతుమూలాధారపు సూత్రాన్ని బిగించిపట్టి...

కదిలించాలని సరోజ

కదలనని...అది....

కదులు .....సరోజ

కదలను....అది

"వదిలేయ్..." నేను.

"దా"....సరోజ

"శ్యామలా!" నేను

☼ ☼ ☼

మెలకవ

బెడ్మీద నేనొక్కణ్ణే.....

రాత్రి?

నిజమేనా?

ఎవరు చేసుంటారాపని?

బాలు చచ్చినా ఆపన్చేయడు...

యువిలావ్వ్యావ్ కంపెనీ అనెళ్ళాడే....!

ఇద్దరూ కల్సి కుమ్మక్కై

లక్ష్మణ్ క్యారికేచర్ చేసుంటుందా....

అవునువాడే....

బాలుకు తెలియకుండానే చేసుంటాడా?

తెలిస్తే బాలు చేయనివ్వడు....

ఏదో కారణంతో బాలునిక్కణ్ణించి తప్పించి దాన్ని నా మీదకి వుసిగొల్పాడు..

అవును వాడిదే ఈ చర్య.....

ఆరు నెల్లనించీ ట్రాన్స్‌ఫర్ అన్తిరుగుతున్నాడు నా చుట్టూ...ఇలా ఇస్తే ట్రాన్స్‌ఫర్ తర్వగా చేసేస్తాననుకునుంటాడు.

వెర్రెధవ....

బైటకొచ్చా....

బాలు న్యూస్పేపర్చూస్తున్నాడు...

నన్ను చూడగానే లేచి

"గుడ్‌మానిగ్సర్" అన్నాడు...

బాలునడగాలా రాత్రి జరిగిందాని గురించి!

అడిగితే నన్నింకోలా అనుకుంటాడా?

వద్దులే...

మర్చిపోదాం...అదే బెటరు...ప్రహ్లాద్గాడి ట్రాన్స్‌ఫర్ యింతే యిక ఛస్తాడు పొట్టిముండా కొడుకు...

మోపెడ్ వేసుకుని వచ్చాడు నేననుకుంటూ ఉండగానే ప్రహ్లాద్గాడు.... "గుడ్ మార్నింగ్ సార్.... రాత్రి రాలేకపోయాను త్వరగా...నేనొచ్చేసరికి మీరు మంచి నిద్రలో వున్నారు"

అమాయకంగా మొహంపెట్టి ఏమీ ఎరుగని నంగనాచిలాగా....

అవునూ వీడికి నిజంగా ఏమీ తెలీదేమో..ఏమోనేనొచ్చాననైలిపి ఆ సరోజే తనకు తాను వచ్చేసిందేమో....ఏమో...నిజానిజాలు తెలీనప్పుడు ఎవర్నేనా ఎందుకేనా ఏమేనా అనుకోవాలి!

వహ్వా...ఎంత పెద్ద మనసొచ్చేసిందిరా నీకు....

"బ్రేక్ఫాస్టేమిటి ప్రహ్లాద్....పుల్లట్లు దొరుకుతాయా"

"దొరుకుతాయా ఏమిట్సార్....మీరు స్నానం అదీచేసి రెడీకండి...

ఇక్కడే వేయించిపెడ్తాను...కుక్‌కూడా వచ్చింది..."

"మనం టిఫిన్చేసి వెళ్దమేనా సర్?" బాలు.....

చిన్నగా నవ్వి..."చూద్దాం " అన్నాను....సిగరెట్వెలిగిస్తూ...

యూ లుక్‌లైకె వాకింగ్ చిమ్నీ.....ఉమానాథ్

"సార్! ఎట్లాగూవచ్చారు...వెర్రివాగు ఫాల్స్ దగ్గరే....అయిదు కిలోమీటర్లు అక్కడ సీనరీ చాలా బాగుంటుందిసార్....అక్కడ ఆదినారాయణాశ్రమం చూడాలి సార్ మీరు.... స్వామి చాలా గొప్పవారు సార్" ప్రహ్లాద్ అన్నాడు...

"సాములూ దేముళ్లూ మనకు పట్టవోయ్...సీనిక్‌గా వుందంటున్నావుకదా వెళ్లొద్దాం అంతే" అన్నాను.....

ఇక ఈ రోజు యిక్కడే తెల్లారిపోయిందని గ్రహించినట్టున్నాడు బాలసుబ్రహ్మణ్యం... తల అటూయిటూ వూపి నవ్వాడు నన్నుచూసి......

ఎన్నింటికి లేచాడో ఏమో....ఫ్రెష్గా వున్నాడు...

తలనున్నగా దువ్వాడు....

తెల్లచొక్కా.....తెల్లప్యాంటులోకి టక్చేసాడు....

బ్రౌన్ బెల్టు

బ్రౌన్ కలర్ క్యాన్వాస్ షూస్....

బూతద్దాలు తీసి తెల్లకర్చీఫ్‌తో బాగా తుడిచి...డొప్ప చెవులకు తగిలించు కున్నాడు..

ఇక నేను రెడీ సర్ మీరేం చెప్పినా చేయడానికన్నట్టు...

"ఎలా వెళ్లాలి ఆ ఫాల్స్ దగ్గరికి కారు వెళ్తుందా...?" ప్రహ్లాద్‌ని అడిగా...

"కారొద్దులెండి సర్ జీప్ అరేంజ్ చేసాను తొమ్మిదికంతా యిక్కడుంటుంది మీరెప్పుడు రెడీ అంటే అప్పుడు వెళ్దాం సర్.... మధ్యాహ్నం లంచ్‌కూడా అక్కడే ఫారెస్ట్ లో తీసుకుందాం సార్... ఇంట్లో వంట చేయిస్తున్నాను మధ్యాహ్నానికి జీప్ వెనక్కొచ్చి లంచ్ తీసుకొస్తుంది.... సార్...."

అధికారంలో వున్న మజాయిదే....

ఈ ఏఈ గాడు నాకు ఏడు జన్మలకిందట్నించీ ఇవన్నీ బాకీపడి వున్నట్టు భావన నాకు...

నిజానికి ఇవేవీ వీడు నాకు చేయక్కర్లేదు..నేను డిమాండు చేయలేను....

తెల్లోడి రోజుల్నించీ అలవాటైందిది...

ఒక్క తెల్లోడేనేమి రాజులకాలంనించీ కూడా అంతే....

అధికారి వచ్చాడంటే అదిరిపడాల్సిందే.....

వాడి గొంతెమ్మ కోర్కెలన్నీ తీర్చాల్సిందే...

ఈ ఏఈగాడు మాత్రం? వీడు కాంట్రాక్టర్లమీద పడడూ.... ఖచ్చితంగా పడతాడు...

లేపోతే నా కోసం యింత ఖర్చెందుకు పెట్టుకుంటాడు...

"సర్వరే ముందు కాఫీ పంపించు"

ఆర్డర్...ఏదో హోటెల్లో కెళ్లి బేరర్కి చెప్పినట్టు చెప్పి గదిలోకొచ్చా....కూచున్నా సోఫాలో...నిన్నట్నించీ గమనిస్తున్నా కాళ్లనెప్పులు లేవు...

సిగరెట్లూ కాలుస్తున్నా...

ఉమానాధ్ పొరబడుంటాడు...

ఏభై దాటాయి కాబట్టి సహజంగా వచ్చే కాళ్లనెప్పులై వుంటాయి అంతే....

ఏవో కాళ్లుపోతాయి

కునిష్టినైపోతా అని వుత్తిపున్నేనికి భయపడి చస్తున్నానేమో ఇంకా టెస్టూ అవీ చేయించలేదు కదా....

అన్ని పరీక్షలూ అయ్యింతర్వాతకా డయోగ్నొసిస్....

యస్ నాకేరోగంలేదు.... ఏదోరోగముందేమోననుకునే రోగం... హైపోకాండ్రియా... అదే నా రోగం..........

శెహబాష్....

బాత్రూంలోకెళ్లి నన్ను నేను లోపలా బైటా శుభ్రంచేసుకుని ఇస్త్రీ బట్టలు వేసుకుని తలుపుని తెరిచా...

బాలూ ఏఈ కాచుక్కూచున్నారు...

"టిఫిన్ తెప్పించేదా సార్...పుల్లట్లు..మీరు ఓకే అంటే వేయిన్చేస్తా వేడివేడిగా వుంటాయి" ప్రహ్లాద్...

కాస్తాగు అన్నట్టు చెయ్యెత్తి వారించి బాలూని లోపలికి రమ్మన్నట్టు సైగ చేసా...

లోపలికొచ్చి "సర్?" అన్నాడు...

"ఓ రౌండేద్దామయ్యా.... మార్నింగ్ హ్యాంగోవర్పెగ్గు" గ్లాసుల్తీ అన్నట్టుగా చేయ్యాడిస్తూ అన్నాను....

"సర్... రాత్రిహెవీగా తీసుకున్నారు భోజనం కూడా సరిగా చేయలేదు మధ్యాహ్నం లంచ్‌ముందు తీసుకుందురు గానీ" జంకుతూ అన్నాడు బాలు....

"ఒక్క పెగ్గుకేం కాదులేవయ్యా...నీవు తీసుకోకపోతే నాకు వెయ్యి" చాలు వాడికింకేం చెప్పక్కర్లేదు 'ఈ ముండాకొడుకు వినడు' అన్న తీర్మానానికొచ్చేసాడు...

శుభ్భరంగా కడిగి పెట్టిన గ్లాసుతీసి బాత్రూంలోకెళ్లి మళ్లీ కడిగి తీసుకొచ్చి... కబోర్డ్‌లో దాచిన నిన్నటి బాటిల్లో మిగిలిన విస్కీ గ్లాసులో పోసీ

"ఒక్కనిమిషం సర్... సోడా కిచెన్ ఫ్రిజ్‌లోవుంది" అని వెళ్లాడు...

బైట ప్రహ్లాద్గాడికి బాలూ చెబుతున్న మాటలు వినబడుతూనే వున్నాయి "ఇప్పుడే అట్లు వేయకన్చెప్పు కనీసం ఓ అరగంట పడుతుంది" అంటున్నాడు...

దటీజ్ బాల సుబ్రహ్మణ్యం.....మై పీఏ....

✳ ✳ ✳

జీప్‌లో వెర్రివాగు ఫాల్స్ చేరుకునే సరికి పదకొండున్నరైంది, సన్నటి జలధార ...ఆకుపచ్చదనాన్ని చీల్చుకుని ఇరవై అడుగులెత్తునించీ కింద బండరాయిని చీల్చడానికి అన్నట్టు దూకుతోంది...

కిందబండ గుండెచాచి....చీల్చుకో అన్నట్టు ధైర్యంగా వుంది...

జలధార తన ప్రయత్నంలో పడుతూన్న కష్టానికి వస్తూన్న అయాసంలా హోరు...

నిజంగా ఓ మహాద్భుతమైన చిత్రం....

నాలోని చిత్రకారుడు... ఆ చిత్రాన్ని పదిలపరుచుకున్నాడు..

ప్రహ్లాద్ ఏమో మాట్లాడబోయాడు

వారించా...

తలవంచుకుని పక్కకు తప్పుకున్నాడు..

వాడేకాదు...ఈ సర్వమానవాళీ ఈ మహాప్రకృతిముందు మౌనమై తలవంచాల్సిందే...

పొద్దున్న తాగిన ఓ పెగ్గు విస్కీ.... తిన్నపుల్లట్లూ చిన్నగా మత్తును కలిగిస్తున్నాయి..

ఆ మత్తుకు జతగా ఈ మహోత్కృష్ట ప్రకృతి...

నా కళ్లు అప్రయత్నంగా కిందికి దిగే అవకాశంకోసం వెదుకుతున్నాయి ప్రహ్లాద్ కనుక్కున్నాడు...

"సరే...ఇటువేపు రండి సర్ కొన్ని మెట్లుకట్టారు" అన్నాదరితీసాడు....కిందికి దిగడానికి అనువుగా....రేలింగ్‌తో... అక్కడక్కడా కొన్ని మెట్లు కట్టారు....

మొదటి అయిదుమెట్లు దిగా....

పిక్కల్లో చిన్నగా నెప్పి మొదలైంది...

రెండురోజులుగా లేదుకదా....

నాకే జబ్బూ లేదనుకున్నాకదా....

యస్ ఉదయాన్నే అనుకున్నా...

నాకే జబ్బూ లేదూ....నాకున్న జబ్బల్లా నాకేదో జబ్బుందనుకునే జబ్బే అని.....

హైపోకాండ్రియా....

మరీనెప్పి?

టి.ఎ.ఒ.?

కాళ్లు పోతాయా?

కుంటి....?

కునిష్ఠి.....?

చక్రాల కుర్చీ....?

మలమూత్రాలూ?

ఆః...?

అదే జరిగితే...!

జరిగితే అంతే..అయ్‌విల్ కిల్‌మైసెల్ఫ్....

అవునవును నన్ను నేనంతం చేసేసుకుంటా...

ఎట్లా...

నిద్రమాత్రలా?

ఉరితాడా?

రెండుసీసాలు విస్కీనా?

విస్కీ తాగి.....నిద్రమాత్రలేసుకొని....ఉరేసుకుంటే....?

మరో రెండుమెట్లు.....

నెప్పి ఇంకొంచెం ఎక్కువ.....

ప్రహ్లాద్.....బాలసుబ్రహ్మణ్యం...రెండే రెండడుగుల దూరంలో వున్నా కొన్ని యోజనాల దూరంలో వున్నట్టు కనిపిస్తున్నారెందుకని?

టెలిస్కోప్ని తిప్పి తిరగేసి చూసినట్టు...

వాళ్లేకాదు... అందరూ...

అందరూ...ఎవ్వరూ... నాకు దగ్గరగా లేకుండా...

ఒక్కొక్కరూ కొన్నివేల మైళ్ల దూరంలో వున్నారు...

వున్నారా...? దూరంగా వున్నట్టు... దూరమైనట్టు నేనూహించుకుంటున్నానా?

వూహించుకోడమేమిటి వుండాకోర్.....!

వున్నారు...నీకు దూరంగా...

నిజానికి వాళ్లకై వాళ్లు నీకు దూరంగాలేరు....

నువ్వే...తోసేసావు వాళ్లందర్నీ...

నువ్వే...

ఇది స్వయంకృతం...

ఇప్పుడు పిలిస్తే రారా?

పిలిస్తేవినిపించేంత దూరంలో వున్నారా...ఎంత దూరం తోసేసావందర్నీ.....

ఛ.ఛ....నాకెవ్వరవసరం లేదు...నాకు నేనే వుండగల్ను....

ఆయ్‌కెన్మేనేజ్ మైసెల్ఫ్.....

యస్...అయామె స్ట్రాంగ్ మ్యాన్....

నువ్వు.....? మ్యాన్?

మగాడివా?

రాత్రి...సరిగ్గా నిన్నటి రాత్రి....నీ మగతనమెక్కడ దాక్కుంది....

జస్ట్ ఫార్నికేటింగ్ ఈజ్నాట్ మ్యాన్హుడ్....

గుండె దడ దడా కొట్టుకుంటోంది....

“సరే?” దగ్గరిగా వచ్చినించున్నాడు బాలు...

హాఁ...లేదులేదు నాకెవ్వరూ దూరంగా లేరు....

చూడు బాలు ఒక్కనిమిషంలో నాకేమైందో అన్న ఆదుర్దాతో వచ్చాడు

చిన్నగా నవ్వా....

“ఏమైనా ప్రాబ్లమాసర్?” బాలు...

“ఉదయాన్నే ఓ స్ట్రాంగ్ పీకాను కదయ్యా....మరీ స్ట్రాంగైనట్టుంది”

అంతే ...నథింగ్”

బాలుకు నాకాళ్ల సమస్య తెలుసు.....

“కాళ్లేమైనా నొప్పిగా వున్నాయాసర్...కింద వరకు ఎందుకులెండి”

వారించడానికి ప్రయత్నిస్తున్నట్టన్నాడు...

“పర్లేదు పర్లేదు...పద”

కాస్సేపాగినందుకు నెప్పి మాయమైంది...

కింద వరకూ సులభంగా వెళ్లా...

చల్లటి నీటి తుంపరలు ఒంటిని తాకుతోంటే...హాయిగా..ఏదో అరణ్య పరిమళం....

పారుతున్న నీళ్లు కరిగి ప్రవహిస్తూన్న స్ఫటికంలా వున్నాయి..

వంగి దోసిలినిండా...నిర్మలమైన నీళ్లు తీసుకున్నాను...

నా దోసిలిలోని నీళ్లలో నీలి ఆకాశపు తునక.....మబ్బు ముక్కలతో....

చల్లటి ఆ నీళ్లని....

అరణ్య పరిమళాల్ని నింపుకున్న నీళ్లని

ఆకాశాన్ని ప్రతిబింబిస్తూన్న నీళ్లని....తాగా...

ఆకాశాన్ని తాగినట్టు

అరణ్యాన్ని తాగినట్టు

ఆ అరణ్య పరిమళాల్ని తాగినట్టు.....

Yes I drank the skies....

I drank the wilderness...

I drank the wild fragrances...

ఆకాశాన్నీ భూమిని కలిపి సేవించినవాడిన్నేను...

భూమ్యాకాశాలు నా గర్భంలో వున్నాయి....

ఈ యావత్ప్రకృతే...నాలో వుంది....

నేనే ప్రకృతి...

గబ గబా....బట్టలూడదీసేసా.....

'బాలూ...ఆ మెట్లమీద పెట్టు....” అని బాలుకు బట్టలిచ్చి... డ్రాయర్తో నెమ నెమ్మదిగా... జలపాతం దగ్గరికి చేరుకున్నా....

జారిపడిపోకుండా.....గొలుసులూ....రాడ్లూ వేసి వున్నాయి....

వెళ్లి జలపాతం కింద నించున్నా...

ధార చిన్నగా వున్నా...బలంగా పడుతోంది తలమీద...

అసలే బట్టతల...

ఆ బండరాళ్ల చీలికల్లోంచీ ఫెర్న్ పచ్చపచ్చగా దూసుకొచ్చింది...

ఆ చుక్కల ఆకుల్ని వేళ్లతో నిమిరా...పిలిచా...ఫెర్న్! డియర్ ఫెర్న్...టావెర్న్... ఇన్ఫెర్నో.... దాంతే....యింతే...దాంతే! బీయాట్రిచే......మానవ జీవిత పరమార్థం... అశాశ్వత...శాశ్వత...పారదిసో....పర్గెటోరి.....నరకం చుట్టలు చుట్టలుగా... లంకమార్కు...

బస్సులో వాంతిమార్కుచుట్టలు...

పంచెపైకెత్తి....నల్లటి తొడమీద....మడతలు విచ్చుకున్న ధూమపత్రం.... కాడపీకు.... ఈనె తెంచు.... చుట్టచుట్టు... చుట్టిచుట్టి....చిన్నగా ఏం కాదు ...పెద్దచుట్ట.... సురట్టు... షెరూట్.... సుట్ట... చుట్ట చిట్టిబాబు మామ....ఇల్లంతా కంపు...కంపు...

ఇదంతా దాంతే లోంచేనా?

ఆలిగ్యరీ...దాంతే...

దైవిక హాస్యం......

డివైన్ కామెడీ...

ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్....

ఓయూపీ...

పీపీ....

పీపీపి...ఢుం ఢుం ఢుం...ఢుఢుం ఢుం ఢుం.....ఢుఢుంఢుం...ఢుం

ఢుం డి....తొండందేవరా!

దండిగా...వడ్డించుదేవరా!....

ఆకుల్లో....

పంచ భక్ష్యాలు.....

భక్ష్య....భోజ్య....లేహ్య....చోష్య.....పానీయాలు...

పానీయం...పానీయం....

కమనీయం...కమనీయం...

పానసమయ కమనీయం....

తాగితే కమనీయదృశ్యం.....

రాత్తిర సరోజ...తాగి..బట్టల్విప్పి....

కమనీయం కాదే!

వమనం కదా!....కాలేదా....జుబేదా...గాత్రం విని ఎన్నేళ్లైంది....బేమురవ్వట్ బేవఫా బేగానఏదిల్ ఆప్ హై..కాలేజీ ఆడిటోరియంలో లోయలోంచి వస్తున్నట్టు....

లోమ?...లోయలో లయ....

లయబద్ధంగా....

ముందుకూ....వెనక్కూ.....

ముందు వెనకల....లయబద్ధ.... కదలిక....

తరవాత....లయ తరవాత...లయం....

విలయం...ఆలయం..డోలాయమానం...

డోలరే డోలరే...డోలా...

ఝూలరే... ఝులరే ఝూలా....

ఊగరే ఊగరే ఊగా.... గారరే గారరే గారా....గారా...

గారాడం...డండం...విషం..షం...షుద్దీన్....న్ ఉద్దీపనో జ్వలనం... జ్వలించి... భస్మం...జ్వలించి...భస్మం...చేస్తే స్మెల్టింగ్

స్మెల్టింగ్ టెక్నిక్.....ఎన్నియుగాల పాతది...

నన్ను నేను...జ్వలింపచేసుకుని...ఈ ప్రక్రియద్వారా... నాలోపలి స్వర్ణ సదృశ వ్యక్తిత్వాన్ని తేటబరుచు కోగలనా?! గలనా....! లలనా...! లనా ...నానా.... నాతుకా!... తుకా... కుతికా....కృతికా.... కాకా.... కాకమల్లి... పోకరెల్లి....వక్కపువ్వు..ఎంత బావుంటుందో... వక్క.. పువ్వు గుత్తిలోంచీ ఒక్క పువ్వును వెదకడమెంత కష్టం?

కష్టం...కష్టం....నష్టం...కష్టం...

చాలాచాలా కష్టం...

"ఆ పక్కన కష్టం సార్....జాగ్రత్త సార్" ప్రహ్లాద్ అరుస్తోన్నాడు...

✻ ✻ ✻

ఓ నెలా పదిహేన్రోజుల్తర్వాత భార్గవ వచ్చాడు...ఫోను చేసి మరీ వచ్చాడు...

ఆఫీసుకు రమ్మని చెప్పా...ఆఫీసుకే వచ్చాడు...

"ఆస్తులు కొంటానికి పార్టీ రెడీగా వుందీ...దాని గురించే మాట్లాడ్డానికి వచ్చా" అన్నాడు....

బాలును పిలిచి...భార్గవని మా గెస్టాస్లో దింపరమ్మని చెప్పి భార్గవతో

"సాయంకాలం కలుస్తారా" అన్నా.

"సరే ఆఫీసులో వ్యక్తిగత విషయాలు మాట్లాడ్డం బాగుండదులే గెస్టాస్కొచ్చేయి" అని బాలు వెంట వెళ్ళిపోయాడు భార్గవ.

పవరాఫ్ అటార్నీ రాసిచ్చాగా...మళ్ళీ ఎందుకొచ్చాడు వీడు అనుకొన్నా... రాన్రానూ ప్రతి మనిషి ప్రతి చర్యలోనూ ఏదో స్వార్ధం గోచరిస్తోంది నాకు...ప్రతి వ్యక్తి చర్య వెనకా ఏదో చీకటి నీడ అగుపిస్తోంది...

ఇది మానసికనారోగ్యమా?.......

ఖచ్చితంగా....

శారీరకంగా అనారోగ్యం ప్రబల్తోంది....

కాళ్ళు ప్రతి అరఫర్లాంగుకీ మొరాయిస్తున్నాయి....అప్పుడప్పుడూ వూరికే కూచునున్నా నెప్పి...

మనసు ప్రతి క్షణమూ వికృతంగా ఆలోచిస్తోంది.

ఆ విషయం తెల్సి పోతోంది...

అయినా ఆలోచనల్ని ఆపలేకపోతున్నాను....

ఇంట్లో శ్యామల్తో అస్సలు మాటల్లేవు...

ముసల్ది సణగడం కూడా తగ్గింది...లేదూ తగ్గినట్టు నేను భావిస్తున్నానా?

ఏమో....

బాలు ఒక్కడు కాస్త సన్నిహితంగా కనబడుతూ వున్నాడు...

వాడి మీద కూడా పరిపూర్ణమైన విశ్వాసం కలగడం లేదు....

నా చుట్టూ నేను గీచుకుంటున్న వృత్త వ్యాసం రోజు రోజుకీ పెరిగిపోతోంది.

ఆ రేఖ అవతలి జనాలు రానురానూ దూరమవుతూ చిన్న చిన్నగా కనబడ్తోన్నారు.

నాకై నేను....

నాకోసం నేను...

నా వలన నేను....

నేను...నేను...నేను...

ప్రపంచం వేరు...నేను వేరు అన్న భావన బలపడ్తోంది...

కానీ నాదైన ప్రపంచం లుప్తమైపోతోందన్న స్పృహ వుండట్లేదు...

ఇంతకీ భార్గవ ఎందుకొచ్చుంటాడూ?

కాలి పిక్కలు పీకుతున్నాయి.....

ఇప్పుడు వూరికినే కూచునున్నా కాళ్ళు నెప్పి పెడుతున్నాయి....

ఉమానాథ్‌ని కలిస్తే..ఏదో డాప్లర్ టెస్ట్ అని చేయించి నాకు ఖచ్చితంగా రక్తనాళాల జబ్బుంది...ఏదో చిన్న ఆపరేషన్ చేయాల అన్చెప్పాడు..

ఆపరేషన్ చేయించుకుని...హాస్పిటల్లో ఆ బెడ్‌మీద...

అమ్మో! వద్దు వద్దు....అనుకుని....ఇదుగో ఇలా....

సిగరెట్ మానేయమని కరాఖండిగా చెప్పాడు ఉమానాథ్....

డాక్టర్గానే కాదు స్నేహితుడిగా కూడా ఉమానాథ్ మాట నేనేనాడు చెవిని పెట్టానూ?...

కుడికాలి బొటనవేలు రంగుమారుతూ....గోరు చిట్లిపోతోంది....

గోరుచుట్టు అవుతుందేమో!....

అసహనం...కోపం....

దేనిమీదో ఎవరి మీదో తెలియదు...

తిరుపతి డీఈ స్వంత పని మీద వచ్చి....టైంపాస్ కోసం ఆఫీసులో కూచును న్నాడు...

వాడిని....ఛీ! వాడు నాకు చాలా విషయాల్లో సహకరించాడు ఈ రోజున వాణ్ణి నేను ఎంటర్టేన్ చేయాలి...

అటు భార్గవ...

ఇటు వీడూ...

భార్గవనీ వీణ్ణీ కలిపితే!

గెస్టౌస్‌కు ఫోన్చేసా....

చెప్పా భార్గవతో....ఇట్లా యింకో వ్యక్తి వస్తాడని...

ఒక్క అయిదు నిముషాలు మనం పర్సనల్గా మాట్లాడుకుందాం.... దాంతర్వాత వంద మంది వచ్చినా నాకభ్యంతరం లేదని భార్గవన్నాడు...

కాళ్ళ నొప్పులకు ఉమానాథ్ దగ్గర కెళ్లాలో....

తిరుపతి డీఈ దస్తగిరి గాణ్ణి ఎంటర్టేన్ చేయాలో....

భార్గవగాడి ఆస్తి గొడవ పట్టించుకోవాలో.....

ఈ మధ్యన కాళ్ళు ఉత్తినే కూచునున్నా నెప్పి పెడుతోన్నాయ్.....

వీల్చేరే గతా?

కదిలే కుర్చీలో కదల్లేని నేను......

అమ్మో వీల్లేదు వీల్లేదు..

నాలుగున్నారా ప్రాంతంలో దస్తగిరిని పిలుచుకుని గెస్టౌస్‌కెళ్ళా...

భార్గవ తీరిగ్గా టీవీ చూస్తున్నాడు....

బాలు అన్నీ  అరేంజ్ చేయాడనికెళ్ళాడు.....

భార్గవని దస్తగిరికి పరిచయం చేసా...

"మీకు బ్రదర్ వున్నట్టు ఎప్పుడూ చెప్పలేదాసార్" అన్నాడు దస్తగిరి...

అక్కడికి వాడికి నేనేదో నా వ్యక్తిగత విషయాలన్నీ చెప్పుకు నేడ్చినట్టు....పకీరు వెధవ...

హిహ్హిహీ అనికిలించి....

"మీరు బాత్రూంకెళ్ళి రిఫ్రెష్ అయిరండి....అంతలో మా సీఏ అన్నీ అరేంజ్ చేస్తాడు" అని వాణ్ని తరిమేసా....

సోఫాలో కూచుని భార్గవ వేపు చూసి "చెప్పు" అన్నా.....

"ఎల్లుండి రిజిస్ట్రేషన్‌రా....పదికి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు... మిగిలిన పదహారూ పైన ఇచ్చేస్తారు.... అయిదు అడ్వాన్సుగాయిచ్చి అగ్రిమెంటు రాసుకున్నాం... ఇప్పటికీ నాకు సొంతం తీసేసుకోడం ఇష్టం లేదురా అన్నయ్యా" ఆగాడు భార్గవ

"నా నిర్ణయం మారదురా భార్గవా...నాన్న పోయినప్పుడు నీకు చెప్పినట్టుగా

భాగాలు చేసేయి... నాకా డబ్బక్కర్లేదు.... ఈ విషయమై ఇక సాగదీయకు" కరాఖండిగా చెప్పేసా..

"సరే నీ ఇష్టం... నాకు రాజుగాడి ఫోన్నంబర్ కావాలి... వుంటే వాడి అడ్రస్కూడా యివ్వు."

నాకాశ్చమేసింది...

"ఏనాడూ నిన్ను నోరారా బాబాయ్ అని పిలవని ఆ వెధవ అడ్రసూ ఫోన్నంబరూ నీకెందుకురా భార్గావా" అడిగా.....

"వాడికి లేకపోవచ్చు మనిద్దరికీ మనింటికీ కలిపి వాడే కదా వారసుడు... వాడు సంబంధాలు తెంపుకోవచ్చు నేనలా చేయలేను ఇవ్వువాడడ్రసు"

"నువ్వూ నీ వెధవ సెంటిమెంటు... వాడు మిమ్మల్నందర్నీ... నన్ను కూడా వెంట్రుకతో సమానంగా చూస్తాడు....వాడికి ఫోన్చేసో ఉత్తరం రాసో నువ్వు అవమానం పాలు కావడం ఖాయం.....అదీకాక వాడి నెంబరూ అడ్రసూ నాకు తెలియదు...ఇంటికి ఫోన్చేయాలి. ఆగు బాలు వచ్చింతర్వాత ఇంటికి ఫోన్చేయించి తెలుసుకుంటా".... అన్నాను....

"సరే నీకిద్దామని నిన్నను వాళ్ళిచ్చిన అడ్వాన్స్ డబ్బు పట్టుకొచ్చాను ఈ బ్రీఫ్లో ఉంది ఎక్కడన్నా దాయించు" అంటూ బ్రీఫ్ తీసి టీపాయ్ మీద పెట్టాడు...

మనసు చివుక్కుమంది.....ఆఖరికి ఇంత నిజాయితీపరుడూ స్వంత తమ్ముడూ అయిన వీణ్ని కూడా అనుమానించే స్థాయికి నేను దిగజారానే...ఛీఁ....

ఆప్యాయంగా భార్గవ భుజమ్మీద చెయ్యేసి నొక్కా......

ఇంతలో బాత్రూంలోంచి దస్తగిరీ...బైటనించి బాలూ ఒకేసారి వచ్చారు...

బాలును భార్గవే అడిగాడు...

"బాలసుబ్రమణ్యంగారూ......కాస్త యింటికి ఫోన్చేసి మా అన్నయ్య కొడుకు ఫోన్నంబరూ అడ్రసూ కనుక్కుంటారా? మీ కోసమన్చెప్పండి నేనొచ్చానని చెప్పకండి"

బాలు అర్థమైందన్నట్టు తలాడించి ఇంటికి ఫోన్చేసాడు....

"మ్యాడం నేనండి సార్ పియ్యేని....బాలసుబ్రమణ్యం....నాకు రాజుబాబు ఫోన్నంబరూ అడ్రసూ కావాలమ్మా.... ఏమీలేదు మా బంధువులబ్బాయి అమెరికా వెళ్తా నంటున్నాడు... మన బాబు అక్కడే వున్నాడుకదా...ఏదో కనీసం మాటసాయం కోసం" అలవోకగా గోడకట్టినట్టు అబద్ధాలాడుతున్నాడు బాలు...

“మళ్లీ మళ్లీ చెబుతున్నారా భార్గవా...వాడినించి అవమానం తప్ప యింకేమీ పొందలేవు...నీకై నీవు వాడితో కమ్యూనికేట్‌చేసి ఆనకబాధపడితేనే చేసేదేమీ వుండదు” భార్గవతోటి అన్నా.....

మౌనంగా కూచున్న దస్తగిరి ముఖంలో విసుగు దిగంబరంగా ద్యోతకమవుతోంది... కాని నే చేసేదేంలేదు....

భార్గవ ఓ అరగంటకూచుని ‘వెళ్తా’ అన్లేచాడు.....

“అదేంట్సార్ రెండు రౌండ్లుకూడా కాలేదు అప్పుడే” దస్తగిరి...

“ఊరెళ్లాలండీ లేటౌతే బస్సు మిస్సవుతుంది” భార్గవ....

బైటి వరకూ భార్గవతోనడిచా....

వెళ్తూ వెళ్తూ ఆగి మళ్లీ నా దగ్గరికొచ్చాడు వాడు...

“ఒరే అన్నయ్యా! నీ ఆరోగ్య పరిస్థితి బాగాలేదన్తెల్సు...ఇప్పుడే జాగ్రత్త పడితే మేలేమో ఆలోచించు....ఆపరేషనేదో అవసరమని డాక్టర్లు చెప్పారట కదా! చేయించేసు కోవచ్చుకదా! పూర్తి ఆలస్యం చేయడమెందుకు” అన్నాడు

వీడికెవరు చెప్పారు ఆపరేషన్ గురించి...బాలు...యస్ బాలు చెప్పుంటాడు.. వీళ్లకెందుకు నా వ్యక్తిగత విషయాలూ? చిరాకేసింది...

“ఆ అదేం లేదులేరా.... చిన్న ఆపరేషన్ట.... నా క్లోజ్ ఫ్రెండే కదా డాక్టర్ ఉమానాథరావనీ నీవు కూడా కలిసావతన్ని.....నథింగ్ సీరియస్...థ్యాంక్స్ ఫర్యువర్ కన్సర్న్”

వాడు భుజాలెగరేసి కదలబోతూండగా బాలు వచ్చాడు.

“సర్ జీపుంది బస్టాండ్‌లో డ్రాప్చేస్తా” అని భార్గవని ఎక్కించుకెళ్లిపోయాడు...

ఓ గంటన్నర తర్వాత దస్తగిరిని గెస్టౌస్లోనే వదిలేసి ఇల్లు చేరుకున్నా......

ఎందుకో ఏదో పరాయి ఇంటికి వచ్చిన భావన....

ఇది నా ఇల్లేనా?

పిచ్చిగానీ...నా ఇల్లేమిటి....?

నేనూ...నా అన్నవి మిథ్యాభావాలు....

నాకు నేను తెలుసా...?

నాకు నేను పరిచయమే లేను కదా!

ఎన్నాళ్లీ ప్రస్థానం?

అసలెంతదూరమొచ్చాను నేను.....

నిన్న మొన్న నాన్నతో వీధి యుద్ధం చేసిన గుర్తు.....

నాన్న అసహాయంగా చచ్చిపోయాడు....

నాన్న శరీరం బూడిదైంది...

మరి నాన్నెక్కడికెళ్లాడు?

నాన్న ఒకానొక ఊహగా పరిణమించాడు....

ఒకానొక జ్ఞాపకంగా మిగిలాడు...

నా మృత్యువు తర్వాత నేనెవరికేనా కనీసం జ్ఞాపకంగా మిగుల్తానా!

నా మృత్యువు నాకెంత దూరంలో వుంది....

మృత్యువు ప్రతీక్షణం నీ వెన్నంటే వుంటుంది....

దానికీ నీకూ చిటికెడు దూరమంతే నీకూదానికీ మధ్యనున్న సూక్ష్మరేఖ ఎప్పుడు చెరిగిపెతుందో ఎవరికీ తెలియదు....

గడ్డాలు పెంచుకుని, కాషాయాలు కట్టుకుని హోమాలూ జపాలు కట్టుకుని చేస్తూ ఉన్నాడో లేడో తెలియని దేముడికీ మిగిలిన వాళ్లకీ అనుసంధాన కర్తలుగా గారడీలు చేసే వాళ్లక్కూడా...

మృత్యురహస్యంలోనే సృష్టి రహస్యం దాగుంది...

మృత్యురహస్యాన్ని ఛేదించిన తర్వాత మనిషి సృష్టి రహస్యం ఛేదించ గల్గుతాడు...

ఏమిటిది...యిలా ఆలోచిస్తున్నా..

దీన్నేనా వైరాగ్యమంటారు...

నిజమే విరాగభావమే కదా వైరాగ్యం...

కారు శబ్దానికి శ్యామల తలుపు తెరిచి నన్నోమాటు చూసి లోపలికెళ్లి పోయింది.

ఈ మధ్య అలవాటైపోయింది...మామధ్య మాటలస్సల్లేవు...

నా గదిలో భోజనం మాత్రం నా టేబిల్మీద దర్శనమిస్తుంది....

తింటే తింటా లేపోతే పొద్దున టేబిల్ శుభ్రమవుతుంది....

ఒకే చూరుకింద ఎక్కడ్నుంచో వచ్చి చేరి ఒకరికొకరు పరిచయం లేని కాందిశీకుల్లా వున్నాం

నా గది తలుపులు తెరిచా....

మళ్ళీ నా గదిలోకెళ్ళి తలుపులు మూసా.....

గుడ్డి వెలుగులో తలుపు దగ్గరే నుంచున్నా....

నా చేతులు అప్రయత్నంగా తలుపుల్ని మళ్ళీ తెరిచాయి....

మళ్ళీ మూసాయి....

తెరిచా....

మూసా....

తెరుస్తూ మూస్తూ...మూస్తూ తెరుస్తూ...

నేను...తలుపులు...అటువాళ్ళు....

నేనూ...వాళ్ళూ

మధ్యన తలుపులు

ఈ తలుపులు భావరాహిత్యంతో నిర్జీవమైనవి....

అవి తెరుచుకున్నా

మూసుకున్నా....మా ప్రయత్నమే....

మా మనసుల్లో తలుపులు మాత్రం మూసుకునే వున్నాయి

వాటిని తెరిచే తలపూ ప్రయత్నమూ మేమెవ్వరం చేయడం లేదు.....

అవి తెరవని తలుపులే....

* * *

ఓ నెల్రోరోజులు గడిచిపోయాయి....

కాళ్ళు కూచున్నా పడుకున్నా కూడా విపరీతంగా బాధిస్తున్నాయి...

ఉమానాధ్ తనే పర్సనల్గా యింటికొచ్చి

"నీకు బ్లడ్ వెసల్ గ్రాఫ్టింగ్ అవసరం...ఉత్తి అవసరం కాదు... తప్పదు. మనకు వాస్కులార్ సర్జరీ మంచి స్టాండర్డ్స్‌లో కావాలంటే బోంబే వెళ్లాలి...నేను హాస్పిటల్ వదిలి వస్తాను వెళ్దాం పద....మరీ ఆలస్యమయిపోయింది.... ఇక వదిలేస్తే కాళ్ళు పోగొట్టుకోడం తప్పదు......

నామాట విను...నాకు నువ్వేం చేసుకుంటున్నావో తెలుసు...వయసులో వున్నప్పుడు జీవితంతో పోరాడి కావాలన్నది సాధించుకున్నవాడివి.....ఇప్పుడెందుకీ వ్యాజిటివ్ చేష్టలు..." అభిమానంగా అన్నాడు....

"సరే నాకో వారం రోజులు టైం యివ్వగలవా? ఫైనాన్స్ మ్యాటర్స్ అన్నీ ఓ కొలిక్కి తెచ్చేసి...వస్తాను....ఆపరేషన్ చేయించుకుంటాను" లోలోపల నాకున్న ఆపరేషన్మీద విముఖతే...

"సరే సిగరెట్ మాత్రం టాబూ...యాప్సలూట్లీ నో స్మోకింగ్" అన్నాడు ఉమానాథ్

"డ్రింక్?" అడిగా......

"డ్రింక్ ఓ కే...బట్ నాట్ హెవీలీ..."

ఆప్యాయంగా భుజం తట్టి వెళ్లిపోయాడు...

ఈ ఊరొచ్చిన కొత్తలో పరిచయమయ్యాడు.... అతికొద్ది సమయంలోనే ఆప్తమిత్రు డయ్యాడు...అతనికి నా గతం ప్రస్తుతం అన్నీ క్షుణ్ణంగా తెలుసు......

నా మనసు నలిగి మంచి సాంత్వన కోరినప్పుడల్లా నాతో ఓ గంటా రెండు గంటలు గడుపుతాడు....

నిజానికి నాకు జీవితేచ్ఛ సన్నగిల్లుతోంది...

ఓ విధమైన నిర్లక్ష్యం అలుముకుంటోంది.....

ఆపరేషన్ చేయించుకుని, ఆరోగ్యంబాగుచేసుకుని...అదసలు బాగౌతుందో లేదో తెలీదు... నేను ఒరగబెట్టేదేముంది...

ఓ వయసొచ్చిం తర్వాత అందర్లో యింకా యింకా బతకాలన్న

యావ కొట్టొచ్చినట్టు కనబడుతుందే....

ఉదయాన్నే లేవడాలూ....జాగింగులూ...ఏరోబిక్కులూ.... డయటింగులూ...

ఇవన్నీ ఎవర్నో ఉద్ధరించడానికన్నట్టు పోజులూ.....

చావంటే భయం...అంతే!

సాధ్యమైనంతకాలం చావును దూరంగా పెట్టే ప్రయత్నం.....

నాకిక ఏ కోరికాలేదు...

లేదా?

వుందో లేదో తెలీనితనం కాదా?

ఏమో!

చావంటే భయం మాత్రం లేకుండాపోతోందన్నది మాత్రం సత్యం....

ఈ ఆరోగ్య సూత్రాలూ వంకాయల్తో ప్రపంచ జనాభా పెరిగిచస్తోంది...

ముసలిముండలూ ముసలి ముండాకొడుకులూ ప్రబలి ఛస్తూ పిల్ల జనరేషన్లని ఛంపుకుతింటున్నారు....

'వయసు మళ్లిన ఎముకలు కుళ్లిన సోమరులారా చావండీ' ఛీరంగం కూడా వయసుమళ్లే వరకూ ఎముకలు కుళ్లే వరకూ బతకలే?

అదీ శుబ్బరంగా మందుకొడుతూ....దమ్ముల్లాగుతూ...

ఏమీలేదు మనకు నియంతల్రావాలి...

దేశంలో ఏభైఅయిదు అరవైదాటిన ప్రతొక్కర్నీ చంపించేయాలి

అమ్మో నియంతలైతే ప్రమాదం...

మావోకుమల్లే వాళ్లు మాత్రం ఎనభైయ్యొచ్చినా బతికి ఛస్తారు....

ఏమిటి ఆలోచనలిలా వికృతంగా....

ప్రతీ ఆలోచనా వికృతమే....

సవ్యంగా.....సాఫ్‌సీదాగా....

ఏ ఆటంకం లేకుండా....

అటూ యిటూ గెంతకుండా...

ఒకే విషయంపై నడిచే ఆలోచన శూన్యం....

అటువంటి ఆలోచన మృగ్యం...

మరదేదో ధ్యానం.....జెన్...మెడిటేషన్.....అంతేకాదు

ట్రాన్సెండెంటల్ మెడిటేషన్....భావాతీతధ్యానం....

నాన్సెన్స్.....

ఆలోచన వికృతమే....

నాదైనా.......

ఎవర్దైనా.....

అందుకే గాడ్దెకొడకా నిన్ను వికృతుడూ అంటారు...నీకు తెలియనివీ...నీవు గ్రహించలేనివీ లేవనీ.... సాధ్యపడవని అన్టం నీ బుద్ధి తక్కువ...

అవునేమో....

అవన్నీ వున్నాయేమో.....

నాకు మాత్రం భోధపడనివేమో అవన్నీ....

కాళ్లు విపరీతంగా నెప్పి....

వాడెవడూ? సత్తార్ పిల్చుకొచ్చాడే...పిల్లిగాడు..

ఆఁపిల్లి వెంకట్రావ్....హోమియోమందిచ్చాడు అస్సలు వేసుకోలే...

"హోమియోపతీలో ఏరోగానికైనా మందుంది సార్"

పిల్లి వెంకిగాడి హోమియోపతీయా.....

ప్రియ మిత్రుడి ఉమాలోపతీయా...

నెప్పిని భరించలేపోతున్నా....

నెప్పిని హరించడానికి....యింకా నెప్పి కావాలి....అసలు నెప్పికంటే పెద్దనెప్పి...

తలనెప్పొస్తే అమృతాంజనం రాసుకున్నట్టు....

అమృతాంజనం మంటలో అసల్తల్నెప్పి కన్పించదుగా....

ఎందుకో ఏమో.....నాకు తల్నెప్పికి ఈ అంజనాలూ....బామ్‌లూ ఒక్కనాడు కూడా పన్చేయలేదు..

కమ్మటి స్ట్రాంగ్ కాఫీ...వెచ్చటి ఓ సిగరెట్ దమ్మూ......ఫైసల్.....సిగరెట్?

'నో సిగరెట్..యూ లుక్ లైక్ వాకింగ్ చిమ్నీ' ఉమానాధ్....

'ఇప్పుడెందుకీ ప్యూజిటివ్ చేష్టలు'

పారిపోతున్నానా?

ఎవర్నించీ?

దేన్నించీ?

ఎందుకోసం?

నాకేం కావాలో నాకే తెలియని ఓ అస్పష్టతనించీ...

నిర్దిష్ట గమ్యరాహిత్యంనించీ....

స్వార్ధంనించీ....

నా నార్సిసిస్టిక్ ప్రేమనించీ...

నేను....ఒక్కరంటే ఒక్కర్ని ప్రేమించుంటే....

నాలో ఈ నిర్వేదముండేదా?

అసలు ప్రేమ అన్నపదానికి స్వార్ధం అన్న నిర్వచనమిచ్చుకున్న నాకు యింకొకళ్లని ప్రేమించడం తెలుసా.....

ఆలోచనల్తో తల కకావికలమైపోతోంది.....

కబర్డ్‌లో మందుకోసం వెదికా....

ఊహూఁలేదు....

మూడు సీసాలుండాలి...ఖచ్చితంగా....

ఈ దయ్యం మండలు తీసేసుంటాయి...నన్నుద్ధరించేందుకు...

టైం చూసా....

పదకొండున్నర...ఉమానాథ్ క్లినిక్ మూసేప్పటికే పదిన్నర అతనొచ్చి వెళ్లి గంటైంది...

అసహనం...

మందు కావాలి....

వున్నాడుగా.... బాలు మై పీఏ...

నిజానికి బాలు ఆఫీసులో సీనియర్ మోస్ట్ సీనియరసిస్టెంట్ నాకునేను అతన్ని పియ్యేగా పెట్టుకున్నా...

ఈ టైంలో బాలుని డిస్ట...?

నావేళ్లు బాలు యింటినంబర్ నా ఆలోచనకంటేముందే డయల్చేసాయి..

మనసా! ఓడిపోయావే.....

ఇమ్మీడియేట్గా రెండు రింగుల్తర్వాత.....బాలు అటువేపునించీ

"సర్ చెప్పండ్సర్" గొంతు నిద్రనించీ లేచినట్టు లేదు....

ఉదయపు సూర్యుడి రంగులు తాగిన తేజంతో నిండివుంది...

"బాలూ....సారీ....టుడిస్టర్బ్యూ....యింట్లో...."

"వస్తున్నాన్సర్....సిగరెట్స్ వున్నాయా?" నాకీక్షణం బాలు ప్రపంచంలో అందరికంటే... అత్యంత అత్యంత ఆత్మీయుడు "థాంక్....థ్యాంక్యూ బాలూ" ఫోన్ క్రాడిల్చేసి.... నా గది తలుపుల్ని తెరచి....మెయిన్ డోర్ ఓపన్చేసి....బైట వరండాలో కేన్ కుర్చీలో కూచున్నా....

ఇటువంటి సుఖలాలస వున్న నాలో జీవితేచ్ఛ లేదా?

విస్కీ సేవనం సుఖమా.....

కాదు కానేకాదు....

విస్కీ సిగరెట్ రెండూ నన్ను శరీరకంగా లోబరుచుకున్నాయి

యస్ అయ్‌హ్యావ్ ఫిజికల్ డిపెండెన్స్...

మెయిన్‌గేట్ అవతల బాలూ నీడ...

బాలూ నీడనే నా నీడ...

మెయిన్ గేట్ లాక్ చేయబడదు...

తుప్పుపట్టుంది...నాలాగా....

కిర్రుమన్నప్పుడ్చేస్తూ గేట్ తెరిచాడు బాలు....

వాడు తెరిచింది మెయిన్గేటేకాదు...యింట్లో దెయ్యాల తలుపులు కూడా...

ఆ శబ్దానికి వరండా లైట్ వెలిగింది...

పక్కింటి బెంజిమన్గాడు గ్రిల్లులోంచి ముఖాన్ని బైటకు తొయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు.

నా భార్య దయ్యం ముఖం తలుపుల్లోంచీ తొంగి చూసింది....

సరిగ్గా చూస్తే...

ఆ రెండు తలుపుల చీలికకు కాచిన ఓ విచిత్రమైన కాయలా వుంది శ్యామల తలకాయి....

బాలు ఎడమచేతిలో విస్కీ...

కుడిచేయి జేబులో...అనీజీగా... ఏ విధమైన గిల్టూలేదు

బాలు ముఖంలో.....

"ఏమిటి? ఏమిటండీ యిదీ....మీకు తెలీదా ఈయన పరిస్థితి తెల్సితెల్సీ..." గొంతు పక్కింటి వాళ్లకినబడుతుందేమో నన్న జంకుతో.... శ్యామల....

"సారీ మేడమ్..." అని బాటిల్ సిగరెట్ ప్యాక్ టీపాయ్ మీదుంచి...గిరుక్కున వెను తిరిగి చీకట్లోకి జీర్ణమైపోయాడు బాలు....

బాలూ మై పీయే.....

ద మ్యాన్...ఓన్లీ మ్యాన్ హూ అండర్‌స్టుడ్మీ....

బాటిల్ సిగరెట్ప్యాక్ తీసుకుని పైకి లేచా...కాళ్లు సహకరించటం లేదు....

విపరీతమైన నెప్పి....

శ్యామల నన్నుకసిగాచూస్తోంది...

నా ముఖం బాధతో వికృతమైపోతోంది....

'ఛావు చేజేతులా చేసుకున్నావు' అన్న భావన శ్యామల ముఖంలో....

తలుపు శబ్దం చేస్తూ మూసేసింది...

పరండాలో లైట్‌ని చీకటి మింగేసింది....

నన్ను కాలం మింగుతోంది...

నా జీవితంలో నేను చేసిన అతి దీర్ఘ ప్రయాణం.... వరండానించీ నా బెడ్రూంకు....

ఎన్ని యెజనాలో.....!

ఎన్ని యుగాలో!

* * *

నాకు తెల్సిపోయింది....

ఇక యిది చివరి మజిలీ....

ఈ మజిలీలో ఎన్ని రోజుల బసనో తెలియదు....

తెలియదా? తెలుసు....అటూ యిటుగా తెలుసు....

నేను తెలుసుకున్నదీ....నేను సిద్ధాంతీకరించుకున్నదీ...

అదే గొప్ప గొప్ప వేదాంతులచే స్వాములవార్లచే ప్రవక్తలచే చెప్పబడుతోంది....

ఏదీ నీది కాదు...ఎవరూ నీవాళ్లుకాదు....చివరికి ఏమీలేదు...

కానీ అడిషనల్ సేఫ్టీమెషర్ కింద....పుణ్యం అనే మిధ్యను మిగుల్చుకో....

అనేకదా?

ఓ వికృతమైన నవ్వు బొమ్మజెముడులాంటి నా ముఖం మీద ఎన్నో ఏళ్లకు వూచింది....

కాళ్లపిక్కలు చేత్తోనొక్కుకున్నా....

ఎదురుగా విస్కీసీసా.... మెదడు పొరలమధ్య స్థానంకోసం...

సిగరెట్ ప్యాక్....ఊపిరికోసం....

ప్లేటుమూసిన భోజనం.....చల్లారిన వయసులా మూతపడి....

గాజుగ్లాసులో తెల్లముఖంవేసుకు చూస్తున్న పెరుగు...

నిర్వికారంగా నీళ్లగ్లాసులో తలకు సంబంధంలేనట్టు...

నా జీవితపు చివరి నిర్ణయానికొచ్చేసా...

కళ్లు మూసుకున్నా....

నాన్న ముఖం ప్రత్యక్షమయింది...

'నాన్న! నేనోడిపోలేదునాన్నా...! ఈ నిర్ణయం నా ఓటమి కాదునాన్నా.......! అలాచూడకు నాన్నా! ఒకే! ఇది ఓటమికాకున్నా...నీ గెలుపు మాత్రం కాదు

నాన్నా!

నేను గెలిచినో నువ్వు గెలిచావో...నీకు చెప్పాకద నాన్నా...

ఈ నిర్ణయంతో గెలుపు నాదేనాన్నా...! నీ మీద కాకున్నా ఎందరిమీదో గెలుపు నాన్నా...

నిజంనాన్నా! ఆఖరికి నామీద నాకుకూడా నాన్నా!

పెదవుల మీదకి ఉప్పగా ఖేదం కరిగిజారింది....

భార్గవ...

పిన్ని...

చెల్లెళ్లు...

రంగారావు...

వైకుంఠం....

బాలు....

శ్యామల....

రాజుగాడు...

ఎవరెవరో...

గుర్తుకొచ్చీరాని ముఖాలు...

గుంపులు గుంపులుగా...

వరుసగా...

ఓ దాంతర్వాతింకోటిగా.....

చివరాఖరికి....ఆ క్యూలో ఎవరు?ఎవరది?

"ఎవరదీ!" గట్టిగాకేకేసా....

నా గది తలుపుల చీలికలోంచీ

కామాక్షమ్మ....ఒక ముఖంతో కాదు...

☼ ☼ ☼

మర్నట్రోనించీ ఓ నెల్రోజులు మెడికల్లీవ్ అప్లయ్‌చేసా...

ఉదయాన్నే ఏడున్నరకి బాలుగ్రమ్మన్చెప్పి.... ఉమానాధ్‌కు ఫోన్చేసి.... మెడికల్ సర్టిఫికెట్ రాసివ్వమనడిగి...!

ఎస్సీకి ఫోన్చేసి...! బాలు వెళ్లి లీవ్ లెటర్‌పెట్టి వచ్చాడు....

సత్తార్‌కి ఫోన్చేసి యింటికిరమ్మన్నా...

అట్లాగే ఆడిటర్నికూడా...

బాలు...బాలు సరేసరి...వాడు లేకుండానా! అయితేకాస్త అలస్యంగా వచ్చాడు బాలు..

ఆఫీసు సర్దేసి వచ్చుంటాడు...

సర్దేయ్ బాలూ! అన్నీ సర్దేయ్...అనుకున్నా...

వచ్చిన వాళ్లందర్నీచూసి...ముసలి మంత్రగత్తె మొహంలో చెప్పరాని కుతూహలం...

శ్యామల నిర్వికారంగా తనపని తన్చేసుకు కాలేజీ కెళ్లిపోయింది...

శ్యామల ఈ మధ్య బాగా డిటాచ్డ్‌గా వుంటోంది...

శ్యామల మనస్తత్వం నాకింతవరకూ అవగతం కాలేదు.

అసలు నా మనస్తత్వమేమిటో నాకు తెలిసేడిస్తేకదా!

శ్యామల కూడా నన్ను మనస్ఫూర్తిగా యిష్టపడి కట్టుకోలేదన్న సత్యం మాత్రం నాకు తెల్సు....

నా అవసరానికి నేను తనని కట్టుకున్నా....

తన తల్లి అసహాయతని అర్థం చేసుకుని తను నన్ను కట్టుకుంది...

ఈ రోజున నా అవసరం వాళ్ళిద్దరికీ లేదు...

ముసల్దానికి తన పెన్షన్ తనకొస్తుంది...

శ్యామలకి తన జీతం తనకొస్తుంది....

నేనెవణ్ణి మజ్జులో గొట్టంగాణ్ణి...

నాకూ వాళ్లవసరం లేదు...

ఎవరికెవరూ అవసరం లేనప్పుడు....ఉదయాన్నే టిఫిసూ....

రాత్రిళ్లు నా గదిలో భోజనమూ....ఇవన్నీ ఎందుకూ...?

ఈ భారద్దేశంలో వేళ్లూనుకుని పాతుకుపోయిన సాంప్రదాయమేనా ఇదే వేరే దేశాల్లో అయితే....

నువ్వెంతంటే నువ్వెంతనుకుని నిమిషాల్లో వేరుపడిపోరూ...

సత్తార్నీ ఆడిటర్ సతైన్ననీ బాలునీ కలుపుకుని సత్తార్ గెస్టౌస్‌కెళ్దామని ప్లాను...

ఉత్తినే కాదు...అకౌంట్లు సెటిల్‌చేసేద్దామని

ఈ జీవితమే ఎప్పటికీ సెటిల్‌కాని...అకౌంట్.....సెటిల్‌కాడానికి ముందు ట్యాలీ కావాలిగా...అవునవునవును...

ఈ జీవితం ఎప్పటికీ ట్యాలీ కాని అకౌంట్....

సత్తార్‌తోటి అన్నా...

"సత్తార్! మీ గెస్టౌస్ కెళ్దాం....పర్సనల్ విషయాలు మాట్లాడుకోవాలి...అందుకే సతైన్నగారిని పిలిపించా....మీకేం అభ్యంతరం లేదుకదా?"

"అబ్బే! భలేవార్సర్ మీరూ!" సత్తార్.

బయల్దేరుదామని డ్రెస్ చేసుకున్నా...నల్లట్రౌషర్స్‌లోకి క్రీం కలర్‌షర్ట్ టక్‌చేసా... ఉతికుంచిన సాక్స్‌తీసా....

కుడికాలు చాచి సాక్‌రోల్చేసి తొడగబోయి చూసా...కుడికాలి బొటనవేలి గోరు పెళుసుగా అయిపోయి చాలామటుకు రాలిపోయింది...వేలిరంగు నీలంగా వుంది... ఏమిటిది?

నెప్పికూడా లేదు...సెన్సేషన్ దాదాపు లేదు...

గుండె దడ దడలాడింది...

నెమ్మది నెమ్మది అనుకుంటూ సాక్స్ వేసేసుకుని షర్టు తొడుక్కుని బయల్దేర బోయా...

కాళ్లు యథా తథం... పిక్కల్ని హైనాలు పీక్కుతింటున్నట్టు. గుండెల్నిండా గాలి పీల్చుకుని....

ముఖానికి నవ్వు అద్దుకుని....

"పదండి" అన్నా...

"సర్ ఒక్క నిముషం" బాలు

ఏమిటన్నట్టు చూసా...

జేబిలోంచీ ఓ ఏర్‌మేల్ తీసి చేతిలో పెట్టాడు....

కనుబొమలు ముడిచి చూసా....

రాజుగాడి దగ్గర్నించీ....నాకు...నాకే....

ఆశ్చర్యం....!

రాజుగాడు? నాకు...ఉత్తరం?

చించబోయి ఎదుటివాళ్ల మొహాలుచూసా...

సత్తార్ నిర్వికారంగా....

సత్తెన్నగాడు మటుకు అసహనంగా...

బాలులో కొద్దిపాటి కుతూహలం....

ఓ చిన్న నిట్టూర్పు వదలి...ఆ ఉత్తరాన్ని టీపాయ్ మీద వుంచి

"పదండి" అని రెండోసారన్నా...

ముగ్గురూ బయటికెళ్లారు.....

నేనా ఉత్తరాన్ని మళ్లీచూసి...యాష్ట్రేని దాని మీదుంచి నా గది తలుపుల్లోంచీ బైటికొచ్చి...

ఆ తలుపుల్ని మూసి...

ఇంకెవ్వరూ తెరవకుండా తాళంవేసి....

వాళ్లవెనకే కదిలా..

ఓ రెండడుగులువేసి......

వెనక్కు తిరిగి....

మూసేసిన తా తలుపుల్ని చూసి.....

ఓ చిర్నవ్వు నవ్వుకుని

బాధభరిస్తూ వాళ్లవెనక కదిలా

☼ ☼ ☼

'ప్రశాంత శూన్యం'

రాత కోతలు పూర్తిచేయించా...

రెండురోజుల్లో ఎక్కడెక్కడ పూడ్చినవీ పాతినవీ దాచినవీ లెక్కలు రాయించా...

ఏమి చేస్తున్నా....

ఎలా ఆలోచిస్తున్నా....నన్ను లీలగా వెంటాడ్తోంది రాజుగాడి ఉత్తరం...

చక్కటి ఇంగ్లిష్లో రాసాడు...

'రెస్పెక్టెడ్ ఫాదర్' అని మొదలుపెట్టాడు ఉత్తరం...

అసలా వుత్తరానిక్కారణం భార్గవగాడు....

నేనొద్దన్న డబ్బుని రాజుగాడికి పంపించాడు...పంపించివాడితో ఏదో మాట్లాడాడు కూడా....

పర్యవసానం రాజుగాడి ఉత్తరం...

వాడు నా తరఫువాళ్లని అసహ్యంచుకోడానికి కారణమైన వాళ్ల అమ్మమ్మని తీవ్ర పదజాలంతో నిరసించాడు...

నా పట్ల వాడి ప్రవర్తనకు ఎన్నోసార్లు క్షమాపణలు చెప్పాడు...

క్షమాపణలతోనే ఉత్తరాన్ని ముగించాడు...

ఆ ఉత్తరం నాలో పెద్ద కదలిక కలిగించలేదు...

భార్గవక్కూడా నేను ఫోన్చేసి దీని గురించి చెప్పలేదు...

ఒకానొక నిర్వేదం కమ్మేసింది నన్ను.....

ఎప్పుడు చూసిందో ఎట్లా చూసిందో ముసలిముండ ఆ ఉత్తరాన్ని చూసింది...

ఉదయాన్నే కాళ్లు నరకం చూపిస్తూంటే ఉమానాథ్కి ఫోన్చేసా... తనే ఇంటి కొచ్చాడు....

ఉమానాథ్ ఇంటికొచ్చాడంటే...నాకేదో అయ్యిందనే శ్యామల నమ్మకం....

ఉమానాథ్తో పాటు శ్యామల ముసల్ది గదిలోకొచ్చారు

శ్యామలలో అదుర్దాకనబడుతోంటే....ముసల్ది రాజుగాడు రాసిన ఉత్తరంకోసం వెదుకుతోంది....

"మీరు బైటికి వెళ్లండి" అని ఉమానాథ్ అన్నాడు....ముసల్ది వెళ్తూ వెళ్తూ రాజుగాడి ఉత్తరాన్ని తీసుకెళ్లడం గమనించా...

చదివి ఛస్తుంది ముసలిముండ అని కసిగా అనుకున్నా....

కుడికాలి బొటనవేలు చూసి ఉమానాథ్ తల అడ్డంగా వూపాడు...

పెదవి బిగించాడు...

నొసలు చిట్లించాడు...

నిట్టూర్చాడు...

"ఇట్హ్యాజ్ బిగన్" అనన్నాడు..

అన్నాడో అనుకున్నాడో...

"ఏమిటి?" అడిగా...

"ఇట్...ఇట్స్...గ్యాంగ్రీన్"

"ఏమిటి చేయడం...?" అడిగా

"యాంకిల్ వరకూ యాంప్యుటేషన్" తలడ్డంగా ఊపుతూ ఉమానాధ్

కుంటినేను...

చక్రాల కుర్చీ....

మలమూత్రాలు మంచంలో

అసహ్యాపు చూపులు

ఏవగింపు...

నా నిర్ణయానికి ఊతం దొరికింది...

నే నిర్ణయించుకున్నది సరైనదే

"ఎప్పుడు చేస్తావ్?" నిర్వికారంగా అడిగా...

నావేపు ఓ చూపు చూసి

"నీకు....నీకేమీ అనిపించడంలేదా? నీకై నీవు కొనితెచ్చుకుంది కాదా యిది...గత సంవత్సర కాలంగా నీకు చెబుతూనేవున్నా...యూ....యూ నెవర్ హర్డ్‌మీ....నోవన్ కెన్ హెల్ప్ పీపుల్ లైక్యూ...

పద అడ్మిట్ అయిపో...రేపుదయాన్నే చేసేస్తా...అట్లీస్ట్ వియ్‌కెన్ సేవ్ యువర్ లైఫ్" అన్నాడు...

లైఫ్! జీవితం....

లేదులేదు యిక జీవితంలేదు...

కేవలం బ్రతికుండడం మాత్రమే...

నిస్సారంగా....

ఇక నాకే కోరికలూ లేవు...

ఏ ఆశలూ లేవు...

కాంక్షారహిత జీవితం.... జీవితంకాదు...

పెదవులమీదకి ఓ చిర్నవ్వు...

మహాద్భుతమైన శాంతితో కూడిన చిర్నవ్వు

ఉమానాధ్ నా గదిలోంచి బైటకెళ్లాడు....

తెలుసు....శ్యామలతో మాట్లాడ్డానికి వెళ్ళుంటాడు.

శ్యామలకూడా ఒక నిర్వేదాన్ని కప్పుకుని గదిలోకొచ్చింది...

నావేపు శూన్యం నిండిన చూపులు విసిరింది....

ముసల్ది...ఓ అని అరుస్తోంది.....

"చెవినిల్లు కట్టుకొని పోరినామండీ నేనూ నాకూతురు కల్సి చేజేతులా తెచ్చుకున్నా డండీ డాక్టరు గారూ... యిప్పుడు నా కూతురు గతేమిటండీ" అని అరుస్తోంది..

ఉమానాధ్ మళ్లీ నా గదిలోకొచ్చాడు...

"పద హాస్పిటల్లో అడ్మిట్ అయిపో...టెస్ట్లూ అవీ చేయించేసి పొద్దునకు రెడీ అయిపోదాం... సాధ్యమైనంత మినిమైజ్‌చేద్దాం యాంపుటేషన్... జస్ట్ టోట్రై చేద్దాం ముందు... దాం తర్వాత చూద్దాం" అన్నాడు....

"ఉమానాధ్! ఈ ఒక్కపూట టైం యివ్వు ఉదయానికి నేనురెడీ అయిపోతా ....ప్లీజ్..."

అలిసిపోయినట్టుగా చూసాడు నావేపు....

"ఒక్కపూట... ఒక్కరోజు... అంటూ ఏడాది కాలంచేసావు....

నీ యిష్టం రేపుదయానికి రాకపోతే కాళ్లూ చేతులూ కట్టేసి తీసుకుపోతా..."

అరిచినట్టుగా అన్నాడు...

లేదు ఉమానాధ్ ఈ ఒక్కపూట అనెందుకంటున్నానంటే...

ఈ ఒక్కరాత్రి మనస్ఫూర్తిగా ప్రశాంతంగా నాకునచ్చినట్టు జీవించాలనుంది...

దాంతర్వాత మీరే...మీరందరూ కలిసి నువ్వన్నట్టు కాళ్లూ చేతులూ కట్టే తీసుకెళ్తారు.....

లోపల అనుకున్నా....

బైటికి మాత్రం..."రేపు ఉదయాన్నే ఎనిమిదికంతా వచ్చేస్తా హాస్పిటల్కి" అన్నా..

"ఒకే....దిసీజ్ ఫైనల్" అని శ్యామల వైపు తిరిగి....

"రేపుదయాన్నే తీసుకొచ్చేయండి" అన్నాడు....

శ్యామల మౌనంగా తలాడించింది...

ఉమానాధ్ వెళ్లిపోయాడు మరోసారి వార్నింగ్‌యిచ్చి....

శ్యామల కబర్డ్ పక్కన గోడకానుకుని జారగిలి కూచుంది....

చూపులు ఎక్కడో శూన్యంలోకి....

ముసల్ది లోపలికొచ్చింది...

"ఏం చేద్దామే తల్లీ...మన బతుకులిట్లా తగలబడిపోతున్నాయి ఎవరికేం ద్రోహం చేసామే మనమూ...ఆఖరికి ఆ పెద్ద మనిషి ఈయన తమ్ముడుగారు మన పిల్లవాడి మనసు కూడా విరిచేసాడే ఆఖరికి వాడు కూడా మనకు దూరమైనాడే.... మనకెవరే గతీ..."

అనరవసాగింది....

శ్యామల ఒక్కసారిగా

"అమ్మా!" అనరిచింది...

శ్యామలలో అంత ఆగ్రహం నేనెప్పుడూ చూళ్లేదు....

ముసల్ది హతాసురాలైనట్టు చూస్తోంది......

నివ్వెరపోయింది.....

భయపడిపోయింది...

"ఆపు....ఆపు నీ రంధి....లే...బైటికెళ్లు" గద్దించింది శ్యామల ముసల్ది భయంగా భయంగా బైటికెళ్లింది....

ముసల్ది వెళ్లిన కాసేపటికి శ్యామల లేచి నా కెదురుగ స్టూల్ లాక్కుని కూచుంది....

గుండెల్నిండా గాలి తీసుకుని...

"వాట్ నెక్స్ట్?" అడిగింది....

తనవేపు చూసా...

ఎవరో అపరిచిత వ్యక్తిని చూస్తున్న భావన....

ఎవరీ ఆడది?

దీనికీ నాకూ ఏమిటి సంబంధం? ఇది నా భార్యా?

నేను దీనికి భర్తనా?

భార్యేమిటీ? భర్తేమిటీ?

"చెప్పండి ఏమిటి తర్వాత" రెట్టించింది శ్యామల....

"దేంతర్వాత?"

"అదే...మన భవిష్యత్తేమిటి? ఎందుకిలా జబ్బు ముదర బెట్టుకోడం?

మామీద కసా? మేం మీకేం ద్రోహం చేసాం?మీకేం తక్కువచేసాం?

చెప్పండి!"

శ్యామలవేపు చూసా...

ఏ భావమూ కలగలేదు...

కోపంలేదు...

ద్వేషం లేదు...

చికాకు లేదు....

సంతోషంలేదు...

ప్రేమసలేలేదు....

"రేపుదయానికి నీ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరుకుతుంది యిక నన్నొదిలి వెళ్తావా...యిప్పుడు నాక్కావల్సింది నువ్విప్పలేవు నాకు నీ మీద ఏ విధమైన కోపమూ లేదు... ప్లీజ్ లీవ్‌మీ అలోన్"

లేచి దగ్గరికొచ్చింది.....

రెండు భుజాలు నెప్పేసేలా గట్టిగా పట్టుకుంది...

"నలుగురూ నన్నూ అమ్మానూ ఆడిపోసుకునేట్టు చేస్తున్నారు మీరు ఈ రోజుతో... ఆఖరు....తెగేవరకూ లాక్కండి...ఈ రోజున మీ కాలు పోడానిక్కారణం మేమే అన్నట్టు డాక్టరుగారు మాట్లాడారు...యిన్నాళ్లూ మీరేం చేస్తున్నారని మమ్మల్నడిగారు మీరేనాడు మామాట విన్నారుగనుక...దిసీజ్ ఫైనల్...వీధిజనాల్తో మాటలుపడాల్సినవసరం మాకు లేదు"

విసవిసానడుస్తూ బైటికెళ్లిపోయింది...

బాలుకు ఫోన్చేసా....

పావుగంటలో వచ్చేసాడు...

బాలసుబ్రహ్మణ్యం ఎమ్మేఫిలాసొఫీ...

ఫిలాసొఫర్ బాలు....

"బాలూ కూచో....ఫార్మల్గా ఫీలవ్వకు...దయచేసి నా స్నేహితుడిగా వుండు" అన్నా....

అదే నిర్వికారపు చూపు...

సీక్రెట్ లాకరోపన్చేసి...బాలుకోసం అట్టిపెట్టిన బ్రౌన్ కవర్‌తీసా....

"బాలూ....దీన్ని తీసుకో నీకే నీకిష్టమొచ్చిన రీతిలో ఖర్చు పెట్టుకో"

అని బాలుకిచ్చా....

"ఏమిటి సర్ యిదీ?" అని కవర్లోకి తొంగిచూసి....

"సర్....యింతడబ్బు! నా కెందుకుసర్?" అని టీపాయ్‌మీదుంచాడు ఆ కవర్ని...

"బాలూ! యింకేం మాట్లాడకు...ఆ డబ్బు తీసుకో....అంతే....రేపుదయాన్నే వచ్చేయి...డాక్టరుగారు కాలు తీసేయాలంటున్నారు... నువ్వు నా పక్కనుంటే నాక్కాస్త ధైర్యం" అన్నా...

అర్థమైందన్నట్టు తలూపాడు బాలు...

"బాలూ చావు గురించి నీ అభిప్రాయమేమిటి?" అడిగా...చిన్నగా నవ్వాడు..

"అనుభవంలోకి రాని దాని మీద అభిప్రాయమెట్లా వుంటుంది సర్" అన్నాడు..

"నువ్వు చావులు చూళ్లేదా?" అడిగా....

"చూడ్డం వేరు....చావడం వేరు కద్సార్"

"అంటే?"

"మామిడికాయ పప్పు ఎవడోతింటూంటే చూసి మామిడికాయ పప్పు రుచి చెప్పలేం కద్సర్....మనం తినే చెప్పాలి....ముందు నన్ను చావనివ్వండి దాంతర్వాత చావు గురించి చెప్తా" నవ్వుతూ అన్నాడు బాలు

"యస్....యస్....యూఆర్ యాప్సలూట్లీరైట్" అన్నాన్నేనుకూడా బిగ్గరగా నవ్వా...

"అయినా ఎందుకుసర్ అలాంటి మాటలు మాట్లాడుతున్నారు?" బాలు అడిగాడు...

"ఏమీలేదు క్యాఘువల్ అంతే"

"తెలుసుకోలేనంత అమాయకుణ్ని కాదు సర్...దయచేసి అలాంటి అలోచనలేవీ రానివ్వకండి... ప్లీజ్.... మీమీద నాకు గౌరవముంది. నా జీవితంలో ఎవరినేనా మర్యాదించానంటే అది మిమ్మల్నే....మీ తమ్ముళ్లాంటివాణ్ని...ప్లీజ్ డోంట్ ఎంటర్టేన్ ఎనీథింగ్ డార్క్..." బాలు....

మధ్యాహ్నం వరకూ వుండి ఉదయాన్నే వస్తా అన్చెప్పి బాలు వెళ్లిపోయాడు...

మధ్యాహ్నం భోజనం గదిలోకి తెచ్చిపెట్టింది శ్యామల...

అటూయిటూ కెలికి భోజనం అయ్యిందనిపించా...

టేబుల్ శుభ్రం చేస్తూ కూడా శ్యామల నిశ్శబ్దాన్నే ధరించింది....

శ్యామల వెళ్లిం తర్వాత కిటికీ వేపుకు రాకింగ్ చెయిర్ లాక్కుని కిటికీలోంచీ చూస్తూ కూచున్నా....

జీవితం మొత్తాన్నీ రీవైండ్ చేయడానికి ప్రయత్నించా....

బాల్యం నించీ....ఈ క్షణం వరకూ...

ఎక్కడా ఓ మెత్తటి అనుభూతి లేదు....

సుఖం తప్ప....

ఆనందం అన్నది శూన్యం

నిజమే సుఖం శారీరకం... ఆనందం ఆత్మకు సంబంధించినది.

ఆత్మకా మనసుకా....

ఆత్మంటూ వుందా అసలు...

ఆత్మ మనసు వేరువేరా...

నా శరీరానికతీతంగా ఆత్మవుందా?....

వుంటే నా మరణానంతరం దానికి అస్తిత్వముండాలికదా!

నో...ఈ శరీరానికతీతంగా ఏదీ లేదు....

మరణానంతరం....ఈనా ప్రపంచం అంతమైపోతుందంతే....

ఇప్పటి వరకూ ఈ ప్రపంచం నాకు అస్తిత్వం కలిగిందైవుంది...

అంతే అంతే...

సాయంకాలం ఉమానాథ్ ఫోన్చేసి మళ్లీ తిట్టి ఉదయాన్నే హాస్పిటల్కి వచ్చేయమన్నాడు...

గదిలోంచి బైటకెళ్లి కాసేపు వరండాలో పేము కుర్చీలో కూచున్నా....

చీకట్లలుముకున్నాయి...

వీధి దీపాలు వెలిగాయి....

నా గుండెల్లోని చీకట్లలో కూడా ఏదో వెన్నెల వెలుగు దీపం వెలిగింది.

శ్యామల వరండాలోకొచ్చి నుంచుంది...

మనిద్దరిదీ ఏ విధమైన అనుబంధం శ్యామలా అనుకున్నా

ఓ పదినిముషాల మౌనం తర్వాత

"రేపుదయాన్నే హాస్పిటల్కి వెళ్దాం...పడుకోండి భోజనం గదిలోకి తెస్తాను" అని లోపలికెళ్లింది...

కాసేపు కూచుని నెమ్మదిగా కాళ్లీడిస్తూ గదిలోకెళ్లాను..

గదిలోకెళ్లిన ఓ పావుగంటకు శ్యామల భోజనంతో వచ్చింది...

"త్వరగా భోంచేసి పడుకోండి ఉదయాన్నే హాస్పిటల్కి వెళ్లాలి" అని తలుపులు చేరవేసి వెళ్లబోయింది...

"ఆగు" అన్నా

ఆగింది

నఖశిఖపర్యంతం ఆ వ్యక్తిని ఎగాదిగా చూశా

"ఏమీ లేదు వెళ్లు.గుడ్నైట్

అయామ్ సారీ ఫరెవ్రిథింగ్" అన్నా

తలాడించి వెళ్లిపోయింది

ఆమె వెనక తలుపులు మూసుకున్నాయి

నే తీసుకున్న నిర్ణయం సరైందేనా?

పారిపోతున్నానా?

ఇది పిరికితనమా?

దేన్నించి పారిపోతున్నా? దేనికి భయపడుతున్నా?

పారిపోడమూకాదు పిరికతనమూ కాదు...

బ్రతికున్నా....ఇక జీవితంలేదు...

ఏదో చివరి మజిలీకొచ్చేసిన భావన...

మూసేసిన తలుపుల వేపుచూసా....

ఈ ప్రపంచంలో నా హృదయానికి దగ్గరగా వచ్చిన వాళ్లెవరూ..?

మీ తమ్ముళ్లాంటివాణ్ణి

ప్లీజ్ డోంట్ ఎంటర్టేన్ ఎనీథింగ్ డార్క్... బాలు....

సారీ బాలూ... ఐథింక్ ది సీజ్ నాటెటాల్ డార్క్

దిసీజ్ అబ్సలూట్ బ్లిస్....సారీ వన్సెగేన్ మై డియర్ బాలూ...

బ్రాతూం కబర్డ్లోంచి సీసాతీసా...

సగానికి పైగా వున్నాయి మాత్రలు....

విస్కీ గ్లాసులో సగానికి పోసి నీళ్లతో నింపా...

సంకల్పరహితంగా జిడ్డుకృష్ణమూర్తి ఆఖరి వ్యాసం గుర్తొచ్చింది

ఓ పండుటాకులాగా మనుషులెందుకు మరణించరు...

దయనీయంగా...విషాదంగా... రోగాలతో... ముసలి తనంతో...

అపస్మారకంగా శరీరాలు కృశించి...అసహ్యమై.. నాశనమవుతారు ఎందుకు..

అందమైన పండుటాకులాగా ఎందుకు మట్టిలో జీర్ణమైపోరు...

చేతిలోకి ఓ ఆరేడు మాత్రలు వేసుకున్నా...

ఆశ్చర్యంగా చేయి నిశ్చలంగా వుంది..

కళ్లు మూసుకున్నా...

తలపైకెత్తి ఆ మాత్రలు నోట్లోవేసుకున్నా..

విస్కీతో మింగేసా..సిగరెట్ వెలిగించి గుండెల్నిండా పొగ పీల్చా

ఆఖరి సిగరెట్...

నాన్నముఖం గుర్తొచ్చింది...

అతిదయనీయంగా ఆయన మరణించడం గుర్తొచ్చింది...

ఆయనతో నేచేసిన యుద్ధం గుర్తొచ్చింది.

భార్గవ...పిన్ని...చెల్లెళ్లు...రాజుగాడు...శ్యామల...ముసల్ది...ఒకరి తర్వాతిం కొకరు...

ఇంకొన్ని మాత్రలు...

మరింత విస్కీ...

కళ్లు మూతలు పడుతూన్నాయి...

మసక మసకగా వుంది...

అన్నం పళ్లెమ్మీద మూతతీసా...

రెండు మెతుకులు నోట్లో వేసుకున్నా...

చివరి మెతుకులు...

తలుపులవేపు చూసా...

మూసున్నాయి...

బాలుగుర్తొచ్చాడు...

మామిడికాయ పప్పు తింటున్నా బాలూ అనుకున్నా...

ఇంకొన్ని మాత్రలు
మరింత విస్కీ...
మూసిన తలుపులు మసక మసకగా...
రేపుదయం ముందెవరు తెరుస్తారో ఆ తలుపులు...
అప్పటికిక అసలు తలుపులు ఎవరూ తెరువలేరు...
కళ్లు మూతలు పడిపోతున్నాయి...

✻ ✻ ✻

# అంతా అయిపోయాక...

ఇంకా ఏం మిగిలింది చదవటానికి అని మీరు అడగొచ్చు. వుంది కనుకనే ఈ నాలుగు మాటలూను. ఈ కాశీభట్ల వేణుగోపాల్ అనే వ్యక్తితో నాకు ముఖ పరిచయం ఎంతమాత్రమూ లేదు. కానీ నాకు ఆయన నవల 'నేనూ–చీకటి' అంటే చాలా ఇష్టం. నేను ఆంధ్రప్రభలో పని చేస్తున్నప్పుడు ఆ నవలను ఒక పోటీకి పంపారు ఆయన. పోటీకి వచ్చిన నవలల్లో నుంచి నిర్ణేతలకు పంపదగిన నవలలను ఎంపిక చేసే బాధ్యతలో భాగంగా ఈ నవల చదివాను. ఆ నవల నన్ను చాలా చాలా డిస్టర్బ్ చేసింది. వెంటనే అప్పటి సంపాదకులు శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారికి ఆ నవల గురించి చెప్పకుండా వుండలేకపోయాను. శర్మగారు కూడా ఆ నవల చదివి ఇలాంటి నవల నిలబడితే బాగుండుననుకొన్నారు. దురదృష్టం ఏమిటంటే నిర్ణేతలకు ఆ నవలలోని జీవన భీభత్సం భయం కలిగించిందో లేక వారి మానసిక స్థితి 50–60 దశకాల నాటి నవలల ఫ్రేమ్‌లో ఇరుక్కుని పోయిందో కాని ఆ నవలకు బహుమతి రాలేదు. అయినా ఆ నవలను మేం వదులుకోలేక సాధారణ ప్రచురణగా మాత్రమే వేసుకోగలిగాం. ఆ నవల ప్రచురణ జరుగుతున్న కాలంలో బయటి ప్రపంచంలో మేధావులుగా చలామణి అవుతున్న రచయితలలో చాలామంది అలాటి నవలను ప్రచురించి ఆంధ్రప్రభ ప్రమాణాలను దిగజార్చామని మా దగ్గర వ్యాఖ్యానించారు. జీవితం ఇలా కూడా వుంటుందని తెలియని ఆ మేధావులకు ఒక నమస్కారం పెట్టటం తప్ప చేయగలిగింది ఏమీ లేదు.

అలా ఆ నవల ద్వారా నా మానసిక ప్రపంచంలోకి దూసుకొచ్చిన ఈ వేణుగోపాల్ అనే వ్యక్తి 'తపన' అనే మరో నవలతో నన్ను జయించాడు. నిజానికి నా సాహితీ వ్యాసంగం, అభిరుచులు, నిష్ఠలతో పరిచయం కల చాలామందికి నాకు ఈ రెండు నవలలు నచ్చాయనేది జీర్ణించుకోలేని విషయం. తెలుగు రచయిత అసలు సిసలు జీవితం నుంచి పారిపోయి, వేదికల మీదికెక్కి ఉపదేశాలు చేయటం మొదలై చాలాకాలం అయింది. జీవితంలోని బీభత్సం వారి కళ్ళకు కనపడటం మానేసి చాలా ఏళ్ళయింది. వారు చెప్పినది, వారు రాసినదీ మాత్రమే జీవితం అనుకొనే, అనుకోమనే మనస్తత్వం ఊడలు దిగీ దశాబ్దాలైంది. తమ మూలాల నుంచి విడిపోయి నగరాలకు

విచ్చేసి తాము తమ జీవిక కోసం స్వచ్ఛందంగా సన్యసించిన ఆనాటి – అంటే 50–60 దశకాల జీవితాన్ని పట్టుకొని వేళ్ళాడుతూ అప్పటి కథా వస్తువులనే ఈ తరం పాఠకుల మీద రుద్దేసి, అలాటి మానసిక జాడ్యం లోనే వున్న వారి చేత క్లాసిక్స్‌గా పొగడ్తలు పొందుతూ, జీవితం ఇలా కూడా వుంటుందని తెలియని ఒకానొక కూపస్థ మాండూక్య స్థితికి వెళ్లిపోయిన తెలుగు రచయితలనువేణుగోపాల్ నవలలు (దీనితో కలిపి) అయిదూ చదవమని బతిమాలుకొంటున్నాను. ఈ మహా రచయితలు ఎవరి సలహాలూ వినే స్థితిలో లేరు కనుక.

ఈ కథా వస్తువును ఒక మిత్రుడు చెప్పి రాయమన్నాడు. ఈ వస్తువు సమర్థంగా నిర్వహించగల ఒకే ఒక్కడు వేణుగోపాల్ అని నేను చెప్పాను. అది ఇన్నాళ్ళకి ఫలించింది. పట్టు వదలకుండా, అంతకు ముందు ముఖపరిచయమైనా లేని రచయిత నుండి ఇలాటి నవలను రాయించగలిగినందుకు ముందుగా ఆ మిత్రుని అభినందిస్తున్నాను. ఆ మిత్రుని నిర్నిబంధం వల్లనూ, చాలాకాలంగా మనసులోనే వున్న మాటలు చెప్పుకొనే అవకాశం కలిగిందన్న తృప్తితోనూ, నాకు వేణుగోపాల్‌పై వున్న ఇష్టంతోనూ ఈ నవల గురించి నాలుగు మాటలు మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

మీరు ఈ నవల ఆసాంతం చదివారు. ముందుగానే వేణుగోపాల్ అన్నట్లు ఇది కల్పితమనో, పాత్రలు ఊహాలనో బుకాయించటం అనవసరం. ఇలాటి పాత్రలు మన జీవితాలలోనో, మన ఎదురుగానో చాలా వున్నాయని మనకు ఖచ్చితంగా తెలుసు – మనం ఒప్పుకోం – అంతే! తీవ్రతలలో తేడాలే తప్ప ఇలాటి భర్తలు, భార్యలు, అత్తగార్లూ, కొడుకులు మనకు నిత్య పరిచితులు. అయితే ఈ నవలలోని నాయకుడు ఏం చేశాడు అన్నది ప్రశ్న. సగటు మధ్య తరగతి పాఠకుడికి అతగాడు పచ్చి తాగుబోతుగా, భార్యపుత్రుల బాగోగులను పట్టించుకోని వాడుగా కనపడటం సహజం. డబ్బు సంపాదించి ఇవ్వటం, పూర్వీకుల ఆస్తులలో వాటాలు డిమాండ్ చేసి తెచ్చి ఇవ్వటం అనే రెండు పనుల కోసమే అతగాడు వారికి కావాలి. నువ్వు ఒకందుకు పోస్తే నేను ఒకందుకు తాగానని మాట వుంది మనకి. సరిగ్గా అదే అతగాడి పరిస్థితి. అయినా అతగాడు బతకలేదు, పరిపూర్ణంగా జీవించాడు. అధునాతనమైన జీవనయానంలో మనం బాగా డబ్బులు సంపాదించి, ఆస్తులు కూడబెట్టి, అమెరికా వంటి దేశాలకు వెళ్ళి ఎంతో గొప్పగా జీవిస్తున్నామనే భ్రమలోనే వున్నాం. నిజానికి

బతకటానికీ, జీవించటానికీ వున్న గొప్ప తేడాని మనుషులు మరచిపోయి చాలా కాలం అయిపోయింది. అంటే పీకలదాకా తాగేసి చచ్చిపోవటమేనా జీవితమంటే అని ప్రశ్నించటం చాల సులభం. కానీ ఒక్క క్షణం నిదానంగా ఆలోచిస్తే మనం బతుకుతున్నామో లేక జీవిస్తున్నామో ఇట్టే తెలిసిపోతుంది. సమస్త ఇంద్రియాలూ పనిచేస్తూ, వాటి తాలూకు అనుభవాలను విడివిడిగా గుర్తుపట్టగలుగుతూ, ఆ అనుభూతులను విచక్షణతో బేరీజు వేసుకోగలిగిన జీవులుగా మనుషులు ఇవాళ నిజంగా జీవిస్తున్నారా లేక జంతుజాలంలా ఆహార నిద్రా భయ మైధునాలతో యాంత్రికంగా, అనుభవ జ్ఞానరహితంగా బతికేస్తున్నారా అని ఒక్క క్షణం ఆలోచించుకుంటే మన బతుకులు ఏ డ్రెయినేజీల్లో వున్నాయో మనకే అర్థం అవుతుంది. ఆ లెక్కలో ఈ నవలలోని సదరు పచ్చితాగుబోతు పరిపూర్ణంగా జీవించాడు. తనేమి చేస్తున్నాడో తెలిసి జీవనకళను పూర్తిగా అనుభవించిన కాన్షస్ ఆర్టిస్ట్ ఆ వ్యక్తి. సరిగ్గా మనలాంటి వాడు కూడా ఒకడున్నాడు ఈ నవలలో. అతడే బాల సుబ్రహ్మణ్యం. దొరికిన బతుకుతో సర్దుకొని పోవటం మాత్రమే తెలిసినవాడు. తను జీవించడం లేదని తెలిసి కూడా జీవించటానికి ఎంతమాత్రమూ ప్రయత్నించకుండా దొరికిన బతుకుతో సర్దుకొనిపోయే మనలాంటి మనిషి. పరిపూర్ణంగా జీవించటానికి చచ్చిపోవటమే మార్గమా అంటే ఏమో, ఇది నిజమేమో, ఎన్నారై మిత్రుడు చెప్పిన కథ కదా. ఇందులోని చావు ఆ వ్యక్తిది అనుకొంటే అది మన భ్రమ. అది ఏళ్ళతరబడి అనుభవించిన నరకానికి వీడ్కోలు. తన జీవితాన్ని కేవలం బతుకుగా మార్చిపారేసిన వారికి అతగాడు విధించిన యావజ్జీవ శిక్ష. అతడు చచ్చినందుకు వారికి ఏలాటి బాధా వుండదు కానీ, ఆస్తిని అతగాడు త్యజించిన వైనం వారికి విధించిన మరణదండన.

ఇలాటి నవల రాసిన వాడు తెలుగు సాహిత్యానికి పరమద్రోహి అని రకరకాల మడిబట్టల రచయితలూ, ఇందాకా అనుకొన్నట్లు 50-60 లలోనే వయసు స్తంభించిపోయిన పాఠకులూ, వారి నాయకులూ అనవచ్చు. కాదు కాదు, అంటారు. కానీ తెలుగు నవలకీ, కథా సాహిత్యానికీ ఇలాటి షాక్ ట్రీట్‌మెంట్‌లు ఇంకా చాలా కావాలి. కోమాలో వున్న తెలుగు నవలను బతికించే ప్రయత్నం చేసిన, వేణుగోపాల్‌నీ, అతగాడి చేత దీన్ని రాయించిన ముసుగు మనిషినీ మనసారా కౌగిలించుకుంటున్నాను.

నిజానికి ఇంకా ఎంతో చెప్పాలి దీన్ని గురించి. మనస్తత్వ శాస్త్రంతో ఈ నవలని ఎంతగానో విశ్లేషించవచ్చు. అస్తిత్వవాదంతో దీని లోతులకు ఈదుకుంటూ

వెళ్ళవచ్చు. 'ద వర్చ్యూ ఆఫ్ సెల్ఫిష్‌నెస్' పుస్తకం మొత్తాన్నీ దీనికి అన్వయించవచ్చు. అవన్నీ మీ అనుభూతిని – అలాటిదేమైనా మీకు కలిగితే – పాడు చేస్తాయి. వాటన్నిటినీ పరిశోధకులకీ, సాహిత్య విశ్లేషకులకీ వదులుతున్నాను. పై నాలుగు మాటలైనా ఎందుకో ముందే మనవి చేసుకున్నాను. దానికితోడు మరొక్క మాట కలిపి ముగిస్తాను. పై నాలుగు మాటలూ ఎందుకంటే ప్రాచీన, అధునాతన సాహిత్య శాస్త్రాల చట్రాలలో నుంచే ఈ నవలని చూసి విశ్లేషణకు పూనుకొనే మహా విమర్శక శిఖామణులను దయచేసి ఈ నవలని ఒక జీవితంలా చూడమని చెప్పటానికి కూడా ఈ నాలుగు మాటలూ ఉపయోగపడాలని కోరుకొంటున్నాను. అందుకే ఈ మాటల్ని నవల ముందు కాకుండా నవల అంతా అయిపోయాక వెనక పడేయమని పబ్లిషర్స్‌ని కోరుకుంటున్నాను. మరోసారి – మిస్టర్ వేణుగోపాల్, ఐ లవ్ యూ.

**– ఫణిహారం వల్లభాచార్య**

ఇది కాపీ కథ!
జీవితాన్ని కాపీకొట్టి రాసిన కథ!

ఈ టైపు కథలే నాకిష్టం. ఈ కథలు నేలమీదుంటాయి. కాబట్టి అందుబాటులో వున్న ఫీలింగు కలుగుతుంది!

అక్షరాల్లో బొమ్మలు చూపించడం కూడా ఒకానొక ప్రత్యేకమైన కళ!

అందరు రచయితలు అక్షరాల్తో ఈ ఫీటు చేయలేరు. చెయ్యి తిరిగిన రచయితల్లో కొందరు మాత్రమే ఈ కళని పోషిస్తుంటారు!

ఇల్లాంటి కథలు గాల్లో కలిసిపోకుండా గుండెల్లో కాపరముంటాయి. కలకాలం గుర్తుండి పోతాయి!

అందుకు సాక్ష్యమే-
ఈ "తెరవని తలుపులు"!
త్రీ ఛీర్స్ టు వేణుగోపాల్

- ఆదివిష్ణు